ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY



బుధవారం, 04 నవంబర్ 2016 | Wednesday 04 November 2026 | హైదరాబాద్ | పేజీలు: 12+12 | వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA

సంపుటి: 28 సంచిక: 195 | Vol.No 28 Issue No .195 | Hyderabad | www.visionandhra.in

తుమ్మిడిహట్టి బ్యారేజ్‌పై మహారాష్ట్రతో
నిరంతర సంప్రదింపులు జరపాలి

ముంపు భూములకు పరిహారం చెల్లించేందుకు సిద్ధం

- అవసరమైన నిధులను జాయింట్ అకౌంట్‌లో ఉంచుతాం: సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 3 (విజన్ ఆంధ్ర):

తుమ్మిడిహట్టి బ్యారేజ్ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ముంపునకు సంబంధించిన పూర్తి వివరాలు, ఇప్పటికే చేసుకున్న ఒప్పందాలు, ఇతర కీలక అంశాలకు సంబంధించిన పత్రాలను సిద్ధం చేసి మహారాష్ట్ర అధికారులకు అందజేయాలని సూచించారు.

జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులతో తుమ్మిడిహట్టి బ్యారేజ్‌పై సమీక్ష నిర్వహించారు. మహారాష్ట్రతో ఇటీవల జరిపిన చర్చలు, ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ అంశాలపై అధికారులతో చర్చించి పలు

02


- గాంధీభవన్ నుంచి ఢిల్లీ వరకు లీక్ రాజకీయం, అంతర్గత వర్గపోరుతో పార్టీకి చేటు?
- సొంత ఎమ్మెల్యేలే ప్రభుత్వంపై విమర్శలు, 2029 వరకు పార్టీ మనుగడపై పెద్ద చర్చ



తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, నవంబర్ 03:

అధికార పార్టీలో ఇప్పుడు అంతా సజావుగా లేదు. మొన్న ఒక సీనియర్ మంత్రి, నిన్న మరో సీనియర్ మంత్రి, ఇప్పుడు మరో కీలక మంత్రి... వరుసగా వివాదాల్లోకి లాగబడుతున్న తీరు రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీసింది. ఒకప్పుడు పార్టీకి వెన్నెముకగా నిలిచిన సీనియర్ నేతలే ఇప్పుడు వరుసగా టార్గెట్ అవుతుండటం యాదృచ్ఛికం కాదని, దీని వెనుక పక్కా వ్యూహం ఉందనే ప్రచారం గాంధీభవన్ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది.

అధికార పార్టీలో
వర్గ పోరు
సీనియర్లకు వరస షాకులు



ఢిల్లీ లీక్ తో మొదలైన రాజకీయ వేడి

అసలు వివాదం ఢిల్లీలో మొదలైంది. పార్టీ కార్యాలయంలో ఒక సీనియర్ మంత్రికి, ఏఐసీసీ కార్యదర్శి స్థాయి నేతకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగిందని, ఆ సమయంలో మంత్రి అనుచితంగా ప్రవర్తించారనే వార్త ఒక్కసారిగా మీడియాలోకి లీక్ అయింది. ఆ వార్త లీక్ అయిన తీరు, ఆ తర్వాత కొన్ని అనుకూల మీడియా ఛానళ్లు, సోషల్ మీడియా హ్యాండిల్స్ లో వరుసగా వచ్చిన పోస్టులు చూస్తే ఇది సహజంగా జరిగిన లీక్ కాదని, ఉద్దేశపూర్వకంగా చేయించిన ప్రచారమని స్పష్టమవుతోందని పార్టీ సీనియర్లు అంటున్నారు. అధిష్టానం దగ్గర తనకు నచ్చని సీనియర్లను బలి చేసి, తనకు అనుకూలమైన నేతలకు ప్రాధాన్యత ఇచ్చే వ్యూహంలో భాగంగానే ఈ

02

'దమ్కీలు ఇస్తే భయపడేవాళ్లం కాదు'..
అమిత్ షాకు మంత్రి అడ్లూరి కౌంటర్!

- అమిత్ షా పర్యటనపై మంత్రి అడ్లూరి విమర్శలు
- ఎస్ఐఆర్‌తో ఓట్ల తొలగింపునకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపణ
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్

కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో తెలంగాణ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తప్పులు చేస్తే కేంద్ర హోంశాఖ చేతిలో ఉన్న అధికారాలతో వాటిని బయటపెట్టాలని సవాల్ విసిరారు. జనాలను పోగేసి దమ్కీలు ఇస్తే భయపడేవాళ్లు ఇక్కడ ఎవరూ

02



కురుమూర్తి జాతరకు
పోలీస్ శాఖ
అభేద్య భద్రతా వలయం

- ప్రత్యక్షంగా రంగంలోకి దిగిన ఎస్పీ జానకి
- నవంబర్ 10 నుంచి బ్రహ్మోత్సవాలు షురూ, నవంబర్ 16న మహా ఉద్దాల ఉత్సవం
- లక్షలాది భక్తుల తాకిడికి ముందస్తు మాస్టర్ ప్లాన్

02

తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, నవంబర్ 03: ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజల ఆరాధ్యదైవం, తెలంగాణ తిరుపతిగా పేరొందిన శ్రీ కురుమూర్తి



కాబోయే టీచర్లకు
సామాజిక పరీక్ష!
డిగ్రీ కావాలంటే 5గురికి అక్షరాలు నేర్పాల్సిందే

- బోధిస్తే సరిపోదు, పాస్ చేయించాలి, ఉల్లాస్ కింద కొత్త రూల్
- ఎన్సీటీఈ సంచలన మార్గదర్శకాలు, దేశవ్యాప్తంగా 17 లక్షల సీట్లకు వర్తింపు

తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, నవంబర్ 03:

ఇకపై టీచర్ కావాలంటే పుస్తకాలతో కుస్తీ పడితే సరిపోదు, సమాజంలోకి వెళ్లి అక్షరజ్ఞానం పంచాలి. పట్టా చేతికి రావాలంటే ఐదుగురిని నిరక్షరాస్యుల నుంచి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాల్సిందే. ఉపాధ్యాయ విద్యలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నిబంధన ఇది. కేంద్ర విద్యా శాఖ రూపొందించిన 32 పేజీల తాజా మార్గదర్శకాలను జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి, ఎన్సీటీఈ విడుదల చేసింది. ఉల్లాస్ - నవభారత్ సాక్షరత కార్యక్రమంలో భాగంగా ఈ నిబంధనలను తప్పనిసరి చేసింది.



17 లక్షల మందికి వర్తించే రూల్

దేశవ్యాప్తంగా ఎన్సీటీఈ గుర్తింపు పొందిన 15,509 ఉపాధ్యాయ విద్యా సంస్థలు ఉన్నాయి. వాటిలో 17,84,326 సీట్లు ఉన్నాయి. ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్, ఐటీఈపీ, డీఎల్ఎడ్, బీఈడీ, ఎంఈడీ, బీపీఈడీ, ఎంపీఈడీ

02



హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల పండుగ, నాంపల్లిలో
ఈ-లాటరీ హడావుడి

- 4 నియోజకవర్గాలకు లక్కీడ్రా, ఆరుగురు లబ్ధిదారుల పేర్లు ప్రకటించిన మంత్రి పొన్నం
- 5500 ఇళ్ల లక్ష్యం, త్వరలోనే భూమి పూజ అంటూ హామీ

02

తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, నవంబర్ 03:

పేదల సొంతింటి కలను నిజం చేసే ఇందిరమ్మ ఇళ్ల పథకం హైదరాబాద్‌లో వేగం పుంజుకుంది. నాంపల్లి గృహకల్ప కార్యాలయంలో హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ నాలుగు

వరంగల్
సూపర్ స్పెషాలిటీకి మోక్షం
- యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని మంత్రి రాజనర్సింహ ఆదేశం

- టిమ్స్ అల్వాల్, ఎల్బీ నగర్, వరంగల్ ఆసుపత్రులపై సెక్రటేరియట్‌లో హై లెవల్ రివ్యూ
- ఈ నెల 15 నాటికి ఓపీ సేవలు షురూ



తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, నవంబర్ 03, సెక్రటేరియట్:

ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి రానుంది. పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, పూర్తిస్థాయి వైద్య సేవలు అందించేలా ఆసుపత్రిని సిద్ధం చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సెక్రటేరియట్‌లో మంగళవారం రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న మూడు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు - వరంగల్ సూపర్ స్పెషాలిటీ, టిమ్స్ అల్వాల్, టిమ్స్ ఎల్బీ నగర్ (కొత్తపేట) ఆసుపత్రుల నిర్మాణ పురోగతిపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆర్ అండ్ బీ శాఖ ఈఎన్సీ, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు, టీఎస్ఎంఎస్ఐడీసీ అధికారులు, మూడు ఆసుపత్రుల నిర్మాణ సంస్థల ప్రతినిధులు

02



పాలేరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు
శ్రీకారం

- రెండో విడతలో 187 మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు
- జూన్ నాటికి వందపడకల ఆసుపత్రి పనులు పూర్తి చేయాలి

02

RR ట్యాక్స్ పై సీబీఐ విచారణకు
అమిత్ షా ఎందుకు భయపడుతున్నారు?

- తెలంగాణ నుంచి ఢిల్లీకి వందల కోట్లు తరలిపోతున్నాయని మోదీ, షా ఆరోపణ, కానీ ఇంతవరకు ఒక్క సోదా లేదు, ఒక్క కేసు లేదు
- గల్లీలో కుస్తీ, ఢిల్లీలో దోస్తీ అన్నట్లు బీజేపీ రాజకీయ డ్రామా: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు

02



కంగ్రాట్స్ చంద్రబాబు టీమ్!

- మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై స్పందించిన వైసీపీ అధినేత జగన్
- చంద్రబాబు, పోలీసులు, ఎస్ఈసీకి కంగ్రాట్స్ అంటూ వ్యంగ్యం
- ఇవి ఎన్నికలు కాదని, ఏకపక్షంగా జరిగిన సెలక్షన్లని ఆరోపణ
- నామినేషన్ల నుంచి కౌంటింగ్ వరకు ప్రక్రియను హైజాక్ చేశారని విమర్శ
- ఎన్నికల సంస్కరణల ఆవశ్యకత స్పష్టమైందని వ్యాఖ్య



అమరావతి : ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో అధికార కూటమి ప్రభంజనం సృష్టిస్తున్న వేళ, వైసీపీ అధినేత జగన్ సోషల్ మీడియా వేదికగా ఘాటుగా స్పందించారు. ఎన్నికల ప్రక్రియ ఏకపక్షంగా జరిగిందని ఆరోపిస్తూ, ఇవి ఎలక్షన్లు కావని, సెలెక్షన్లు అని ఆయన వ్యంగ్యం


02

ఆర్టీజీఎస్, టెక్నాలజీతో
తుపానుల గండం గట్టెక్కాం

- అర్నబ్, మురసు తుఫాన్లపై ఆర్టీజీఎస్‌లో సీఎం మీడియా సమావేశం
- ప్రాణ నష్టం నివారించి, ఆస్తి నష్టం తగ్గించగలిగామన్న చంద్రబాబు
- టెక్నాలజీ సాయంతో 90 శాతం కచ్చితత్వంతో అంచనాలు
- రికార్డు సమయంలో విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ
- సహాయక చర్యల్లో సిబ్బంది ప్రాణాలకు తెగించి పనిచేశారని కితాబు

02

అమరావతి : రాష్ట్రంపై వరుసగా విరుచుకుపడిన అర్నబ్, మురసు తుపానులను సమర్థవంతంగా ఎదుర్కొన్నామని, టెక్నాలజీని వాడుకుంటూ పక్కా ప్రణాళికతో పనిచేయడం వల్లే ప్రాణనష్టాన్ని నివారించగలిగామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మంగళవారం అమరావతిలోని ఆర్టీజీఎస్ (రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ) కేంద్రం నుంచి ఆయన మీడియా సమావేశంలో



ట్రంప్‌కు అగ్నిపరీక్ష..

- అమెరికాలో మొదలైన మధ్యంతర ఎన్నికల పోలింగ్
- అమెరికాలో కీలకమైన మధ్యంతర ఎన్నికల పోలింగ్ ప్రారంభం
- ప్రతినిధుల సభలోని 435, సెనెట్‌లోని 35 స్థానాలకు ఓటింగ్
- అధ్యక్షుడు ట్రంప్ రెండేళ్ల పాలనకు ప్రజా తీర్పుగా భావిస్తున్న ఎన్నికలు
- గెలిస్తే ట్రంప్ నిర్ణయాలను అడ్డుకుంటామంటున్న డెమోక్రాట్లు
- భారత కాలమానం ప్రకారం బుధవారం ఉదయం నుంచి ఫలితాల వెల్లడి

02

ఆర్టీజీఎస్, టెక్నాలజీతో తుపానుల గండం గట్టెక్కాం

మాట్లాడారు. తుఫాన్ సహాయక చర్యల్లో ప్రభుత్వ యంత్రాంగం స్పందించిన తీరును ఆయన వివరించారు. తుపాను సహాయక చర్యల్లో భాగంగా రెస్క్యూ, రిలీఫ్, పునరావాసం అనే మూడు కీలక అంశాలపై ప్రధానంగా దృష్టి సారించామని ఆయన తెలిపారు. "ఈ రెండు తుపానుల గమనాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, గాలుల వేగాన్ని విశ్లేషించుకుంటూ ఆర్టీజీఎస్ ద్వారా క్షేత్రస్థాయి అధికారులకు పక్కా సమాచారం అందించగలిగాం. 'అవేర్' (AWARE) వేదిక ద్వారా విశ్లేషించుకుని, డేటా ఆధారంగా నిర్ణయాలు తీసుకున్నాం. గాలుల వేగం, వర్షపాతం, వరద నిర్వహణ వంటి అంశాలను 90 శాతం కచ్చితత్వంతో అంచనా వేశాం. ఈ అంచనాలను క్షేత్రస్థాయి వాస్తవాలతో పోల్చి చూసినప్పుడు మా విశ్లేషణ నిజమని తేలింది" అని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ ముందస్తు అంచనాల వల్లే ముంపు గ్రామాలను ముందుగానే గుర్తించి, ప్రభావిత ప్రాంతాల్లో సహాయక సిబ్బందిని, అవసరమైన పరికరాలను మోహరించగలిగామని ఆయన చెప్పారు. అధికార యంత్రాంగాన్ని ఉన్నతస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు కదిలించి, పూర్తి సమన్వయంతో పనిచేయడం వల్లే వీలైనంత త్వరగా సాధారణ పరిస్థితులు తీసుకురాగలిగామని అన్నారు. విద్యుత్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నదని, రాష్ట్రవ్యాప్తంగా 31 వేల విద్యుత్ స్తంభాలు నేలకూలాయని, 4095 గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని సీఎం తెలిపారు. 548 సబ్ స్టేషన్ల నుంచి సరఫరాకు అంతరాయం కలిగిందన్నారు. "సాధారణంగా ఇంతటి నష్టాన్ని పూడ్చడానికి కనీసం 20 రోజులు పడుతుంది. కానీ పక్కా ప్రణాళికతో కేవలం 4 నుంచి 5 రోజుల్లోనే విద్యుత్ వ్యవస్థను గాడిలో పెట్టగలిగాం" అని చంద్రబాబు వివరించారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అందరూ క్షేత్రస్థాయిలోనే ఉండి పనిచేశారని సీఎం ప్రశంసించారు. కుండపోత వర్షంలోనూ విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారని, కూలిన చెట్లను తొలగిస్తూనే స్తంభాలు వేశారని గుర్తుచేశారు. ఆక్వా చెరువుల్లో పడిపోయిన స్తంభాలను సైతం తిరిగి నిలబెట్టారని, ఈ ప్రక్రియ కోసం పెద్ద ఎత్తున డ్రిల్లింగ్ మిషన్లను వినియోగించామని వివరించారు. ఈ సహాయక చర్యల్లో విద్యుత్ సిబ్బంది ప్రాణాలకు తెగించి పనిచేశారని చంద్రబాబు అభినందించారు. మొత్తం మీద, ముందస్తు అంచనాలు, టెక్నాలజీ వినియోగం, అధికార యంత్రాంగం సమన్వయం, సిబ్బంది అంకితభావంతో పనిచేయడం వల్లే తుపానుల ప్రభావాన్ని వీలైనంత త్వరగా అధిగమించి, సాధారణ పరిస్థితులు నెలకొల్పగలిగామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

ట్రంప్‌కు అగ్నిపరీక్ష..

అమెరికా రాజకీయ భవిష్యత్తును నిర్దేశించనున్న కీలకమైన మధ్యంతర ఎన్నికల పోలింగ్ ప్రారంభమైంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (రిపబ్లికన్ పార్టీ) రెండేళ్ల పాలనకు ప్రజా తీర్పుగా భావిస్తున్న ఈ ఎన్నికల ప్రక్రియ మంగళవారం ఉదయం (అమెరికా కాలమానం ప్రకారం) మొదలైంది. న్యూయార్క్, న్యూజెర్సీ, వర్జీనియా, కనెక్టికట్ సహా పలు తూర్పు తీర రాష్ట్రాల్లో స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 6 గంటలకు పోలింగ్ మొదలవగా, ఓటు వేసేందుకు ప్రజలు ఉదయాన్నే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఈ ఎన్నికల్లో ప్రతినిధుల సభలోని మొత్తం 435 స్థానాలతో పాటు, సెనెట్‌లోని 100 స్థానాలకు గాను 35 సీట్లకు పోలింగ్ జరుగుతోంది. వీటితో పాటు 36 రాష్ట్రాల గవర్నర్ పదవులకు కూడా ఎన్నికలు నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా సుమారు 21 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. రికార్డు స్థాయిలో ఇప్పటికే 5.9 కోట్ల మంది ముందస్తు ఓటింగ్ (ఙుఖితీశ్రీఎ ఎశీఱఅఇ్ర) లేదా మెయిల్-ఇన్ బ్యాలెట్ల ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ఈ ఎన్నికలపై ప్రజల్లో ఉన్న ఆసక్తిని తెలియజేస్తోంది. అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తయిన నేపథ్యంలో, ఆయన పాలనకు ఈ ఎన్నికలను ఒక రెఫరెండంగా పరిగణిస్తున్నారు. ద్రవ్యోల్బణం, పెరుగుతున్న జీవన వ్యయం, సరిహద్దు భద్రత, అక్రమ వలసలు, వాణిజ్య సుంకాల వంటి అంశాలు ఓటర్లను ప్రధానంగా ప్రభావితం చేస్తున్నాయి. అత్యధిక సర్వేల ప్రకారం ఈ ఎన్నికల్లో డెమోక్రాట్లకే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంచనాలు వెలువడుతున్నాయి. ప్రస్తుతం కాంగ్రెస్‌లోని రెండు సభల్లో (ప్రతినిధుల సభ, సెనెట్) రిపబ్లికన్లకు స్వల్ప మెజార్టీ ఉంది. ఈ ఎన్నికల్లో డెమోక్రాట్లు కనీసం ఒక్క సభలోనైనా ఆధిపత్యం సాధిస్తే, అధ్యక్షుడు ట్రంప్ విధానపరమైన నిర్ణయాలకు, చట్టాల ఆమోదానికి అడ్డంకులు సృష్టించే అవకాశం లభిస్తుంది. అయితే, డెమోక్రాట్లు గెలిస్తే, వారు ప్రతిపాదించే ప్రతి బిల్లును తన వీటో అధికారంతో అడ్డుకుంటానని ట్రంప్ ఇప్పటికే స్పష్టం చేశారు. టెక్సాస్, మిచిగాన్, ఐయోవా వంటి కీలక రాష్ట్రాల్లో సెనెట్ స్థానాలకు తీవ్రమైన పోటీ నెలకొంది. పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది. భారత కాలమానం ప్రకారం బుధవారం (నవంబరు 4) తెల్లవారుజాము 5.30 గంటల నుంచి ప్రాథమిక ఫలితాలు వెలువడనున్నాయి. అయితే, భారీ సంఖ్యలో ఉన్న మెయిల్-ఇన్ బ్యాలెట్ల లెక్కింపు కారణంగా తుది ఫలితాలపై పూర్తి స్పష్టత రావడానికి కొన్ని రోజుల సమయం పట్టవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

కంగ్రాట్స్ చంద్రబాబు టీమ్!

ప్రదర్శించారు. చంద్రబాబు, పోలీసులు, రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఉద్దేశించి జగన్ వ్యంగ్యంగా అభినందనలు తెలిపారు. "ప్రతిపక్షానికి పోటీ చేసే అవకాశమే ఇవ్వకుండా ఎన్నికల్లో అద్భుతంగా ఎలా గెలవచ్చో నిరూపించినందుకు చంద్రబాబు టీమ్, పోలీసులు, ఎస్ఈసీకి కంగ్రాట్స్!" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. నామినేషన్ల దగ్గరి నుంచి మొదలుకొని స్క్రూటినీ, నామినేషన్ల ఉపసంహరణ, పోలింగ్ ఏజెంట్ల నియామకం, పోలింగ్ సరళి, పోలింగ్ శాతం, చివరకు కౌంటింగ్ వరకు ప్రతీ దశను అధికార పక్షం హైజాక్ చేసిందని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. అభ్యర్థులను ప్రజలు ఎన్నుకోలేదని, అధికార పార్టీయే వారిని సెలెక్ట్ చేసిందని ఎద్దేవా చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో దేశంలో ఎన్నికల సంస్కరణలు ఎంత అవసరమో స్పష్టమవుతోందని జగన్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా వెలువడుతున్న మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి భారీ విజయం దిశగా దూసుకెళుతుండగా, వైసీపీ అనేకచోట్ల పరాజయం పాలవుతున్న నేపథ్యంలో జగన్ చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

పాలేరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

ఖమ్మం జిల్లా, నవంబర్ 3 (విజన్ ఆంధ్ర): పాలేరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని పేర్కొంటూ, ఏదులాపురం మున్సిపాలిటీ, కూసుమంచి, తిరుమలాయపాలెం మండలాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. జిల్లా కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పర్యటించి, రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. కూసుమంచి మండల కేంద్రం సమీపంలోని గంగబండ తండా వద్ద రూ.45 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వందపడకల ఏరియా ఆసుపత్రి పనులను పరిశీలించారు. నిర్ణీత గడువు ప్రకారం వచ్చే ఏడాది జూన్ నాటికి నిర్మాణ పనులు పూర్తి చేసి ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం ఏదులాపురం మున్సిపాలిటీలోని 14, 15, 16 వార్డుల్లో సుమారు రూ.3.20 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెంలోని శ్రీ సాయి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అర్హులైన 187 మంది లబ్ధిదారులకు రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. మండలంలో మొదటి విడతలో 810 ఇళ్లు మంజూరు చేయగా, వాటిలో 700కు పైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. రానున్న రోజుల్లో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. తిరుమలాయపాలెం మండలంలో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో తెట్టెలపాడుబీరోలు రహదారి నుంచి ఏలువారిగూడెం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, బీరోలులో రూ.48 లక్షలతో చేపట్టనున్న ఓవర్‌హెడ్ వాటర్ స్టోరేజ్ రిజర్వాయర్ (ఓహెచ్ఎస్ఆర్) నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు, రవాణా సౌకర్యాలు, తాగునీటి వసతులు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు.

'దమ్కీలు ఇస్తే భయపడేవాళ్లం కాదు'..

లేరని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ పేరు చెబితే బీజేపీ ఎందుకు భయపడుతోందని ప్రశ్నించారు. బడుగు, బలహీన వర్గాలు కాంగ్రెస్‌కు అండగా ఉన్నందునే వారి ఓట్లను తొలగించేందుకు ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను బీజేపీ ఉపయోగించుకుంటోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వానికి నిజాయతీ ఉంటే ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని అడ్లూరి డిమాండ్ చేశారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని వివిధ పార్టీలు కోరుతున్నా కేంద్రం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. దీని వెనుక ఉన్న ఉద్దేశమేంటని నిలదీశారు. రాజ్యాంగం ద్వారా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రజలకు కల్పించిన ఓటు హక్కును హరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా వెనుక అదానీ, అంబానీ ఉన్నారని మంత్రి ఆరోపించారు. దేశ సంపదను ఆ ఇద్దరు పారిశ్రామికవేత్తల చేతుల్లో పెడుతున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు, ఎన్నికల ప్రక్రియపై బీజేపీని లక్ష్యంగా చేసుకుని అడ్లూరి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

RR ట్యాక్స్ పై సీబీఐ విచారణకు అమిత్ షా ఎందుకు భయపడుతున్నారు?

తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, నవంబర్ 03, తెలంగాణ భవన్:

తెలంగాణలో ఆర్.ఆర్ ట్యాక్స్ వసూళ్లు జరుగుతున్నాయని, ఆ డబ్బు ఢిల్లీకి తరలిపోతోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేస్తున్న సంచలన ఆరోపణలపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆరోపణల్లో నిజం ఉంటే, నిజాయితీ ఉంటే వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించాలని, లేదంటే తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.మంగళవారం తెలంగాణ భవన్ లో మీడియా తో మాట్లాడారు. తెలంగాణ నుంచి ఢిల్లీకి డబ్బులు పోతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా గత కొన్ని నెలలుగా ప్రతి సభలో చెబుతున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్.ఆర్ అంటే రాహుల్, రేవంత్ ట్యాక్స్ వసూలు చేస్తోందని ప్రచారం చేస్తున్నారు. కానీ ఇంతవరకు ఒక్క ఆధారాన్ని కూడా చూపలేదు, ఒక్క చర్య కూడా తీసుకోలేదని దాసోజు శ్రవణ్ నిలదీశారు.

అధికారంలో ఉన్నది మీరే, దర్యాప్తు సంస్థలు మీ చేతిలోనే

ఈ సందర్భంగా దాసోజు శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ, కేంద్రంలో అధికారంలో ఉన్నది బీజేపీయే. దేశంలోని అత్యంత శక్తివంతమైన దర్యాప్తు సంస్థలు సీబీఐ, ఈడీ, ఐటీ శాఖలన్నీ హోంమంత్రి అమిత్ షా చేతిలోనే ఉన్నాయి. మీకు నిజంగా తెలంగాణ నుంచి ఢిల్లీకి డబ్బులు వెళ్తున్నాయని తెలిస్తే, ఎందుకు దాడులు చేయడం లేదు అని ప్రశ్నించారు. ఒక్క కాంట్రాక్టర్ ఇంట్లో అయినా సోదాలు చేశారా? ఒక్క అధికారి ఇంట్లో అయినా తనిఖీలు చేశారా? ఒక్క చోట అయినా ఈడీ, ఐటీ దాడులు జరిగాయా? ఒక్క రూపాయి అయినా సీజ్ చేశారా? ఒక్క కేసు అయినా నమోదు చేశారా? లేదే. మరి మీ ఆరోపణలకు అర్థం ఏమిటి? ఇది కేవలం రాజకీయ ఆరోపణ కాదా అని ఆయన నిలదీశారు. ప్రధాని, హోంమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తులు మాట్లాడేటప్పుడు బాధ్యతగా మాట్లాడాలి. ఆధారాలు లేకుండా ఒక రాష్ట్ర ప్రభుత్వంపై ఇంత పెద్ద ఆరోపణ చేయడం రాజ్యాంగాన్ని అవమానించడమే అని అన్నారు.

బీజేపీది గల్లీలో కుస్తీ, ఢిల్లీలో దోస్తీ

బీజేపీ తీరు చూస్తే గల్లీలో కుస్తీ, ఢిల్లీలో దోస్తీ అన్నట్లు ఉందని దాసోజు శ్రవణ్ ఎద్దేవా చేశారు. హైదరాబాద్ గల్లీల్లోకి వచ్చి కాంగ్రెస్ పై విమర్శలు చేస్తారు. తెలంగాణలో అవినీతి జరుగుతోందని ఆరోపిస్తారు. కానీ ఢిల్లీలో మాత్రం చర్యలు తీసుకోరు. ఇది ప్రజలను మోసం చేసే ద్వంద్వ వైఖరి అని విమర్శించారు. నిజంగా అవినీతి జరిగితే విచారణకు ఎందుకు భయపడుతున్నారు? ఆర్.ఆర్ ట్యాక్స్ పై సీబీఐ విచారణ వేస్తే అసలు నిజాలు బయటకు వస్తాయని బీజేపీకి తెలుసు. అందుకే కేవలం సభల్లో ఆరోపణలు చేసి చేతులు దులుపుకుంటోందని ఆయన అన్నారు.

12 ఏళ్ల బీజేపీ పాలనలో తెలంగాణకు చేసిందేమీ లేదు

కేంద్రంలో 12 ఏళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణకు చేసింది శూన్యమని దాసోజు గుర్తు చేశారు. విభజన హామీలను అమలు చేయలేదు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఇవ్వలేదు. బయ్యారం ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయలేదు. తెలంగాణ ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వలేదు. పన్నుల వాటాలో, కేంద్ర గ్రాంట్లలో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేశారు. ఈ వైఫల్యాలన్నింటినీ కప్పిపుచ్చుకోవడానికే ఇప్పుడు ఆర్.ఆర్ ట్యాక్స్ అనే కొత్త కథను తెరపైకి తెచ్చారని ఆయన అన్నారు. తెలంగాణ ప్రజలు తెలివైన వారు. బీజేపీ కుట్రలను, డ్రామాలను అర్థం చేసుకుంటారని అన్నారు.

వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించాలి

తెలంగాణ ప్రజల ముందు నిజాలు రావాలంటే వెంటనే ఆర్.ఆర్ ట్యాక్స్ ఆరోపణలపై సీబీఐ విచారణకు ఆదేశించాలని దాసోజు శ్రవణ్ కుమార్ డిమాండ్ చేశారు. సీబీఐ విచారణలో ఎవరు తప్పు చేసినా శిక్ష పడుతుంది. ఒకవేళ ఆరోపణలు తప్పని తేలితే, నిరాధార ఆరోపణలు చేసినందుకు అమిత్ షా, మోదీ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని అన్నారు. అమిత్ షా హైదరాబాద్ సభలు, యాత్రలు తెలంగాణ అభివృద్ధి కోసం కాదు, కేవలం ఎన్నికల లబ్ధి కోసమే. ఇలాంటి చౌకబారు రాజకీయాలను తెలంగాణ ప్రజలు ఎప్పటికీ నమ్మరని, త్వరలోనే తగిన బుద్ధి చెబుతారని దాసోజు శ్రవణ్ కుమార్ హెచ్చరించారు.

కాబోయే టీచర్లకు సామాజిక పరీక్ష!

కోర్సులు చదువుతున్న ప్రతి ఒక్కరికీ ఈ రూల్ వర్తిస్తుంది. ఇప్పటివరకు ఉపాధ్యాయ విద్య అంటే తరగతి గది, పాఠ్య ప్రణాళిక, పరీక్షలు, ఇంటర్న్‌షిప్ మాత్రమే. ఇకపై సామాజిక బాధ్యత కూడా ఒక సబ్జెక్ట్ అయింది.

కోర్సును బట్టి ఎంతమందికి నేర్పాలి?

ఎంతమందిని అక్షరాస్యులుగా చేయాలనేది కోర్సు వ్యవధిపై ఆధారపడి ఉంటుంది.

- 2 ఏళ్ల కోర్సు - బీఈడీ, డీఎల్ఎడ్:లి కనీసం 5గురు నిరక్షరాస్యులకు అక్షరజ్ఞానం నేర్పాలి.
- 3 ఏళ్ల కోర్సు:లి కనీసం 6గురిని తీర్చిదిద్దాలి.
- 4 ఏళ్ల కోర్సు - ఐటీఈపీ:లి కనీసం 8మందిని అక్షరాస్యులుగా చేయాలి.

ఇక్కడే అసలు ట్విస్ట్ ఉంది. కేవలం నేర్పితే సరిపోదు. మీరు నేర్పిన వారు పునాది అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞాన మూల్యాంకన పరీక్ష, ఎఫ్ఎల్ఎన్ఏటీలో పాస్ కావాలి. ఉల్లాస్ పోర్టల్‌లో అక్షరాస్యులుగా అధికారికంగా ధ్రువీకరణ పొందాలి. అప్పుడే ఆ టీచర్ విద్యార్థికి గ్రేడ్లు వస్తాయి. ఎంతమందికి చెప్పారు అనేది కాదు, ఎంతమందిని పాస్ చేయించారు అనేదే లెక్క.

రికార్డు, రిపోర్టు తప్పనిసరి

ఈ ప్రక్రియ మొత్తానికి పకడ్బందీ రికార్డు ఉండాలి. విద్యార్థి ఉపాధ్యాయులు తాము గుర్తించిన నిరక్షరాస్యుల పేర్లు, వయసు, వివరాలతో ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించాలి. వారికి ఎలా బోధించారు, వారిలో వచ్చిన మార్పు ఏమిటి, ఎదురైన సవాళ్లు ఏమిటి అనే దానిపై ప్రతిబింబ నివేదిక, రిఫ్లెక్టివ్ రిపోర్ట్ సమర్పించాలి. దీనికోసం ఉపాధ్యాయ విద్యా సంస్థలు స్థానిక పాఠశాలలు, పంచాయతీలు, స్వచ్ఛంద సంస్థలు, ఎన్జీవోలతో సమన్వయం చేసుకోవాలని ఎన్సీటీఈ సూచించింది. నిరక్షరాస్యులను గుర్తించడం నుంచి, వారిని పరీక్షకు తీసుకురావడం వరకు అన్నీ సమన్వయంతో చేయాలి.

2022లో మొదలైన ఉల్లాస్ లక్ష్యం ఏమిటి?

2022-23లో ప్రారంభమైన ఉల్లాస్ కార్యక్రమం లక్ష్యం 15 ఏళ్లు దాటిన వయోజన నిరక్షరాస్యులకు అక్షరజ్ఞానం కల్పించడం. దీనిని ఉపాధ్యాయ విద్యతో అనుసంధానించడం ద్వారా రెండు లక్ష్యాలు నెరవేరుతాయని కేంద్రం భావిస్తోంది. ఒకటి నిరక్షరాస్యత నిర్మూలన, రెండు భవిష్యత్ టీచర్లలో సామాజిక బాధ్యత, సహానుభూతి పెంపొందించడం. ఇకపై టీచర్ అంటే కేవలం ఉద్యోగం కాదు, సామాజిక సేవ కూడా. పట్టా పొందే ముందే సమాజానికి ఏదో ఒకటి ఇచ్చి, ఐదుగురి జీవితాల్లో వెలుగు నింపితేనే ఆ పట్టాకు విలువ ఉంటుందని ఎన్సీటీఈ చెబుతోంది.

హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల పండుగ, నాంపల్లిలో ఈ-లాటరీ హడావుడి

నియోజకవర్గాలకు ఇందిరమ్మ ఇళ్ల ఈ-లాటరీని ప్రారంభించారు.

ఏ నియోజకవర్గాలకు డ్రా తీశారు?

హైదరాబాద్ క్యూర్ ఏరియా పరిధిలోని గోషామహల్, చాంద్రాయణ గుట్ట, ఎల్బీనగర్, ముషీరాబాద్ నియోజకవర్గాలకు ఈరోజు లక్కీ డ్రా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, హౌసింగ్ ఎండీ గౌతమ్ తో పాటు ఉన్నతాధికారులు హాజరయ్యారు. లాటరీలో ఎంపికైన ఆరుగురు లబ్ధిదారుల పేర్లను మంత్రి స్వయంగా చదివి వినిపించారు. వారి పేర్లు - కోమల్, బచల చైతన్య, మధుగుల మమత, గ్యాదరి నందిని, చిన్నపగ వీరమణి, అమరకీర్తి. విజేతలకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా ప్రభుత్వంలో 5500 ఇళ్ల హామీ

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కీలక విషయాలు వెల్లడించారు. ప్రజా ప్రభుత్వంలో ఒక్కో నియోజకవర్గానికి 5500 ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం. మొదటి దశలో 3500, రెండో దశలో 2000 ఇళ్లు మంజూరు చేశాం. మొదటి దశ ఇళ్లు చాలా వరకు పూర్తయ్యాయి, దశల వారీగా నిధులు విడుదల చేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వంలో ఇళ్లు ఎక్కడో కట్టేవారు, ఉపాధి ఎక్కడో ఉండేది. ఎవరూ ఆ ఇళ్లలో ఉండేవారు కాదు. ఇప్పుడు ఆ తప్పు చేయడం లేదు. ఉపాధి ఎక్కడ ఉంటే అక్కడే ఇల్లు ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టంగా నిర్ణయించారని చెప్పారు.

భూ సమస్యకు పరిష్కారం ఇదే

హైదరాబాద్‌లో స్థలం కొరత ఉంది. అందుకే నియోజకవర్గంలోనే సొంత స్థలం ఉన్నవారికి అక్కడే ఇల్లు మంజూరు చేసే విధానం తెచ్చామని అన్నారు. హైదరాబాద్‌లో స్థలాలు లేని చోట ప్రభుత్వం అత్యంత విలువైన స్థలాలను ఇస్తోంది. అత్యాధునికంగా ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఆర్టీసీకి చెందిన విలువైన స్థలాలను కూడా ఇందిరమ్మ ఇళ్లకు కేటాయించామని, ఇంకా ప్రభుత్వ స్థలాలను సేకరిస్తున్నామని తెలిపారు.

అర్హులందరికీ ఇళ్లు, త్వరలో భూమి పూజ

ఈ ఇళ్లు పార్టీ, కుల, మతాలకు అతీతంగా అందరికీ ఇస్తామని, గుడిసెలు లేని తెలంగాణే లక్ష్యమని అన్నారు. మధ్యలో ఇళ్లు ఆపేసిన వారికి, కొత్తగా ఇల్లు లేని పేదలకు ఇది వర్తిస్తుందని స్పష్టం చేశారు. మొత్తం 16 నియోజకవర్గాల్లో లాటరీ ప్రక్రియ జరుగుతుందని, ఈరోజు 4 పూర్తయ్యాయని, త్వరలోనే ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తామని ప్రకటించారు. జీ1 కింద స్థలం ఉండి ఇల్లు కట్టుకునే 2 వేల మందికి కూడా త్వరలోనే మంజూరు చేస్తామని అన్నారు. అలాగే రేషన్ కార్డులు లేని అర్హులకు కొత్త కార్డులు ఇస్తామని, ఆరోగ్య శ్రీని 10 లక్షలకు పెంచామని, 10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో మహిళలు స్వయం సహాయక సంఘాల్లో ఎక్కువగా చేరాలని పిలుపునిచ్చారు.

వరంగల్ సూపర్ స్పెషాలిటీకి మోక్షం

హాజరయ్యారు.

ప్రతి ఫ్లోర్ ప్లాన్‌ను స్వయంగా పరిశీలించిన మంత్రి

వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆసుపత్రి బ్లూ ప్రింట్‌లోని ప్రతి ఫ్లోర్ ప్లాన్‌ను మంత్రి రాజనర్సింహ క్షుణ్ణంగా పరిశీలించారు. మొదటి దశలో అవుట్ పేషెంట్ (ఓపీ) సేవలు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించినందున, అందుకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ డెస్కులు, ఓపీ కన్సల్టేషన్ రూమ్‌లు, ఫార్మసీ, శాంపిల్ కలెక్షన్ సెంటర్లు, డయాగ్నస్టిక్స్, ల్యాబ్ సేవలకు సంబంధించిన పనులను 100 శాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. దీనిపై స్పందించిన నిర్మాణ సంస్థ ప్రతినిధులు, ఈ నెల 15వ తేదీ నాటికి ఓపీ సేవలకు సంబంధించిన పనులన్నీ పూర్తి చేస్తామని, అదే సమయంలో 6 అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లను కూడా సిద్ధం చేస్తామని మంత్రికి హామీ ఇచ్చారు.

రిఫర్ విధానానికి చెక్ పెట్టాలి

వైద్య సేవల విషయంలో మంత్రి రాజనర్సింహ కీలక వ్యాఖ్యలు చేశారు. "ఒక్కసారి పేషెంట్ ఆసుపత్రికి వచ్చిన తర్వాత, ఇక్కడ సౌకర్యం లేదని మరో ఆసుపత్రికి రిఫర్ చేసే పరిస్థితి ఉండకూడదు. అవసరమైన అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ సేవలు, పరికరాలు, నిపుణులైన వైద్యులు అదే ఆసుపత్రిలో అందుబాటులో ఉండాలి" అని ఆయన అధికారులకు సూచించారు. పేద ప్రజలు హైదరాబాద్ వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా వరంగల్‌లోనే కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

టిమ్స్ ఆసుపత్రుల పరిస్థితి ఇదే

అల్వాల్ టిమ్స్ ఆసుపత్రి పనులు దాదాపు చివరి దశకు చేరుకున్నాయని, ప్రస్తుతం అత్యాధునిక వైద్య పరికరాల ఇన్‌స్టాలేషన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని అధికారులు మంత్రికి వివరించారు. ఎల్బీ నగర్ (కొత్తపేట) టిమ్స్ ఆసుపత్రి పనులు కూడా వేగంగా సాగుతున్నాయని, ఈ ఏడాది మార్చి నాటికి పనులు చివరి దశకు వస్తాయని తెలిపారు. ప్రభుత్వం నియమించిన డాక్టర్ల ప్రత్యేక బృందం ఈ మూడు ఆసుపత్రులను ప్రతిరోజూ సందర్శించి పనుల పురోగతిని, నాణ్యతను పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. పనుల్లో ఎక్కడా జాప్యం జరగకుండా, నాణ్యత విషయంలో రాజీ పడకుండా వీలైనంత త్వరగా మూడు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను ప్రజలకు అంకితం చేయాలని మంత్రి రాజనర్సింహ అధికారులకు దిశానిర్దేశం చేశారు.

తుమ్మిడిహట్టి బ్యారేజ్‌పై మహారాష్ట్రతో నిరంతర సంప్రదింపులు జరపాలి



సూచనలు చేశారు. మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములకు తగిన పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైన నిధులను జాయింట్ అకౌంట్‌లో జమ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ముంపు భూములకు సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి సర్వే నిర్వహించినా తమకు అభ్యంతరం లేదని పేర్కొన్నారు. మహారాష్ట్ర అధికారులకు అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలని, ముంపునకు సంబంధించిన పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే కుదిరిన ఒప్పందాలు, ఇతర అంశాలకు సంబంధించిన పత్రాలను మహారాష్ట్రకు అందజేసి, ప్రాజెక్టు అంశాలపై సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ సమీక్షలో నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, కార్యదర్శి శ్రీధర్, ఈఎన్‌సీ (జనరల్) రమేష్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అధికార పార్టీలో వర్గ పోరు

లీక్ జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి.

సీనియర్ల అసంతృప్తికి అసలు కారణాలేంటి?

కొన్ని నెలలుగా కొందరు సీనియర్ మంత్రులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని సమాచారం. తమ శాఖలకు సంబంధించిన బిల్లులు విడుదల చేయకపోవడం, తమకు చెప్పకుండానే తమ శాఖలపై ఉన్నత స్థాయిలో సమీక్షలు నిర్వహించడం, తమ సొంత జిల్లాల్లో తమ ప్రత్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వడం వంటి కారణాలతో వారు పార్టీ కార్యక్రమాలకు కూడా దూరంగా ఉంటున్నారు. ఇదే అసంతృప్తిని అదనుగా చేసుకుని వారిని మీడియా ద్వారా టార్గెట్ చేసి, పార్టీలో వారి ప్రాధాన్యతను తగ్గించే ప్రయత్నం జరుగుతోందని చెబుతున్నారు.

కొండా తర్వాత రాజనర్సింహ, ఇప్పుడు వ్యవసాయ శాఖ మంత్రి వైపు?

ఈ తరహా టార్గెట్ రాజకీయం ఇది మొదటిసారి కాదని అంటున్నారు. కొన్ని నెలల క్రితం ఒక మహిళా మంత్రి విషయంలో కూడా ఇదే తరహా ప్రచారం జరిగిందని, ఇప్పుడు మరో సీనియర్ మంత్రి విషయంలో అదే స్క్రిప్ట్ రిపీట్ అవుతోందని గుసగుసలు వినిపిస్తున్నాయి. తాజాగా వ్యవసాయ శాఖకు చెందిన సీనియర్ మంత్రి కూడా ఇదే తరహా టార్గెట్ కు గురవుతున్నారనే ప్రచారం జోరుగా ఉంది. ఆయన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని భూకబ్జా ఆరోపణలు, ఒక అనుకూల యూట్యూబ్ జర్నలిస్టు ద్వారా వరుస కథనాలు రావడం వెనుక కూడా అదే శక్తి ఉందని అంటున్నారు. ఎల్‌నినో పరిస్థితుల్లో రైతులకు సాగునీరు, కరెంటు ఇవ్వలేకపోవడం, వ్యవసాయ శాఖను తనకు ఇచ్చి తనను బలిపశువు ను చేశారని ఆ మంత్రి ఇప్పటికే పలుమార్లు ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం.

సొంత పార్టీ ఎమ్మెల్యేలే ప్రతిపక్షంలా...

ఒకపక్క మంత్రుల మధ్య విభేదాలు, మరోపక్క సొంత పార్టీ ఎమ్మెల్యేలే ప్రభుత్వంపై బహిరంగంగా విమర్శలు గుప్పించడం పార్టీని మరింత ఇరకాటంలోకి నెడుతోంది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి లాంటి నేతలు ఇటీవల ప్రభుత్వ పనితీరుపై, హామీల అమలుపై నిధులు విడుదల గురించి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. ప్రజా సమస్యలపై ప్రభుత్వం సరిగా స్పందించడం లేదని వారే బహిరంగంగా చెప్పడం పార్టీ అంతర్గత పరిస్థితికి అద్దం పడుతోందని విశ్లేషకులు అంటున్నారు.

ప్రజల్లో అసంతృప్తి, 2029 వరకు పార్టీకి గడ్డు కాలమేనా?

ఇప్పటికే రాష్ట్రంలో ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి ఉందనే చర్చ జరుగుతున్న తరుణంలో, దానికి తోడు పార్టీలో అంతర్గత వర్గపోరు, సీనియర్లను పక్కన పెట్టే ధోరణి పార్టీని మరింత దిగజార్చుతుందని సీనియర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల్లో ఉన్న అసంతృప్తికి తోడు, పార్టీలోని ఈ విభేదాలు కలిస్తే 2029 ఎన్నికల వరకు పార్టీ పూర్తిస్థాయిలో విమర్శలకు గురి కావడం ఖాయమని, ఆ సమయం వరకు పార్టీ మనుగడ సాగిస్తుందా లేదా అనేది రాష్ట్రవ్యాప్తంగా పెద్ద చర్చగా మారింది. ఇప్పటికైనా అధికార పార్టీలోని పెద్దలు కళ్లు తెరిచి అంతర్గత కుమ్ములాటలకు చెక్ పెట్టకపోతే భారీ మూల్యం చెల్లించక తప్పదని సీనియర్ నేతలు హెచ్చరిస్తున్నారు.

చోరీకి గురైన 57 మొబైల్ ఫోన్ల రికవరీ.

-యజమానులకు అందజేసిన టౌన్ ఎస్ హెచ్ఓ శ్రీనివాస్.

నిజామాబాద్ నవంబర్03:(విజన్ ఆంధ్ర) : నిజామాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని ఒకటవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీకి గురైన 57 మొబైల్ ఫోన్లను సిఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి రికవరీ చేసి, వాటిని అసలు యజమానులకు తిరిగి మంగళవారం అందజేసినట్లు ఒకటవ టౌన్ ఎస్హెచ్ఓ బి. శ్రీనివాస్ తెలిపారు. మొబైల్ ఫోన్ల చోరీకి సంబంధించి బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సిఈఐఆర్ (సెంట్రల్ ఏక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్ ద్వారా మొబైల్ ఫోన్ల ఐఎంఈఐ నంబర్ల ఆధారంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి వాటి ఆచూకీని గుర్తించి



మొత్తం 57 మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు వెల్లడించారు.రికవరీ చేసిన మొబైల్ ఫోన్లను సంబంధిత యజమానులకు పోలీస్ స్టేషన్‌లో తిరిగి అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తమ మొబైల్ ఫోన్లను తిరిగి పొందిన బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. మొబైల్ ఫోన్ చోరీకి గురైతే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, సిఈఐఆర్ పోర్టల్ (డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ .సెయిర్ .గవ .ఇన్) ద్వారా కూడా ఫిర్యాదు నమోదు చేసుకోవాలని వన్ టౌన్ ఎస్హెచ్ఓ శ్రీనివాస్ తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ మొబైల్ ఫోన్ ఐఎంఈఐ నంబర్‌ను భద్రపరచుకోవాలని సూచించారు .ప్రజల ఆస్తుల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు టౌన్× పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని ఎస్హెచ్ఓ శ్రీనివాస్ తెలిపారు.

సంపాదకీయం

అల్పపీడనం నుంచి సూపర్ తుపాను వరకు?

మురసు.. అర్నబ్.. హుద్ హుద్.. తిత్లీ.. మొంథా.. ఒగ్ని.. ఈ పేర్లు వినే ఉంటారు కదా..!గత కొన్నేళ్లలో వచ్చిన తుపానుల పేర్లు ఇవి.వీటన్నింటికీ ఒక పోలిక ఉంది. అదేంటని అనుకుంటున్నారా?! ఇవన్నీ అక్టోబరు, నవంబరు నెలలో సంభవించాయి.ఏటా బంగాళాఖాతంలో ఏర్పడుతున్న తుపానులలో ఎక్కువగా ఈ రెండు నెలల్లోనే ఉంటున్నాయని భారత వాతావరణ శాఖ చెబుతోంది.ఇంతకీ అక్టోబరు, నవంబరు నెలల్లోనే ఎక్కువగా తుపానులు ఏర్పడ్డానికి కారణమేమిటనే విషయంపై భారత వాతావరణ శాఖ, ఇన్ కాయిస్ (ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఒషియన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్) ఈ తుపానులు ఏర్పడటంలో సముద్ర ఉష్ణోగ్రతలు కీలక పాత్ర పోషిస్తాయని అని ఇన్ కాయిన్ శాస్త్రవేత్త బి.శివయ్య చెప్పారు.భారత వాతావరణ శాఖ సమాచారం ప్రకారం.. 1891 నుంచి 2025 మధ్య బంగాళాఖాతంలో వాయుగుండాలు, తుపానులు, తీవ్ర తుపానులు కలిపి 1261 ఏర్పడ్డాయి.వీటిల్లో ఎక్కువగా రెండు నెలల కాలంలో.. అంటే అక్టోబరు, నవంబరులోనే వచ్చాయి.అంతేకాదు, ఈ రెండు నెలల్లో వచ్చే తుపానుల తీవ్రత కూడా ఎక్కువగా ఉంది. బంగాళాఖాతంలో 1891 నుంచి 2025 వరకు తుపానులు, తీవ్ర తుపానులు కలిపి 541 వచ్చినట్లుగా భారత వాతావరణ శాఖ ప్రకటించింది. ఇందులో అక్టోబరులో 96, నవంబరులో 126లో ఏర్పడ్డాయి.అలాగే 1891 నుంచి 2025 మధ్య తీవ్ర తుపానులు 247 ఏర్పడగా.. అక్టోబరులో 44, నవంబరులో 76 వచ్చాయి. తుపానుల విషయంలో సముద్ర ఉష్ణోగ్రతలలు, గాలుల గమనం తీరు కీలకంగా మారతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.నైరుతి రుతుపవనాల తిరోగమనం(పోస్ట్ మాన్ సూన్) తర్వాత తుపానులు ఎక్కువగా తూర్పు తీరం వైపున ఏర్పడుతుంటాయని అమరావతి వాతావరణ కేంద్రం సంచాలకురాలు కె.నాగరత్న చెప్పారు."పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడే అల్పపీడనాలు అండమాన్ కింద నుంచి బంగాళాఖాతంలోకి వచ్చి చేరుతుంటాయి.రుతుపవనాల ముందు మయన్మార్ తీరంలో సముద్రపు ఉపరితల ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతుంటాయి. దానివల్ల అటువైపు తుపానులు వెళుతుంటాయి.కానీ, రుతుపవనాల తిరోగమనం తర్వాత బంగాళాఖాతంలో తూర్పు తీరంవైపు సముద్రపు ఉపరితల ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయి. దానివల్ల తూర్పు తీరంవైపు తుపానుల గమనం ఉంటుంది. ఇందుకు గాలుల గమనం కూడా సహకరిస్తుంది '' అని చెప్పారు నాగరత్న.ఈ సమయంలో బంగాళాఖాతంలో సముద్రపు ఉష్ణోగ్రతలు సగటున 26.5 డిగ్రీల కంటే ఎక్కువగా ఉంటాయని వివరించారు."సముద్రపు ఉపరితల ఉష్ణోగ్రతలు రెండు సీజన్లలో ఎక్కువగా రికార్డవుతుంటాయి. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఒకసారి? అక్టోబరు, నవంబరు సీజన్లలో మరోసారి ఎక్కువగా ఉంటాయి" అని బి.శివయ్య చెప్పారు.రుతుపవనాల తర్వాత శీతాకాలం వచ్చి సముద్రపు ఉపరితల ఉష్ణోగ్రతలు తగ్గడానికి కొంత ఆలస్యం అవుతుందని వివరించారు.ఈ పరిస్థితులతో అల్పపీడన ద్రోణి ఏర్పడటానికి పరిస్థితులు సహకరిస్తాయి'' అని చెప్పారు.బంగాళాఖాతంలో ఏర్పడే తుపానులు ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువగా తీరం దాటడాన్ని గమనిస్తుంటాం.ఆంధ్రప్రదేశ్‌కు 1053.07 కిలోమీటర్ల పొడవైన సుదీర్ఘ తీరం ఉండగా, ఒడిశాకు 574.71 కిలోమీటర్ల పొడవైన తీరం ఉంది.తీరం పొడవు, తీరంలోని పరిస్థితుల దృష్ట్యా ఆంధ్రప్రదేశ్ వద్ద తుపానులు ఎక్కువగా తీరం దాటుతుంటాయని చెప్పారు నాగరత్న."మచిలీపట్నం, నరసాపురం, కాకినాడ వద్ద తీరంలో మలుపులు ఉంటాయి.గోదావరి, కృష్ణా నదులు కలిసే ప్రాంతాలున్నాయి.తీరంలో ఉండే మలుపులు, సముద్రంలో నదులు కలిసే ప్రాంతాలు కూడా తుపానులను ఆకర్షించడానికి కారణమవుతాయి" అని వివరించారు.2026 అక్టోబరు.. అర్నబ్ అతి తీవ్ర తుపాను.. ఆంధ్రప్రదేశ్‌లోని నర్సాపురం సమీపంలో తీరం దాటింది. ఏపీపై పెను ప్రభావం చూపించింది.2026 నవంబరు.. మురసు తీవ్ర తుపాను.. ఇది ఆంధ్రప్రదేశ్ తీరంలోని నెల్లూరు సమీపంలో తీరం దాటింది.2014 అక్టోబరు.. హుద్ హుద్ తీవ్ర తుపాను.. ఏపీలో విశాఖపట్నంపై విరుచుకుపడింది.ఏపీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ రికార్డుల ప్రకారం ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. పెను విధ్వంసం సృష్టించింది.ఇవేకాకుండా, ఏపీ చరిత్రలో అత్యంత తీవ్రమైన తుపానుగా కోస్తా తీర ప్రాంతవాసులు చెప్పుకొనే దివిసీమ తుపాను లేదా దివిసీమ ఉప్పెన కూడా 1977 నవంబరులోనే వచ్చింది.ఈ తుపాను కారణంగా 24 లక్షల మంది ప్రభావితం అయ్యారు. పదివేల మందికిపైగా చనిపోయారని అంచనా.1996 కాకినాడలో వచ్చిన తుపాను కూడా నవంబరు నెలలో సంభవించింది.

మురసుతో నీటి కష్టాలకు చెక్

గుంటూరు, నవంబర్ 4, మురసు తుఫానుతో రాష్ట్రంలో రాయలసీమ, పల్నాడు జిల్లాలలో నీటి లోటు తీరే పరిస్థితి కనిపిస్తోంది. నెల్లూరు సమీపంలో తీరందాటనున్న మురసు కారణంగా దక్షిణకోస్తా, రాయలసీమల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. పల్నాడు జిల్లాలో 30 సెంటీమీటర్లు, ప్రకాశంలో 24, మార్కాపురంలో 19, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో 9 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. అదేవిధంగా ఏలూరులో 9 సెం.మీ., నెల్లూరులో 9 సెం.మీ. మేర వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయన్నారు. భారీ వర్షాల కారణంగా నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టులకు 30 టీఎంసీల నుంచి 50 టీఎంసీల వరకు నీటి ప్రవాహాలు రావచ్చని అంచనా వేస్తున్నారు. పులిచింతలలో 18 టీఎంసీల మేర ఫ్లడ్ కుషన్ అందుబాటులో ఉండగా, నాగార్జునసాగర్‌కు కూడా భారీగా ప్రవాహాలను తట్టుకునే పరిస్థితి ఉందని చెబుతున్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టుకు 1.5 లక్షల క్యూసెక్కుల వరకు ఇన్‌ఫ్లో రావచ్చని అంచనా వేస్తున్నారు. ఇక తుఫాను హెచ్చరికలు, భారీ వరదలపై అంచనాలతో అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు అప్రమత్తం చేశారు. తుఫాన్ నేపథ్యంలో ఢిల్లీ పర్యటనను రద్దు చేసుకున్న సీఎం చంద్రబాబు సోమవారం ఉదయం నుంచి సెక్రటేరియట్ లో రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీలో తిష్ట వేశారు. అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ తగిన సూచనలు జారీ చేస్తున్నారు. భారీ వర్షాలు కురిసే ప్రాంతాల్లో డ్రెయిన్లను ముందుగానే శుభ్రం చేయాలని, వాగులు, వంకలు పొంగి ప్రవహించే ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశించారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, మార్కాపురం జిల్లాల్లో వర్షపాతం లోటు ఉన్నందున చెరువులు, రిజర్వాయర్‌లను నింపాలని సూచించారు. అర్నాబ్ కంటే తక్కువ ప్రభావం కోస్తాంధ్ర తీరంపై మురసు తుఫాను ప్రభావం తక్కువగానే ఉండే అవకాశం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబుకు అధికారులు తెలిపారు. అర్నబ్ తుఫానుతో పోలిస్తే గాలులు, వర్ష తీవ్రత కూడా తక్కువగానే ఉన్నట్టు అంచనాలు ఉన్నాయని వివరించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. తుపాను ప్రభావంతో వచ్చే వర్షాలను సమర్థంగా వినియోగించుకుని చెరువులు, రిజర్వాయర్‌లను నింపాలని సూచించారు. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. మురసు తుఫాను గాలుల ప్రభావం దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లోని సుమారు 8 వేల విద్యుత్ స్తంభాలపై పడే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. విద్యుత్ పునరుద్ధరణ కోసం చెన్నై నుంచి మరో వెయ్యి మంది సిబ్బంది వస్తున్నారని, వారిని నెల్లూరు, ప్రకాశం సహా వివిధ జిల్లాల్లో వినియోగించాలని సీఎం సూచించారు. చెరువులకు గండ్లు పడకుండా చర్యలు మురసు తుఫాను ప్రభావం ఉన్న 6 జిల్లాల పరిధిలోని 6,800 చెరువుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సాగునీటి సంఘాలను క్రియాశీలం చేసి ప్రజల భాగస్వామ్యంతో చెరువుల పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు. జలధార కార్యక్రమం కింద చేపట్టిన పనులను వినియోగించుకోవాలని, ఎక్కడా చెరువులకు గండ్లు పడకుండా చూడాలని స్పష్టం చేశారు. డ్రెయిన్లలో పూడిక కారణంగా పంటలు ముంపునకు గురికాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. తుపాను ప్రభావిత జిల్లాల్లో గర్భిణులను ముందుగానే ఆసుపత్రుల్లో చేర్పించాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే 3,066 మంది గర్భిణీలను తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కచ్చా ఇళ్లలో నివసించే వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని, అవసరమైన నిత్యావసర వస్తువులను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను అవసరాన్ని బట్టి మోహరించాలన్నారు. రైల్వే మార్గాలు, జాతీయ రహదారుల వద్ద లోతట్టు ప్రాంతాల్లో వరద ముప్పు ఉంటే రాకపోకలను నియంత్రించాలని ఆదేశించారు. మత్స్యకారుల బోట్లు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రెండు గంటలకు ఒకసారి బులెటిన్ వర్షాలు, గాలులు, వరద ప్రవాహాలపై నిరంతరం పర్యవేక్షించాలని, సమాచార వ్యవస్థకు అంతరాయం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రతి రెండు గంటలకు ఓ సారి పరిస్థితిని సమీక్షించి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భరోసా కల్పించాలని, కలెక్టర్లు ఎప్పటికప్పుడు హెచ్చరికల ప్రకటనలు విడుదల చేయాలని చెప్పారు. తుఫాను అనంతర పునరుద్ధరణ పనులను 48 గంటల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. పంటల బీమా పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడి ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్, ఆర్టీజీఎస్, వ్యవసాయ, జలవనరులు, అగ్నిమాపక సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు వర్చువల్ గా హాజరయ్యారు.

అసైన్డ్, ఇనాం, చుక్కల భూముల ఫ్రీహోల్డ్ దరఖాస్తులపై కీలక జీవో

విజయవాడ, నవంబర్ 3,అసైన్డ్, చుక్కల, ఇనాం, పట్టా భూములపై వచ్చే ఫ్రీ హోల్డ్ దరఖాస్తుల విషయంలో ఏపీ ప్రభుత్వం కొత్త జీవో జారీ చేసింది. ఇలాంటి భూములకు సంబంధించిన ఫ్ రీహోల్డ్ దరఖాస్తులు వెంట వెంటనే పరిష్కరించే విధంగా కాలపరిమితిని విధించింది. దీని ప్రకారం ఆర్డీవో పరిధిలో దరఖాస్తులకు 60 రోజుల్లో అధికారులు పరిష్కారం చూపాల్సి ఉంటుంది. నిర్దిష్ట కేటగిరీ దరఖాస్తులను 30 రోజుల్లో పరిష్కరించాలి. అదేవిధంగా తహసీల్దార్ స్థాయిలో దరఖాస్తుల పరిష్కారానికి 60 రోజుల సమయం తీసుకొవచ్చని సూచించింది. ఈ మేరకు ప్రభుత్వం జీవో 659 జారీ చేయడం జరిగింది.రాష్ట్రంలోని అసైన్డ్, చుక్కల, ఇనాం, పట్టా భూముల సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారి కోసం ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏళ్ల తరబడి పరిష్కారం కానీ ఈ భూముల ఫ్రీ హోల్డ్ దరఖాస్తుల పరిష్కారంపై రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఫ్రీహోల్డ్ కోసం రైతులు చేసుకునే దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా.. నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని అధికారులకు కచ్చితమైన డెడ్‌లైన్లు విధించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 659ను అధికారికంగా రిలీజ్ చేసింది.ఈ కొత్త జీవో ప్రకారం ఆర్డీవో పరిధిలోకి వచ్చే ఫ్రీ హోల్డ్ దరఖాస్తులను ఎక్కువలో ఎక్కువగా రెండు నెలల్లోపు అంటే 60 రోజుల్లోపు కచ్చితంగా పరిష్కరించాల్సి ఉంటుంది. అదేవిధంగా కొన్ని నిర్దిష్ట కేటగిరీలకు చెందిన అప్లికేషన్లను కేవలం నెల రోజుల్లోనే క్లియర్ చేయాలని ప్రభుత్వం అధికారులకు కచ్చితమైన గడువును నిర్దేశించింది. ఇక తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించాల్సిన దరఖాస్తులకు సైతం 60 రోజుల సమయాన్ని గరిష్ట పరిమితిగా నిర్ణయించింది.ఈ ప్రక్రియను వేగవంతం చేయడానికి ప్రభుత్వం రెవెన్యూ శాఖ పోర్టల్లో పలు సాంకేతిక మార్పులను సైతం చేసింది. రైతులు లేదా యజమానులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న రోజే, ఆ అప్లికేషన్ నేరుగా సంబంధిత తహసీల్దార్ లాగిన్‌కు చేరేలా సిస్టమ్‌ను అప్‌డేట్ చేశారు. దీనివల్ల ఫైళ్ల కదలికలో జరిగే జాప్యానికి పూర్తిగా చెక్ పడినట్టవుతుంది.అలాగే రిజిస్ట్రేషన్ల విషయంలోనూ ప్రభుత్వం రైతులకు లైన్ క్లియర్ చేసింది. రెవెన్యూ అధికారుల విచారణ అనంతరం వెబ్‌ల్యాండ్‌లో ఫ్రీహోల్డ్‌గా నమోదైన వెంటనే, సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నేరుగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చని పేర్కొంది. రిజిస్ట్రేషన్ సమయంలో ప్రత్యేకంగా అధికారుల నుంచి ఫ్రీహోల్డ్ ప్రొసీడింగ్స్‌ని అందించాల్సిన అవసరం ఇకపై ఉండదని వెల్లడించింది. వెబ్‌ల్యాండ్‌లో అప్‌డేట్ అయిన వివరాలను రికార్డుల్లో పకడ్బందీగా భద్రపరచాలని, ఈ సరికొత్త గైడ్‌లైన్స్‌ను రెవెన్యూ యంత్రాంగం తప్పకుండా పాటించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ఈ కొత్త మార్గదర్శకాల వల్ల భూ వివాదాలకు తెర పడే అవకాశం ఉంది. అలాగే రెవెన్యూ సేవలు మరింత వేగవంతం కానున్నాయి.

ఒక్క వానకే హైదరాబాద్ చెరువుల కళకళ

హైదరాబాద్, నవంబర్ 3,ఒకప్పుడు మురుగుతో నిండి.. కబ్జాల కోరల్లో చిక్కుకుని ఊపిరిసలుపుకోని ఆ చెరువులు.. నేడు హైడ్రా సంకల్ప బలం.. ఒకే ఒక్క వాన ధాటికి సరికొత్త జీవనాన్ని సంతరించుకున్నాయి. ఎండిపోయిన జాడ నుంచి స్వచ్ఛమైన జలకళతో తొణికిసలాడుతూ నగర ప్రజల దాహార్తిని తీర్చే అమృత ధారలుగా మారుతున్న ఆ జలాశయాల విజయగాథే ఈ నేటి చారిత్రక పరిణామం. ఎల్‌నినో ప్రభావంతో వాన చినుకు కోసం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నగర ప్రజలకు వరుణుడు ఎట్టకేలకు కరుణించాడు. శుక్రవారం కురిసిన సుమారు 7 సెంటీమీటర్లు భారీ వర్షం హైదరాబాద్ వాసుల మోములపై చిరునవ్వులు పూయించింది. ముఖ్యంగా మాదాపూర్‌లోని సున్నం చెరువు , తమ్మిడికుంట జలాశయాలు వర్షపు నీటితో కళకళలాడుతుండటం స్థానికుల్లో అమితానందాన్ని నింపుతోంది. ఒకప్పుడు ఈ చెరువుల పరిస్థితి చూస్తే కన్నీళ్లే మిగిలేవి. మురుగు నీరు.. భారీగా పేరుకుపోయిన పూడిక.. కబ్జాల కోరల్లో చిక్కుకుని ఆ చెరువులు దుర్గంధం వెదజల్లాయి. నీటి జాడ లేక ఎండిపోయి వెలవెలబోయిన ఆ జలాశయాలను చూసి స్థానికులు ఆవేదన చెందేవారు. కానీ నేడు ఆ దృశ్యాలు పూర్తిగా మారిపోయాయి. నగరంలోని చెరువులను కాపాడేందుకు 'హైడ్రా' చేపట్టిన సంకల్పం ఇప్పుడు సత్ఫలితాలను ఇస్తోంది. సున్నం చెరువులో దశాబ్దాలుగా పేరుకుపోయిన 10 నుంచి 15 అడుగుల పూడికను హైడ్రా తొలగించింది. ఆక్రమణలను అడ్డుకోవడంతో పాటు.. చుట్టూ వాకింగ్ పాత్‌వేలు, పిల్లల కోసం ఆటస్థలాలు, పూలు, మొక్కలతో ఆ ప్రాంతాన్ని ఒక సుందరమైన పర్యావరణ కేంద్రంగా తీర్చిదిద్దింది.

ఇంటి నుంచే లెర్నర్ లైసెన్స్ టెస్ట్..

FTO కార్యాలయానికి వెళ్లాల్సిన పనిలేదు..!

హైదరాబాద్, నవంబర్ 3,లెర్నర్ లైసెన్స్ పరీక్షను ఇంటి నుంచే రాసే విధానాన్ని ప్రవేశపెట్టేందుకు తెలంగాణ రవాణాశాఖ సిద్ధమవుతోంది. అందుకు సారథి న్యూ లెర్నర్ లైసెన్స్ పరీక్ష వ్యవస్థతో పాటు ఏఐ, ఫేషియల్ రికగ్నిషన్ సాంకేతికతను ఉపయోగించనున్నారు. అభ్యర్థి గుర్తింపు, పరీక్ష సమయంలో కదలికలు, మాల్‌ప్రాక్టీస్‌ను సాంకేతికంగా పర్యవేక్షిస్తారు. పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి వెంటనే క్యూఆర్ కోడ్ ఆధారిత ఎల్ఎల్ఆర్ జారీ చేయనున్నారు. ప్రయోగాత్మక పరీక్షలు విజయవంతమైతే వారం రోజుల్లోనే కొత్త విధానం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.వాహనాలు నడపడం నేర్చుకునే ముందు తప్పనిసరిగా రాయాల్సిన లెర్నర్ లైసెన్స్ పరీక్ష ను ఇకపై ఇంటి నుంచే రాసే అవకాశాన్ని కల్పించేందుకు తెలంగాణ రవాణా శాఖ కసరత్తు చేస్తోంది. ఇందుకోసం సారథి న్యూ లెర్నర్ లైసెన్స్ పరీక్ష విధానంతో పాటు ఏఐ ఆధారిత సాంకేతికతను పరిశీలిస్తోంది. ఈ కొత్త విధానంలో అభ్యర్థి ముఖాన్ని గుర్తించే ఫేషియల్ రికగ్నిషన్ సాంకేతికత ద్వారా వ్యక్తిగత ధ్రువీకరణ చేపట్టనున్నారు. పరీక్ష సమయంలో అక్రమాలకు పాల్పడితే తక్షణమే గుర్తించేలా ప్రత్యేక వ్యవస్థలను రూపొందించారు. ప్రయోగాత్మక పరీక్షలు విజయవంతమైతే వారం రోజుల్లోనే ఈ విధానాన్ని అమల్లోకి తీసుకురావాలని రవాణాశాఖ భావిస్తోంది.ప్రస్తుతం లెర్నర్ లైసెన్స్ పరీక్ష రాయాలంటే అభ్యర్థులు సంబంధిత రవాణా కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. కొత్త విధానం అమల్లోకి వస్తే ఈ ఇబ్బందులు తగ్గనున్నాయి. ఇంటి నుంచే కంప్యూటర్ లేదా ల్యాప్‌టాప్ ద్వారా పరీక్ష రాసేందుకు అవకాశం లభిస్తుంది. అయితే పరీక్ష పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా జరిగేలా సురక్షితమైన బ్రౌజర్, రియల్‌టైమ్ అభ్యర్థి ధ్రువీకరణను తప్పనిసరి చేయనున్నారు. పరీక్ష సమయంలో అభ్యర్థి కెమెరా ముందు కనిపించకపోయినా, మధ్యలో వేరే వ్యక్తి వచ్చినా, సాంకేతిక అవాంతరాలు ఎదురైనా వ్యవస్థ వెంటనే హెచ్చరికలు జారీ చేస్తుంది. ఇతర వెబ్‌సైట్లను తెరిచేందుకు ప్రయత్నించినా నిఘా వ్యవస్థ గుర్తిస్తుంది.పరీక్ష రాయాలనుకునే అభ్యర్థులు తమ అప్లికేషన్ నంబరు, పాస్‌వర్డ్, పుట్టిన తేదీ వివరాలతో లాగిన్ కావాలి. అనంతరం ఫేషియల్ వెరిఫికేషన్ ద్వారా అభ్యర్థి గుర్తింపును నిర్ధారిస్తారు. పరీక్ష జరుగుతున్నంతసేపు ఏఐ ఆధారిత వ్యవస్థ అభ్యర్థి కదలికలను పర్యవేక్షిస్తుంది. ఫేషియల్ వెరిఫికేషన్ పలుమార్లు విఫలమైతే ఓటీపీ పంపిస్తారు. ఆ ఓటీపీని నమోదు చేసిన తర్వాత అభ్యర్థికి సమీపంలోని ఆర్టీవో కార్యాలయానికి వెళ్లి పరీక్ష రాసే అవకాశం కల్పిస్తారు.పరీక్షలో ప్రశ్నల స్థితిని సులభంగా గుర్తించేందుకు రంగుల విధానాన్ని కూడా ప్రవేశపెట్టనున్నారు. ఒక ప్రశ్నకు సమాధానం నమోదు చేస్తే గ్రీన్ రంగులో కనిపిస్తుంది. ప్రశ్నను చూసి సమాధానం ఇవ్వకపోతే రెడ్ రంగు, ఇంకా చూడని ప్రశ్నలకు వైట్ రంగు కనిపిస్తుంది. దీంతో అభ్యర్థులు ఎన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు, ఎన్ని ప్రశ్నలు మిగిలిపోయాయో సులభంగా తెలుసుకోవచ్చు.పరీక్ష పూర్తయిన వెంటనే అభ్యర్థి ఎన్ని ప్రశ్నలకు సరైన సమాధానాలు గుర్తించారో ఫలితం వెల్లడవుతుంది. పరీక్షలో అర్హత సాధించిన వారికి తక్షణమే క్యూఆర్ కోడ్‌తో కూడిన లెర్నర్ లైసెన్స్ (ఒఎఖ్) జారీ అవుతుంది. ఈ విధానం అందుబాటులోకి వస్తే రవాణా కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం తగ్గడంతో పాటు సమయం ఆదా కానుంది. అదే సమయంలో సాంకేతిక నిఘా ద్వారా పరీక్షల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చని రవాణాశాఖ భావిస్తోంది.

ఫైలాన్ విధ్వంసం ఖనిలో ఉద్యమ సెగ!!

ఉద్యమ చిహ్నానికి అవమానం

రోడ్డెక్కిన గులాబీ దండు

రాజకీయ కక్షసాధింపు...


అధికారుల చర్యపై ఆగ్రహం

కమిషనర్ డౌన్ డౌన్..

బీఆర్ఎస్ నినాదాలు

తీవ్ర ఆగ్రహంతో చందర్, కౌశిక హరి, హరీష్ రెడ్డి





పెద్దపల్లి బ్యూరో చీఫ్, నవంబర్ 3 (విజన్ ఆంధ్ర):ఉద్యమ నేల గోదావరిఖనిలో రాజుకున్నది గులాబీ నిప్పు. ఆత్మగౌరవ ఫైలాన్‌పై దాడికి వ్యతిరేకంగా భగ్గుమన్నది బీఆర్ఎస్. స్వేద బిందువుల నెత్తుటి చారికల మీద, తెలంగాణ మలిదశ పోరాట కేకల మీద నిర్మితమైన బొగ్గుగని నగరంలో మరోసారి ఉద్యమ జ్వాలలు ఎగిసిపడ్డాయి. సింగరేణి కార్మికుల పోరాట పటిమకు, తెలంగాణ సాధన ప్రస్థానానికి సజీవ సాక్ష్యంగా నిలిచిన బీఆర్ఎస్ పార్టీ ఆత్మగౌరవ ఫైలాన్‌ను ముందస్తు సమాచారం లేకుండా నిర్దాక్షిణ్యంగా కూల్చివేయడం స్థానికంగా తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఇది కేవలం ఒక కట్టడంపై జరిగిన దాడి కాదని, వేలాది మంది ఉద్యమకారుల భావోద్వేగాల మీద, ఆత్మగౌరవం మీద జరిగిన దాడిగా పరిగణిస్తూ గులాబీ దళం కదం తొక్కింది.

రహదారులపై ఉద్యమ సింహగర్జన!

రణరంగంగా మారిన ఖని కోర్టు చౌరస్తా

ఫైలాన్ కూల్చివేత వార్త కార్మిక క్షేత్రంలో దావానలంలా వ్యాపించడంతో బీఆర్ఎస్ శ్రేణులు ఉవ్వెత్తున ఉద్యమించాయి. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, యువజన నాయకులు వ్యాల్ల హరీష్‌రెడ్డి, కౌశిక హరినాథ్ నేతృత్వంలో కార్యకర్తలు, నాయకులు గోదావరిఖని ప్రధాన రహదారిపై బైఠాయించారు. అన్యాయాన్ని ఎదిరిస్తూ ఉద్యమ నేతలు గళమెత్తడంతో ఖని నడిబొడ్డున పౌరుషం ఉప్పొంగింది. "ఈ ఫైలాన్ కేవలం సిమెంటు, రాళ్ల నిర్మాణం కాదు.. నాడు లాఠీ దెబ్బలు తిని, జైలు గోడల మధ్య నలిగి, ప్రాణాలను పణంగా పెట్టి సాధించుకున్న తెలంగాణ ఉద్యమ సెంటిమెంట్. అలాంటి పవిత్రమైన ఆనవాళ్లను కూల్చేయాలని చూస్తే చూస్తూ ఊరుకుంటామా? మా అస్తిత్వాన్ని తుడిచిపెట్టే హక్కు ఎవరిచ్చారు?"


- ఆగ్రహావేశాలతో గర్జించిన మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

టౌన్ ప్లానింగ్ అధికారిపై నిప్పులు చెరిగిన నాయకులు!: రహస్యంగా, దొంగచాటుగా ఫైలాన్‌ను నేలమట్టం చేసిన టౌన్ ప్లానింగ్ అధికారి నవీన్ తీరుపై నాయకులు నిప్పులు చెరిగారు. అధికార పార్టీ మెప్పు కోసమో, రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగస్వామ్యం కావడానికో అధికారులు దిగజారడం సిగ్గుచేటని మండిపడ్డారు. పాలకుల అడుగులకు మడుగులొత్తుతూ ఉద్యమ ప్రతీకలపై ప్రతాపం చూపిస్తే ప్రజాక్షేత్రంలో అధికారులే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని వ్యాల్ల హరీష్ రెడ్డి, కౌశిక హరినాథ్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు.

సిగ్గుండాలి.. ఉద్యమ చిహ్నం కూల్చినందుకు! :తెలంగాణ ఉద్యమ చరిత్రపై కనీస గౌరవం లేదా? ఆత్మగౌరవ ఫైలాన్ కూల్చివేత జరుగుతుంటే ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, మేయర్ ఏం చేస్తున్నట్లు? ప్రజల భావోద్వేగాలను కాలరాస్తుంటే నోరు మెదపకపోవడం సిగ్గుచేటు కాదా? పదవులు అనుభవించడానికేనా.. ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడటానికి కాదా? ఉద్యమ చిహ్నాలను కూల్చేస్తుంటే చోద్యం చూస్తారా? సిగ్గుండాలి.. ప్రజల ఆత్మగౌరవం కంటే పదవులే ముఖ్యమైతే ప్రజాక్షేత్రంలో సమాధానం చెప్పక తప్పదు అని ముగ్గురు నేతలు హెచ్చరించారు.

కాంగ్రెస్ కండువా కప్పుకోండి అధికారులారా!

చరిత్రను తుడిచిపెట్టే ప్రయత్నం చేస్తున్న అధికారుల వ్యవహారశైలిపై నేతలు దుమ్మెత్తిపోశారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే ప్రాథమిక హక్కును కాలరాస్తే సహించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. కమిషనర్ వచ్చేదాకా కదిలేది లేదు.



కమిషనర్ డౌన్ డౌన్, కూల్చిన చోటే ఫైలాన్‌ను మళ్లీ నిర్మించాలి. ఉద్యమ ఆనవాళ్లను కాలరాస్తే ఖని సమాధానం చెబుతుంది అంటూ కార్యకర్తలు నినాదాలతో పరిసరాలు దద్దరిల్లాయి. స్వయంగా మున్సిపల్ కమిషనర్ సంఘటనా స్థలానికి వచ్చి జరిగిన తప్పిదానికి సమాధానం చెప్పాలని, కూల్చిన చోటే తిరిగి అదే గౌరవంతో ఫైలాన్‌ను ప్రతిష్టించే వరకు ఈ కదనరంగం వీడే ప్రసక్తే లేదని భీష్మించుకు కూర్చున్నారు. కమిషనర్ వచ్చి స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు ఇక్కడి నుంచి ఒక్క అడుగు కూడా వెనక్కి వేసేది లేదని తేల్చిచెప్పడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

రాజుకున్న భావోద్వేగం!: గోదావరిఖని మట్టికి ఒక గుణం ఉంది..ఇక్కడ చెమట చిందించడమే కాదు, అవమానం జరిగితే ఎదురొడ్డి కొట్లాడే ధైర్యమూ ఉంది. ఉద్యమ ప్రతీకగా ఉన్న ఫైలాన్ విధ్వంసం ఖని ప్రజల గుండెలను తాకింది. శాంతిభద్రతల సమస్యగా మాత్రమే దీన్ని చూస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని, తక్షణమే అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టి ఫైలాన్‌ను పునఃప్రతిష్ఠించాలని గులాబీ దళం అల్టిమేటం జారీ చేసింది. లేనిపక్షంలో ఈ సెగ మరింత తీవ్రమై ఉద్యమ దావానలంగా మారుతుందని శ్రేణులు స్పష్టం చేశాయి.

ఆస్తి కోసం దారుణం.. మహిళ తల, మొండెం వేరుచేసి హత్య

మహబూబ్‌నగర్ : ఆస్తి వివాదం ఓ మహిళ ప్రాణాలను బలిగొంది. భూమి కోసం భర్త కుటుంబ సభ్యులే దారుణానికి ఒడిగట్టారు. పొలం వద్దకు వెళ్తున్న మహిళను ఇంటికి తీసుకెళ్లి దాడి చేయడంతోపాటు.. తల, మొండెం వేరయ్యే వరకు నరికి చంపారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని కోయిలకొండ మండలం చింతల్ తండాలో ఈ దారుణం చోటుచేసుకుంది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.కోయిలకొండ మండలం చింతల్ తండాకు చెందిన కాట్రావత్ బలరాంకు.. ఓబ్లాయిపల్లి తండాకు చెందిన కాట్రావత్ సునీతతో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి రిషిక, శైలజ అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బలరాంకు మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో దంపతుల మధ్య పలుమార్లు గొడవలు జరిగినట్లు సమాచారం.ఈ నేపథ్యంలో ఏడాది క్రితం బలరాం ఇద్దరు అన్నలు మాన్యానాయక్, పాండునాయక్ అతడిని హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. పెద్దమనుషుల తీర్పు మేరకు బలరాంకు చెందిన ఎకరంన్నర భూమిని సునీత పేరుపై కుటుంబ సభ్యులు రిజిస్ట్రేషన్ చేయించారు. భర్త హైదరాబాద్‌కు వెళ్లడంతో సునీత తన ఇద్దరు పిల్లలతో కలిసి పుట్టింట్లో ఉంటోంది.

జాతీయ ఐక్యతా దినోత్సవ వేడుకల్లో కామారెడ్డి జిల్లా బృందం భాగస్వామ్యం కావడం గర్వకారణం జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర

కామారెడ్డి బ్యూరో నవంబర్ 3(విజన్‌ఆంధ్ర)గుజరాత్ రాష్ట్రంలోని ఏక్తా నగర్‌లో రాష్ట్రీయ ఏక్తా దివస్2026 సందర్భంగా భారత ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన జాతీయ ఐక్యతా దినోత్సవ వేడుకలు, ఏక్తా దివస్ పరేడ్‌లో కామారెడ్డి జిల్లా నుంచి వెళ్లిన 19 మంది సభ్యుల బృందం పాల్గొని తిరిగి వచ్చింది. జాతీయ ఐక్యత, దేశ సమగ్రత, దేశభక్తి భావాలను చాటిచెప్పే ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి కార్యక్రమంలో జిల్లా బృందం భాగస్వామ్యం కావడం కామారెడ్డి జిల్లాకు గర్వకారణమని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర పేర్కొన్నారు.ఈ నందర్భంగా మంగళవారం బృంద నభ్యులు జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి, ఈ అరుదైన అవకాశాన్ని కల్పించి, తమను ప్రోత్సహించిన జిల్లా కలెక్టర్ అశిష్ సంగ్వాన్ కి, జిల్లా ఎస్పీ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ.. దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వ పరిరక్షణ కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన విశేష కృషి, ఆయన ఆశయాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. జాతీయ ఐక్యతా భావాన్ని



పెంపొందించే కార్యక్రమాల్లో యువత, విద్యార్థులు, ప్రజలు భాగస్వాములు కావడం అభినందనీయమని పేర్కొన్నారు. గుజరాత్‌లో నిర్వహించిన ఏక్తా దివస్ పరేడ్‌ను ప్రత్యక్షంగా వీక్షించి, వేడుకల్లో పాల్గొనడం ద్వారా దేశ వైవిధ్యం, ఐక్యత, సమగ్రతపై మరింత అవగాహన పెంపొందించుకునే గొప్ప అవకాశం లభించిందని తెలిపారు.కామారెడ్డి జిల్లా నుంచి మొత్తం 19 మంది సభ్యులతో కూడిన బృందం ఈ పర్యటనలో పాల్గొనగా, బృందానికి నోడల్ అధికారిగా రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎన్. కృష్ణ గౌడ్ వ్యవహరించారు. పర్యటనలో బృంద సభ్యుల సమన్వయం, కార్యక్రమాల నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించి, పర్యటన విజయవంతం కావడానికి కృషి చేసిన నోడల్ అధికారిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.బృంద సభ్యులు మాట్లాడుతూ.. గుజరాత్‌లో నిర్వహించిన జాతీయ ఐక్యతా దినోత్సవ వేడుకలు, ఏక్తా దివస్ పరేడ్‌లో పాల్గొనడం తమ జీవితంలో మరిచిపోలేని మధురానుభూతిగా నిలిచిపోతుందని తెలిపారు. ఇంతటి ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి కార్యక్రమంలో పాల్గొనే అవకాశాన్ని కల్పించిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా యంత్రాంగం అందించిన సహకారం, ప్రోత్సాహం తమకు ఎంతో ఉత్సాహాన్నిచ్చాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎన్. కృష్ణ గౌడ్, బృంద సభ్యులు నరేందర్ రెడ్డి, రాజిరెడ్డి, ఎస్. సంతోష్, ఏక నితిన్ గౌడ్, రోహిత్, ప్రభాస్, సాధన, రజిత, బి. సూరజ్, లక్ష్మి, దీప, రాధ, సుబ్బారావు, నరేందర్, లింగారెడ్డి, రాంగోపాల్ రెడ్డి, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో జూదం (పేకాట) నిర్మూలనకు నాలుగు ప్రత్యేక పోలీసు బృందాల ఏర్పాటు

24/7 జూద నిర్వాహకులపై పోలీసుల నిఘా..
జూదం నిర్వహించే స్థావరాలపై ఆకస్మిక దాడులు.
జూదానికి బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దు.. కుటుంబాలను రోడ్డున పడేయొద్దు
జూదం జీవితాలను చిన్నాభిన్నం చేసే వ్యసనం..
యువత బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దు
జూదం కేసుల్లో పట్టుబడితే భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలపై ప్రభావం పడే అవకాశం.
జూదం ఆడుతున్నా, నిర్వహిస్తున్నా వెంటనే కంట్రోల్ రూమ్ కు సమాచారం ఇవ్వండి.
సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతాం.
- జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర,



కామారెడ్డి బ్యూరో నవంబర్ 3(విజన్‌ఆంధ్ర) కామారెడ్డి జిల్లా లో జిల్లాలో జూదం, పేకాట కార్యకలాపాలను పూర్తిస్థాయిలో అరికట్టే లక్ష్యంతో జిల్లా ఎస్పీ నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు 24 గంటల పాటు అప్రమత్తంగా ఉంటూ జిల్లావ్యాప్తంగా జూదం నిర్వహించే ప్రాంతాలపై నిఘా ఏర్పాటు చేస్తాయి. ముందస్తు సమాచారాన్ని సేకరిస్తూ ఎక్కడైనా జూదం, పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం అందిన వెంటనే సంబంధిత ప్రాంతాలకు చేరుకొని ఆకస్మిక దాడులు నిర్వహిస్తాయి. జూదం నిర్వాహకులు, పాల్గొనే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాయి.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. కష్టపడకుండా తక్కువ సమయంలో అధిక మొత్తంలో డబ్బు సంపాదించాలనే అత్యాశతో జూదం (పేకాట)కు అలవాటుపడుతున్న కొందరు తమ జీవితాలను, కుటుంబాల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టుకుంటున్నారని తెలిపారు. జూదంలో గెలిచి సులభంగా డబ్బు సంపాదించవచ్చనే భ్రమతో కష్టపడి సంపాదించిన సొమ్మును కోల్పోయి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని, ఈ వ్యసనం కారణంగా కుటుంబాల్లో కలహాలు, ఆర్థిక ఇబ్బందులు తలెత్తి కుటుంబాలు విచ్ఛిన్నమయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. జూదం సంపాదనకు మార్గం కాదని, జీవితాలను చిన్నాభిన్నం చేసే వ్యసనమని ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు.ముఖ్యంగా యువత క్షణికమైన ఆశలకు, అత్యాశకు లోనై జూదానికి బానిసలై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. జూదం(పేకాట) కేసుల్లో పట్టుబడి కేసులు నమోదైతే అవి పోలీసు రికార్డుల్లో నమోదవుతాయని, భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు జరిగే పోలీసు వెరిఫికేషన్‌లో గత కేసుల వివరాలు పరిశీలనకు వచ్చే అవకాశం ఉందని, తద్వారా ఉద్యోగ అవకాశాలపై ప్రభావం పడవచ్చని హెచ్చరించారు. కేసుల దర్యాప్తులో చట్టప్రకారం వేలిముద్రలు సేకరించి పోలీసు రికార్డుల్లో భద్రపరిచే అవకాశం ఉంటుందని తెలిపారు. క్షణిక ఆనందం కోసం భవిష్యత్తును ఇబ్బందుల్లోకి నెట్టుకోవద్దని యువతకు సూచించారు.జిల్లాలో ఎక్కడైనా జూదం, పేకాట ఆడుతున్నా లేదా నిర్వహిస్తున్నా ఉపేక్షించేది లేదని, అటువంటి కార్యకలాపాలపై పోలీసుల నిఘా నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో జూదం(పేకాట) నిర్వహిస్తున్నట్లు గుర్తించినా లేదా సమాచారం తెలిసినా వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు లేదా జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712686133 కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించే వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.జూదం, పేకాట నిర్మూలనలో ప్రజలు కూడా భాగస్వాములై పోలీసులకు సహకరించాలని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ తమ కుటుంబాలకు, సమాజానికి మంచి భవిష్యత్తును అందించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.జూదానికి దూరంగా ఉండండి.. కుటుంబాలను కాపాడుకోండి.. యువత బంగారు భవిష్యత్తును పదిలంగా ఉంచుకోవాలన్నారు.

క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తాయి
జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర



కామారెడ్డి బ్యూరో నవంబర్ 3(విజన్‌ఆంధ్ర)జోనల్ స్థాయి క్రికెట్ పోటీలు, ఎంపిక ప్రక్రియలో పాల్గొననున్న కామారెడ్డి జిల్లా పోలీస్ క్రికెట్ జట్టు క్రీడాకారులకు జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, క్రికెట్ జెర్సీలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. క్రీడలు క్రమశిక్షణ, పట్టుదల, శారీరక దృఢత్వం, మానసిక స్థిరత్వాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. విధి నిర్వహణలో నిరంతరం పని ఒత్తిడికి గురయ్యే పోలీసు సిబ్బందికి క్రీడలు మానసిక ఉల్లాసాన్ని అందించడంతో పాటు ఒత్తిడిని అధిగమించేందుకు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. జోనల్ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని క్రీడాకారులకు ఆకాంక్షించారు. అదేవిధంగా యువత మత్తు పదార్థాలు, ధూమపానానికి దూరంగా ఉంటూ క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని, క్రీడల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ఉత్తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని ఎస్పీ సూచించారు.

జీటీ-50 ప్రో స్మార్ట్‌ఫోన్ విడుదల చేసిన ఇన్‌ఫినిక్స్



హైదరాబాద్, నవంబర్ 03 (విజన్ ఆంధ్ర) : ఇన్‌ఫినిక్స్ ఇండియా తన నూతన గేమింగ్ స్మార్ట్‌ఫోన్ జీటీ-50 ప్రోను భారత మార్కెట్‌లో విడుదల చేసినట్లు ఇన్‌ఫినిక్స్ ఇండియా చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ మిరాజ్ గుప్తా మంగళవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ ఫోన్‌లో సెగ్మెంట్‌లోనే తొలిసారిగా హైడ్రోఫ్లో లిక్విడ్ కూలింగ్ సిస్టమ్, మీడియాటెక్ డిమెన్సిటీ 8400 అల్టిమేట్ ప్రాసెసర్, 144హెర్ట్స్ ఆమోలేడ్ డిస్‌ప్లే, 6500 ఎంఏహెచ్ బ్యాటరీ, డాల్బీ ఆటమ్స్ సాంకేతికతను అందించినట్లు చెప్పారు. గేమింగ్ నియంత్రణల కోసం ప్రెషర్-సెన్స్ జీటీ ట్రిగ్గర్స్ 2.0ను పొందుపరిచినట్లు తెలిపారు. జీటీ ఎన్ఎక్స్ కంట్రోలర్, జీటీ ఎన్ఎక్స్ స్టేషన్(డాక్), జీటీ మాగ్ ఛార్జ్ కూలర్ 2.0 వంటి ప్రత్యేక యాక్సెసరీలను కూడా పరిచయం చేసినట్లు తెలిపారు.

తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా కామారెడ్డి వాసి డాక్టర్ యం జైపాల్ రెడ్డి నియామకం



కామారెడ్డి బ్యూరో నవంబర్ 2(విజన్‌ఆంధ్ర)తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్, స్థానిక ఆర్మ్‌గ్రూప్ సీఈఓ, ప్రముఖ విద్యావేత్త, కామారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ , కామారెడ్డి ఒలింపిక్ డే రన్ చైర్మన్ జైపాల్ రెడ్డిని తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా నియమించింది.. క్రీడారంగంలో ఆయన అందిస్తున్న సేవలను గుర్తిస్తూ ఒలింపిక్ అసోసియేషన్ ఈ బాధ్యతలను అప్పగించింది. ఈ నియామకాన్ని తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పి. మల్లారెడ్డి అధికారికంగా నిర్ధారించారు.తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్, మాజీ యంపి జితేందర్ రెడ్డి చైర్మన్, మాజీ మంత్రి వేణుగోపాల్ చారి వైస్ చైర్మన్‌గా, డిప్యూటీ చైర్మన్ తెలంగాణ కౌన్సిల్ బండ ప్రకాష్ కన్వీనర్‌గా వ్యవహరిస్తున్న ఈ అడ్వైజరీ కమిటీలో కామారెడ్డి జిల్లా నుండి జైపాల్ రెడ్డి ఎంపిక కావడంపై స్థానికంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. విద్యావంతుడైన జైపాల్ రెడ్డి నిరంతరం విద్యార్థులను, యువతను అథ్లెటిక్స్ వైపు, క్రీడల వైపు ప్రోత్సహిస్తూ, అందరినీ చైతన్యపరుస్తూ ముందుకు తీసుకెళ్తున్నందుకే తనకు ఈ గొప్ప అవకాశం దక్కిందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.జైపాల్ రెడ్డి నియామకం పట్ల కామారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు, వివిధ క్రీడ సంఘాలు, వివిధ కళాశాలల అధ్యాపక బృందం, విద్యార్థులు, స్థానిక అథ్లెట్లు, క్రీడాకారులు మరియు క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు ఘనంగా అభినందనలు తెలియజేశారు. - క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తాం జైపాల్ రెడ్డి:ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ... తనకు ఇంతటి బాధ్యత ను అప్పగించినందుకు స్టేట్ ఒలింపిక్ కమిటీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో కామారెడ్డి జిల్లా క్రీడాకారులకు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో సముచిత స్థానం దక్కేలా, అన్ని రకాల క్రీడల్లో మన జిల్లా క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించేలా కృషి చేస్తానని తెలిపారు. తద్వారా తెలంగాణ రాష్ట్రానికి క్రీడా రంగంలో మంచి పేరు తీసుకువస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని, కాబట్టి యువత, విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా చదువుతో పాటు ఆటలను కూడా సమానంగా బ్యాలెన్స్ చేయాలని పిలుపునిచ్చారు. క్రీడల వల్ల శారీరక దృఢత్వం, ఆరోగ్యం, మానసిక ఉల్లాసం లభిస్తాయని, జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి ఇవి ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ప్రతిభ గల క్రీడాకారులకు, విద్యార్థులకు ఎల్లప్పుడూ తన వంతు సంపూర్ణ ప్రోత్సాహం ఉంటుందని జైపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

కేఎల్‌హెచ్ క్యాంపస్‌కు 3.5 స్టార్ ఐఐసీ రేటింగ్



హైదరాబాద్, నవంబర్ 03 (విజన్ ఆంధ్ర) : కేఎల్‌హెచ్ అజీజ్‌నగర్ క్యాంపస్‌కు 2024-25 సంవత్సరానికి కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖకు చెందిన ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్(ఐఐసీ) 3.5 స్టార్ రేటింగ్ లభించిందని కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ కోనేరు లక్ష్మణ్ హవీష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామకృష్ణ తోకలసి ఆయన మాట్లాడుతూ ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, వ్యవస్థాపకత ప్రోత్సాహంలో చేసిన కృషికి ఈ గుర్తింపు దక్కిందన్నారు. క్యాంపస్ 150 పేటెంట్ సహాయక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు హిల్‌సేఫ్ ప్రైవేట్ లిమిటెడ్, రోబోసేవక్ ప్రైవేట్ లిమిటెడ్, కాగ్నాలిస్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి స్టార్టప్‌లకు ప్రోత్సాహం అందించిందని తెలిపారు. భవిష్యత్తులో పరిశ్రమలు, ఇంక్యుబేషన్ కేంద్రాలు, ఆర్థిక సంస్థలతో భాగస్వామ్యాలను విస్తరించి విద్యార్థుల ఆవిష్కరణలకు మరింత ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు.

లైతులకు సహకార సేవలు మరింత సమర్థవంతంగా అందించేందుకు ప్రభుత్వ నిర్ణయం
అలంపూర్ నియోజకవర్గంలోని 7 సింగిల్ విండోలకు నాన్-అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి చైర్‌పర్సన్ల నియామకం
జిల్లా సహకార అధికారి కె.టైటస్ పాల్

అలంపూర్ నవంబర్ 3 (విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గ పరిధిలోని ఏడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ప్రత్యామ్నాయ నాన్-అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి చైర్‌పర్సన్లను నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా సహకార అధికారి కె.టైటస్ పాల్ మంగళవారం ఒక ప్రకటన లో తెలిపారు. తెలంగాణ సహకార సంఘాల చట్టం, 1964లోని సెక్షన్ 32(7)(ఏ) ప్రకారం రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ జారీ చేసిన జి.ఓ.ఆర్.టి. సంబర్లు 752, 753, 756, 757, 758, 759, 760,తేదీ 28-10-2026 ఉత్తర్వుల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు.ఈ ఉత్తర్వుల ప్రకారం అయిజ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి కుర్వ సుజాత,కలుగోట్ల సంఘానికి బి. శ్రీకాంత్, వడ్డేపల్లి సంఘానికి ఈ. నాగరాజు, మనవపాడు సంఘానికి బి. రామచంద్ర రెడ్డి, క్యాతూర్ సంఘానికి ఈ.నర్సన్ గౌడ్, అలంపూర్ సంఘానికి పెద్ద అయ్యన్న, పుటాన్‌దొడ్డి సంఘానికి బోయ మధు నాయుడు ఇన్‌చార్జి చైర్‌పర్సన్లుగా నియమితులయ్యారని తెలిపారు.ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు గ్రామీణ ప్రాంత రైతులకు వ్యవసాయ రుణాలు, ఎరువులు, విత్తనాల సరఫరా తదితర సేవలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని జిల్లా సహకార అధికారి పేర్కొన్నారు. ఈ నియామకాలతో అలంపూర్ నియోజకవర్గ పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిపాలనా వ్యవహారాలు మరింత సమర్థవంతంగా కొనసాగుతాయని జిల్లా సహకార అధికారి కె. టైటస్ పాల్ తెలిపారు.

పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి
మెనూ ప్రకారం వంట చేయని ఏజెన్సీని తొలగించాలని ఆదేశాలు.
వైద్య ఉపకేంద్రం సిబ్బందికి షోకాజు నోటీసుల జారీ..
ఇంటర్ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి
జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

మానవపాడు నవంబర్ 3 (విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం జల్లాపురం గ్రామంలో మంగళవారం జిల్లా కలెక్టర్ పర్యటించారు. ముందుగా గ్రామంలోని జడ్పీహెచ్‌ఎస్ ను ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరుకావాలని సూచించారు. తల్లిదండ్రులతో తరచూ సమావేశాలు నిర్వహించి విద్యార్థులు పాఠశాలకు ఎక్కువగా సెలవులు పెట్టకుండా సూచించాలని, ఇంటి వద్ద కూడా చదువుకునేలా ప్రోత్సహించాలని తెలియజేయాలన్నారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో వచ్చిన మార్కులపై ఆరా తీశారు. విద్యార్థులు వెనుకబడ్డ సబ్జెక్టులపై ఎక్కువగా దృష్టి సారించాలని, ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని, విద్యార్థులు అందరూ 550కు పైగా మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. ఇప్పటి నుంచే విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



నిర్వహిస్తున్నందున సద్వినియోగం చేసుకుంటూ ముందుకెళ్లాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించేందుకు మెస్ కమిటీ ఏర్పాటు చేయాలని, ఫీడ్బ్యాక్ రికార్డులో చాలామంది విద్యార్థులు భోజనం యావరేజ్ గా ఉందని రాయడంతో సంబంధిత సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వండనందుకు ప్రస్తుత ఏజెన్సీని తొలగించి, కొత్త వారిని నియమించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన్ ను ఆదేశించారు.జల్లాపురం గ్రామంలో పలుచోట్ల చెత్తాచెదారం పేరుకుపోవడంపై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, రోగాలు వ్యాపించకుండా పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ రెడ్డిని ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వైద్య ఉపకేంద్రం వద్దకు వెళ్ళగా తాళం వేసి ఉండడంతో ఉపకేంద్రంలోని సిబ్బంది అందరికీ షోకాజు నోటీసులు జారీ చేయాలని డిఎంహెచ్ఓ సంధ్య కిరణ్మయితో ఫోన్లో మాట్లాడిన కలెక్టర్ ఆదేశించారు.అనంతరం జిల్లా కలెక్టర్ మానవపాడు మండల ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వివిధకోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులతో మాట్లాడారు. ఇంజనీరింగ్, వైద్య విద్య లాంటి ఉన్నత విద్యాభ్యాసం చేసేందుకు ఇప్పటి నుంచే విద్యార్థులు ప్రణాళికతో చదవాలని సూచించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలపై ఎలాంటి సందేహాలు ఉన్నా ఎప్పటికప్పుడు అధ్యాపకులను అడిగి పరిష్కరించుకోవాలని తెలియజేశారు. ప్రతి మనిషి జీవితంలో ఇంటర్మీడియట్ కీలక దశ అని, భావి జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవడానికి ఈ దశలో విద్యార్థులు చదువు పైనే ఎక్కువగా దృష్టిసారించాలన్నారు. విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పై తరచూ కౌన్సిలింగ్ కార్యక్రమాలు నిర్వహించాలని అధ్యాపకులను ఆదేశించారు. చరవాణిలను అనవసరంగా వినియోగిస్తూ కాలాన్ని వృధా చేయకుండా, ఆన్లైన్ డిజిటల్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా వంటి ఆన్లైన్ తరగతులను కూడా వినాలని విద్యార్థులకు సూచించారు. పదవ తరగతి కంటే ఇంటర్లో ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలని, ఇంటర్ ఫలితాల్లో మన జిల్లా రాష్ట్రంలోనే ముందంజలో ఉండేందుకు కృషిచేయాలన్నారు. ఆంగ్లంలో మంచి పట్టు సాధించాలని, కమ్యూనికేషన్స్ స్కిల్స్ పెంపొందించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరికి కంప్యూటర్ నాలెడ్జ్ అవసరమని, వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లోనూ సత్తా చాటాలని, క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులు సకాలంలో అందజేయాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సుమారు మూడు నెలల సమయం మాత్రమే మిగిలి ఉన్నందున విద్యార్థులందరూ బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పర్యటనలో సర్పంచ్ నందిని, ఇంటర్ నోడల్ అధికారి హృదయ రాజ్, తహసిల్దార్ మన్సూర్ అలీ సిద్ధికి, ఎంపీడీవో రాఘవ, కళాశాల ప్రిన్సిపల్ మంజుల, ఇతర అధికారులు, తదితరులు ఉన్నారు.

బెజ్జంకి జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్



సిద్దిపేట జిల్లా ప్రతినిధి నవంబర్ 3 (విజన్ ఆంధ్ర) బెజ్జంకి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అన్నం, సాంబారు, మిల్ మేకర్ కూరలను పరిశీలిస్తూ కూరల నాణ్యత ఎలా ఉంది, రోజు మెనూ ప్రకారం వంటలు చేస్తున్నారా, విద్యార్థులకు సరిపోయేంత పెడుతున్నారా అని ఆరా తీశారు.కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని విద్యార్థుల హాజరు ప్రకారం సరుకులు కూరగాయలు పర్యవేక్షణ చేస్తూ రుచికరంగా వండే విధంగా వంట సిబ్బంది తెలుపాలని, వండిన ప్రతి వంటకం విద్యార్థులకు సరిపడే విధంగా పెట్టాలని ప్రిన్సిపల్ ను ఆదేశించారు. డైనింగ్ హాల్లో విద్యార్థులతో ఆప్యాయంగా పలకరిస్తూ ఆహారం రుచిగా ఉందా, గుడ్డు పెడుతున్నారా, సరిపోయిందా పెడుతున్నారా అని అడగ్గా, నిన్నటి రోజున ఏం కూర తో తిన్నారని ఆరా తీశారు. బాగా తినాలని ఆహారం బాగా తీసుకుంటేనే శారీరకంగా బలంగా ఉండి చదువుకోడానికి మానసికంగా దృఢంగా ఉంటారనిసూచించారు.పాఠశాల వెనకాల పిచ్చి మొక్కలు చెత్తాచెదారం ఉన్నందున గ్రామపంచాయతీ సిబ్బందిని నెలకొకసారి వచ్చి శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ కి సూచించారు. పాఠశాల వాతావరణం చాలా బాగా ఉందని విద్యార్థులకు చదువు, భోజనం విషయంలో ఎలాంటి కొరత లేకుండా చూసుకోవాలని ప్రిన్సిపల్ మరియు ఉపాధ్యాయ బృందాన్ని ఆదేశించారు.కలెక్టర్ వెంట తహసిల్దార్ శ్రీకాంత్, సర్పంచ్ బొల్లం శ్రీధర్, ప్రిన్సిపల్ తదితరులు ఉన్నారు.

భూభారతి సర్వేలను సక్రమంగానిర్వహించాలని సర్వేయర్ లను ఆదేశించిన జిల్లా కలెక్టర్

సిద్దిపేట జిల్లా ప్రతినిధి03 నవంబర్ (విజన్ ఆంధ్ర)భూ భారతి – రీ సర్వే లో భూముల సర్వే చేశాక భూ యజమానులకు సర్వేవివరాలనుతెలియజేయాలని, అనుమానం ఉంటే మళ్ళీ సర్వే చేసి భూ యాజమానుల సందేహాలను నివృత్తి చెయ్యాలని జిల్లా కలెక్టర్ కె హైమావతి సర్వేయర్ లను ఆదేశించారు.మంగళవారం బెజ్జంకి మండలం వీరాపూర్ గ్రామంలో భూ భారతి రీ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారుఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూరాష్ట్ర ప్రభుత్వం భూ యజమానులకు శాశ్వత పరిష్కారం అందించడం కోసం అత్యంత ప్రతిష్టాత్మకంగా భూభారతి – రి సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు.ముందుగా చిన్న గ్రామాలను ఎంచుకొని గ్రామంలో భూ సమస్యలు లేని గ్రామంగా తీర్చిదిద్దరంలో సులువుగా ఉంటుందని అందుకే వీరాపూర్ గ్రామాన్ని ఎంపిక చేయడం జరిగిందని, ఈ గ్రామం మొత్తం 557 ఎకరాలు మొత్తం సర్వే చేయడం జరుగుతుందని రైతులకు సూచించారు. ముందుగా గ్రామ సరిహద్దు, ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటలు, ఖాళీ బాటలను సర్వే చేశాక పట్టా భూములను సర్వే చేయడంజరుగుతుందని, పట్టా భూములను సర్వే రోజుకు రెండు రోజుల ముందుగానే ఆయా భూ యజమానులకు– రైతులకు సమాచారం అందించాలని సర్వే అధికారులను ఆదేశించారు.క్షేత్రస్థాయిలో లైసెన్స్ సర్వేయర్, జీపిఓ, రెవెన్యూ అధికారులు రోజువారిగా 35 నుండి 40 ఎకరాలు సర్వే చేస్తారని, భూ సర్వే చేశాక



భూ యజమానికి సర్వే వివరాలను తప్పనిసరిగాతెలుపాలని, ఏమైనా అనుమానం ఉంటే మళ్ళీ ఒకసారి సర్వే చేసి భూ యజమానులకు సందేహాలు లేకుండా నివృత్తి చేయాలని సర్వేయర్ లను ఆదేశించారు.ఒకే భూ యజమానికి ఒకే చోట పలు సర్వే నంబర్లలో భూమి ఉన్నట్లయితే వారికి భూ భారతి చట్టంలో ఆ యజమానికి ఒకే సర్వే నంబర్ కేటాయించడం జరుగుతుందని తెలిపారు. రైతులు– భూ యజమానులకు ఈ రీ సర్వేకు అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే భూమి కొనేటప్పుడు తప్పనిసరిగా సర్వే చేయించుకున్నాకే కొనుగోలు జరపాలని సూచించారు. కలెక్టర్ వెంట తహసిల్దార్ శ్రీకాంత్, సర్వే అధికారులు రైతులు భూ యజమానులు తదితరులు ఉన్నారు.

ఇండస్ మెడికేర్‌లో సీఐటీయూ జయకేతనం!

13 ఓట్ల మెజార్టీతో మల్లికార్జున్ ఘన విజయం
ఎన్నికల వరకే రాజకీయం.. ఆ తర్వాత కార్మికులందరూ సమానమే
కార్మికుల సంక్షేమమే మా లక్ష్యం: జె. మల్లికార్జున్



మనోహరాబాద్ నవంబర్ 3 (విజన్ ఆంధ్ర):మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం రామాయపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఇండస్ మెడికేర్ పరిశ్రమలో జరిగిన కార్మిక సంఘం ఎన్నికల్లో సీఐటీయూ ఘన విజయం సాధించింది. కార్మికుల మద్దతుతో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె. మల్లికార్జున్ 13 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.పరిశ్రమలో మొత్తం 63 ఓట్లు ఉండగా, సీఐటీయూ తరఫున పోటీ చేసిన మల్లికార్జున్‌కు 38 ఓట్లు పోలయ్యాయి. ప్రత్యర్థికి 25 ఓట్లు రావడంతో 13 ఓట్ల ఆధిక్యంతో మల్లికార్జున్ విజయం సాధించారు. ఈ విజయంతో పరిశ్రమలో కార్మికుల విశ్వాసాన్ని చూరగొన్న నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారు.విజయం అనంతరం మల్లికార్జున్ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఎన్నికల్లో గెలిచినవారు, ఓడినవారు అనే తేడా లేకుండా పరిశ్రమలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడి పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు, పోటీలు ఉంటాయని, ఎన్నికలు ముగిసిన తర్వాత కార్మికులందరూ సమానమేనని పేర్కొన్నారు.ఎన్నికల సందర్భంగా కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేందుకు కృషి చేస్తామని, వారి హక్కుల పరిరక్షణ, సంక్షేమం, ఉద్యోగ భద్రత, సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతామని హామీ ఇచ్చారు. కార్మికుల ఐక్యతతోనే పరిశ్రమలో మెరుగైన హక్కులు, సౌకర్యాలు సాధ్యమవుతాయని అన్నారు.సీఐటీయూ విజయంతో పరిశ్రమలో కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున్‌కు పలువురు కార్మికులు, సంఘం నాయకులు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ మెదక్ జిల్లా కార్యదర్శి ఏ. మల్లేష్, జిల్లా ఉపాధ్యక్షుడు ఏ. మహేందర్ రెడ్డి, ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు ఆడివయ్య, విద్యుత్ రంగ నాయకుడు స్వామి, యూనియన్ ప్రధాన కార్యదర్శి బాలేష్, తిరుపతి, రమేష్, స్వామి, గురుమూర్తి, నాగరాజు, సుజాత, రాజేశ్వరి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టం ను పకడ్బందిగ అమలు చేయాలి

పి సి పి ఎన్ డి టి . చట్టం అమలుకు జిల్లా అడ్వైజరి కమిటి సమావేశం
డిఎంఎచ్ఓ.డా. సంధ్య కిరణ్మయి

గద్వాల నవంబర్ 3 (విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల జిల్లాలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డిఎంఎచ్ఓ. డాక్టర్ సంధ్య కిరణ్మయి అధ్యక్షతన, ప్రోగ్రామ్ అధికారి డా. ప్రసూన రాణి పర్యవేక్షణలో మంగళవారం గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టం (పి సి పి ఎన్ డి టి. యాక్ట్)ను పకడ్బందిగ అమలు చేయడం, అక్రమ లింగ నిర్ధారణ పరిక్షలను పూర్తిస్థాయిలో అరికట్టడం లక్ష్యంగ జిల్లా అడ్వైజరి కమిటి సమావేశం నిర్వహించారు.జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల పనితీరు, వాటికి సంబంధించిన చట్టబద్ధమైన అనుమతులు, రికార్డుల నిర్వహణ, రిజిస్టర్ల తనిఖీలు, పి సి పి ఎన్ డి టి. చట్టంలోని నిబంధనల అమలు తీరుపై సమగ్రంగ సమీక్షించడం జరిగిందిగర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరిక్షలు నిర్వహించడం చట్టరిత్యా నేరమని, , పి సి పి ఎన్ డి టి. చట్ట నిబంధనలను ఉల్లంఘించే స్కానింగ్ కేంద్రాలు, వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు



తీసుకోవాలని సమావేశంలో చర్చించారు. జిల్లాలోని స్కానింగ్ కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణతో పాటు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు.అదేవిధంగ ఆడపిల్లల పట్ల వివక్ష చూపకుండ, బాలికల జనన నిష్పత్తిని పరిరక్షించేల ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగ నిర్వహించాలని తెలిపారు. సమాజంలో స్త్రీ, పురుష సమానత్వ భావనను పెంపొందించేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగ కృషి చేయాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లా అడ్వైజరి కమిటి సభ్యులు డా. స్వప్న (ఓబిజి), డా. శోభారాణి (ఓబిజి), డా. అబినేష్ ఫిజిషియన్, జిల్లా ఉపవైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ అజ్గర్ అలీ, ప్రోగ్రాం అధికారి డా. జి రాజు ఎస్ఓ– తిరుమల్ రెడ్డి, డిపిఎచ్ఎన్ఓ– వరలక్ష్మి, ఇన్‌చార్జ్ మీడియ ఆఫీసర్ హీర్య నాయక్,సిఈఏ– సెక్షన్ నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతులు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు అవలంబించాలి



ఊట్కూర్, నవంబర్ 3 (విజన్ ఆంధ్ర) రైతులు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు సాధించేందుకు టిఆర్ వీకే నిరంతరం కృషి చేస్తుందని కోఆర్డినేటర్ ఈటెల సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఊట్కూర్ మండల పరిధిలోని పగిడిమర్రి లో రైతులకు సి ఎస్ వి 41 జొన్న విత్తనాల పంపిణీ – రబీలో క్షేత్ర ప్రదర్శన చేపట్టారు.ఈ సందర్భంగా కోఆర్డినేటర్ డా. ఈటెల సత్యనారాయణ మాట్లాడుతూజొన్న పంట సాగులో రైతులకు విత్తనాలు అందించడంతో పాటు విత్తనం విత్తిన దశ నుంచి పంట కోత వరకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిస్తామని అన్నారు. ఎరువుల యాజమాన్యం, చీడపీడల నివారణ, తెగుళ్ల నియంత్రణ, సమగ్ర పంట యాజమాన్య పద్ధతులపై రైతులకు దశలవారీగా సలహాలు, సూచనలు అందజేస్తామని పేర్కొన్నారు.నారాయణపేట జిల్లాలోని రైతాంగ సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి లక్ష్యంగా తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం 24 గంటలు , వారంలో ఏడు రోజులూ రైతులకు అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు.రైతుల సమస్యల పరిష్కారం, నూతన వ్యవసాయ సాంకేతికతలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడం, రైతుల ఆదాయాన్ని పెంపొందించడం ప్రధానలక్ష్యమనితెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జాఫర్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాజలింగం కాలనీ, మహాలక్ష్మి నగర్ కాలనీలలో అభివృద్ధి పనులకు శ్రీకారం

సుమారు 90 లక్షల నిధులతో ప్రధాన లింకు రోడ్ల అభివృద్ధి
ముఖ్య అతిథులుగా పాల్గొన్న మాజీ మేయర్ అజయ్ యాదవ్,కొత్త కిషోర్ గౌడ్

బోడుప్పల్,నవంబర్ 03(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని చెంగిచెర్ల డివిజన్ పరిధిలోని ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంలో భాగంగా రాజలింగం కాలనీ పేస్-2, శ్రీ మహాలక్ష్మీనగర్ కాలనీ, ఎస్ ఫై నగర్ కాలనీలను కలిపే ప్రధాన లింకు రోడ్లలో నూతన సిసి రోడ్డు పనులకు మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్,మేడ్చల్ జిల్లా బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, స్థానిక మాజీ కార్పొరేటర్ కొత్త దుర్గమ్మ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా మాజీ మేయర్ మాట్లాడుతూ బోడుప్పల్ సర్కిల్ అభివృద్ధే ధ్యేయం పని చేస్తున్నామని తెలిపారు. శ్రీ మహాలక్ష్మి కాలనీ, రాజలింగం కాలనీ ఫేస్-2, ఎస్వై నగర్ కాలనీలను కలిపి ప్రధాన రోడ్లను సుమారు 90 లక్షల నిధులతో నూతన సీసీ రోడ్లుగా అభివృద్ధి చేస్తున్నామని, త్వరగా పనులు పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామనితెలిపారు. కాలనీ అభివృద్ధికి సహకరిస్తున్న మాజీ మేయర్ అజయ్ యాదవ్, మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు కాంగ్రెస్ నేతలకు మాజీ కార్పోరేటర్ కొత్త దుర్గమ్మ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు పోగుల నరసింహారెడ్డి,మాజీ కార్పోరేటర్ బింగి జంగయ్య యాదవ్,మేడ్చల్ జిల్లా బి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ ప్రెసిడెంట్ షేక్ అక్బర్,చెంగిచెర్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దిలీప్ రెడ్డి ,డివిజన్ ప్రధాన కార్యదర్శి పడతం లోకేష్,రాజలింగం కాలనీ ఫేజ్ -2 అధ్యక్షులు రూపాని రామకృష్ణ,ప్రధాన కార్యదర్శి విఠల్ , ఉపాధ్యక్షులు విష్ణుమూర్తి, యాదగిరి, సుశ్రీత్, కోశాధికారి వేణు, నరసింహారెడ్డి, శ్రీ మహాలక్ష్మి నగర్ కాలనీ అధ్యక్షులు రూపాని విష్ణు,ప్రధాన కార్యదర్శి ప్రదీప్,ఉపాధ్యక్షుడు వరకుప్పల రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్, కోశాధికారి సుదర్శన్ రావు,తదితరులు పాల్గొన్నారు.

జన ఆవాసాల మధ్య ఉన్న జవహర్ నగర్ డంపింగ్ యార్డ్

జన ఆవాసాల మధ్య ఉన్న జవహర్ నగర్ డంపింగ్ యార్డ్: వెంటనే ఎత్తివేయాలి జాయింట్ యాక్షన్ కమిటీ జె ఎ సి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నవంబర్ 3 (విజన్ ఆంధ్ర బ్యూరో): నాటి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 2001 సంవత్సరంలో నాటి తెలుగుదేశం ప్రభుత్వం ఉప్పల్, కాప్రా, అల్వాల్ మున్సిపాలిటీల వ్యర్ధాలను జవహర్ నగర్ లో వేయడానికి 330 ఎకరాల విస్తీర్ణం గల స్థలాన్ని కేటాయించింది. 2004లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని విస్తృతపరిచి గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న చెత్త సంతటిని జవహర్ నగర్ కు తరలించడం మొదలు పెట్టింది. అలా మొదలైన చెత్త రవాణా హైదరాబాద్ మహానగరంలో ఉన్న చెత్తాచెదారం మొత్తం జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ కు చేరడం మూలంగా జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ గోల్కొండ కోటను తలపించేలా నేడు దర్శనమిస్తుంది. 350 ఎకరాల నుండి 400 ఎకరాల విస్తీర్ణంలో 1.4 కోట్ల టన్నుల చెత్త పేరుకుపోయింది . రోజువారి వ్యర్థాలు హైదరాబాదు నలుమూలల నుండి జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ కు సుమారుగా ఎనిమిది వేల నుండి పదివేల టన్నుల ఘన వ్యర్థాలు చేరుతున్నాయి. కాలుష్య వ్యర్థాలు పెరగడం మూలంగా ప్రపంచంలోనే అత్యధిక మిథైన్ వాయువులు విడుదల చేస్తున్న అత్యంత ప్రమాదకరమైన కాలుష్యకారకంగా జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ రూపాంతరం చెందింది . ప్రపంచవ్యాప్తంగా మొదటి నాలుగు స్థానాలలో మొదటిది బ్యూనస్ ఎయర్స్ (అర్జెంటీనా) రెండవది జకార్త (ఇండోనేషియా) మూడవది (కౌలాలంపూర్) ఆ తర్వాత నాలుగవది మన దేశంలోనే జవహర్ నగర్ డంపింగ్ యార్డ్. ప్రపంచంలోనే అత్యధిక మిథైల్ విష వాయువులను విడుదల చేస్తున్న కేంద్రాలలో నాలుగవ స్థానంలో నిలిచింది. అమెరికాకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా లాస్ ఏంజెల్స్, సాటిలైట్ డేటా ఆధారంగా నిర్వహించిన అనేక పరిశోధనలో ఈ అత్యంత భయంకరమైన విషయం తేటతెల్లమైంది. మిథైన్ వాయువు సగటున గంటకు 5.9 టన్నుల నిత్యం వాయువును వాతావరణంలోనీకి విడుదల చేస్తుంది. ఒక్కొక్కసారి అది గరిష్టంగా గంటకు 11.1 టన్నుల వరకు సమోదయ్యే అవకాశం ఉంటుంది . ఇంతటి ప్రమాదకరమైన అత్యంత విషపూరితమైన జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ జనావాసాల




మధ్య ఉండడం ఎంతవరకు సమంజసం. ప్రజల మాన, ప్రాణ ప్రయోజనాల కంటే పారిశ్రామికవేత్తల లాభాలు వారి ప్రయోజనాల కోసమే అన్నట్టుగా నాటి, నేటి పాలకులు ఉన్నట్టు కనబడుతుంది. ఎందుకంటే 2009 నుండి 2012 వరకు వ్యర్థాల నిర్వహణ కోసం రాంకీ ఎన్విరా ఇంజనీర్ సంస్థతో గత జిహెచ్ఎంసి ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. 2012 నుండి చెత్తను శాస్త్రీయ పద్ధతిలో నిర్వాణ కోసం చెత్త నిర్వహణ శాస్త్రీయ పద్ధతిలో రాంకీ సంస్థ బాధ్యతగా ఏనాడు వ్యవహరించలేదు. దీని మూలంగా చెత్త విపరీతంగా పెరిగి దుర్వాసన, కాలుష్యం మూలంగా గాలి నీరు భూమి అనే తేడా లేకుండా పంచభూతాలు కలుషితమైనవి. కుళ్లిపోయిన వ్యర్థాల నుండి కారే అత్యంత ప్రమాదకరమైన లీచేట్ భూమిలోకి ఇంకిపోవడం మూలంగా భూగర్భ జలాలు కలుషితమై జల కాలుష్యం పెరిగిపోతుంది . దీని మూలంగా బోరు, బావులు, నాళాలు, కాలువలు ,చెరువులు నీళ్లు కలుషితమై కనీసం నిత్యవసరల కోసం కాలకృత్యాలు కూడా తీర్చుకోవడానికి ఉపయోగపడకుండా పోయింది . భూగర్భ జలాల్లో కాల్షియం సీసం, ఆర్సనిక్ మొదలైన హానికరమైన లోహాలు భూగర్భంలో పేరుకు పోతున్నాయి. ఇక్కడ నుండి వెలువడే కాలుష్యం దుర్వాసన మూలంగా చుట్టుపక్క ల పరిసర ప్రాంతాలనూ సుమారు 10 నుండి 15 కిలోమీటర్లు దూరంలో ఉన్న దమ్మైగూడ, జవహర్ నగర్, బాలాజీ నగర్, యాప్రాల్, సైనిక్ పురి ,ఇసిఐఎల్, నాగారం, రాంపల్లి, కీసర, ఘట్కేసర్ వరకు ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తుంది. పాతిక వేల కుటుంబాలు , రెండు లక్షలకు పైగా ప్రజల ఆరోగ్యాలపై తీవ్రమైన ప్రభావం పడుతుంది. స్థానిక ప్రజలు చిన్న పెద్ద అనే తేడా లేకుండా శ్వాస కోశ, వ్యాధులు, అస్తమా, చర్మ వ్యాధులు, ఎలర్జీలు, కిడ్నీ సమస్యల బారిన పడి ప్రాణాపాయ స్థితిలోకి నెట్టబడుతున్నారు . స్త్రీలకు బ్రెస్ట్ క్యాన్సర్ , గర్భస్రావాలు జరుగుతున్నాయి. కాలుష్యం, దుర్గంధం పెరగడం మూలంగా ఈగలు, దోమలు, పందులు, కుక్కల సైరవిహారం పెరిగి డెంగు, మలేరియా, రాబిస్ వ్యాధుల బారిన పడి నరకయాతన అనుభవిస్తున్నారు. అయినా పాలకులకు పట్టింపు లేదు. కనీసం ప్రజల యోగక్షేమాల కోసం ఆరోగ్య సంరక్షణ కోసం తాత్కాలిక వైద్య రక్షణ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంతాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలి. 50 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలి. జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ పెరిగిపోతున్న చెత్త భారాన్ని తగ్గించడానికి హైదరాబాద్ నగరం నలుమూలల 4 ప్రత్యామ్నాయ డంపింగ్ యార్డ్స్ ఏర్పాటు చేయాలి . శాస్త్రీయ పద్ధతిలో చెత్త నుండి విద్యుత్తును ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని పెంచి పటిష్టంగా నిర్వహించాలి. డంపింగ్ యార్డ్ ను ఆధునిక శాస్త్రీయ పద్ధతిలో నిర్వహిస్తే కాలుష్యాన్ని నియంత్రించవచ్చని సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అనేకసార్లు సూచన చేసిన రాంకీ సంస్థ యాజమాన్యం పెడచెవిన పెట్టింది. సంస్థ లాభాపేక్ష తప్ప పరిసర ప్రాంత ప్రజల ప్రయోజనాలను లెక్కచేయడం లేదు. ప్రభుత్వం సంబంధిత ఉన్నతాధికారులు రాంకీ సంస్థ డంపింగ్ యార్డ్ శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించే విధంగా కట్టడి చేయాలి . లేని పక్షంలో రాంకీ సంస్థతో చేసుకున్న ఒప్పందాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసుకోవాలి. జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ మూలంగా బాధితుల పక్షాన, ప్రజల పక్షాన వామపక్షాలు సామాజిక సంఘాలు ప్రజా సంఘాలు కార్మిక సంఘాలు మరియు అసోసియేషన్ సంయుక్తంగా జేఏసీగా ఏర్పడి ప్రజాభిప్రాయ సేకరణ కోసం సంతకాల సేకరణ, పాదయాత్ర, ఆందోళన ,పోరాటాలు, ధర్నాలు , సదస్సులు ,రాస్తారోకోలు నిర్వహిస్తున్న ప్రభుత్వంలో స్పందన లేదు. దున్నపోతు మీద వానపడ్డ చందంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి నిరసిస్తూ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) తీవ్రంగా ఖండిస్తుంది.

అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలి

గుర్రంగడ్డ గ్రామంలో పెన్షన్ల జిల్లా స్థాయి తనిఖీ నిర్వహించిన
-- జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు

గద్వాల నవంబర్ 3 (విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల మండలంలోని గుర్రంగడ్డ గ్రామంలో మంగళవారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) నర్సింగరావు పెన్షన్ల పంపిణీకి సంబంధించి జిల్లా స్థాయి తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ,ప్రభుత్వం పేదలు,వృద్ధులు,దివ్యాంగులు, వితంతువులు తదితర అర్హులైన వర్గాల సంక్షేమం కోసం అందిస్తున్న పెన్షన్లు వారికి ఆర్థిక భరోసాగా నిలుస్తున్నాయని తెలిపారు.పెన్షన్ల పంపిణీలో ఎలాంటి నిర్లక్ష్యానికి, అవకతవకలకు తావులేకుండా నిబంధనల ప్రకారం పారదర్శకంగా వ్యవహరించాలని సంబంధిత అధికారులకు సూచించారు.ప్రతి పెన్షన్ లబ్ధిదారుని వివరాలను సంబంధిత రికార్డులతో సరిపోల్చి పరిశీలించాలని, లబ్ధిదారుల గుర్తింపు, అర్హతలు,పంపిణీ వివరాల్లో ఖచ్చితత్వం పాటించాలని తెలిపారు.పెన్షన్ పంపిణీ సమయంలో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు మరియు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ప్రాధాన్యతనిస్తూ మానవీయ దృక్పథంతో సేవలందించాలని సూచించారు.పెన్షన్ల పంపిణీకి సంబంధించిన రిజిస్టర్లు, లబ్ధిదారుల వివరాలు, ఇతర రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించి అందుబాటులో ఉంచాలని సూచించారు.అనంతరం గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్మించిన రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ (వర్షపు నీటి సంరక్షణ)



నిర్మాణాన్ని అదనపు కలెక్టర్ పరిశీలించారు.వర్షపు నీటిని వృథాగా కాలువల్లోకి వెళ్లకుండా సేకరించి భూగర్భ జలాల పెంపునకు ఉపయోగపడేలా ఇటువంటి నిర్మాణాలను ఏర్పాటు చేయడం ఎంతో ముఖ్యమని తెలిపారు.ప్రతి గ్రామంలో నీటి సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు కేవలం ఏర్పాటు చేయడానికే పరిమితం కాకుండా వాటి నిర్వహణపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.గ్రామాల్లో నీటి వృథాను అరికట్టి, భవిష్యత్ తరాలకు నీటి వనరులను అందుబాటులో ఉంచేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.గ్రామ పంచాయతీల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, నీటి సంరక్షణ నిర్మాణాలు ప్రజలకు ఉపయోగపడేలా నిరంతరం పర్యవేక్షించాలని,వాటి నిర్వహణలో గ్రామ పంచాయతీ సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు.గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భాగ్యమ్మ, పంచాయతీ కార్యదర్శి, సంబంధిత సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంటలో క్లోజర్స్ ఫేసింగ్ విధానం అనుసరించాలి

మిషన్ ఆన్ కాటన్ ప్రొడక్టివిటీ పథకం కింద క్షేత్ర ప్రదర్శన
మండల వ్యవసాయ అధికారిణి గోల్కొండ ప్రసన్నలక్ష్మి

వికారాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 3 (విజన్ ఆంధ్ర) : పత్తి పంటలో క్లోజర్ స్పేసింగ్ విధానం అనుసరించాలని వికారాబాద్ మండల వ్యవసాయ అధికారిణి గోల్కొండ ప్రసన్నలక్ష్మి రైతులకు సూచించారు. నిర్ణీత విస్తీర్ణంలో ఎక్కువ మొక్కలను సాగు చేయడం, సరైన మొక్కల సాంద్రతను పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించే అవకాశాల గురించి రైతులకు వివరించామని ఆమె తెలిపారు. మంగళవారం వికారాబాద్ మండల పరిధిలోగల పెండ్లిమడుగు గ్రామంలో రైతు శ్రీనివాస్ పత్తి పొలంలో మిషన్ ఆన్ కాటన్ ప్రొడక్టివిటీ పథకం కింద క్లోజర్ స్పేసింగ్ ఆఫ్ కాటన్ విధానంపై క్షేత్ర ప్రదర్శన చేసి అవగాహన కల్పించామని ఆమె స్పష్టం చేశారు. పత్తి పంటలో సరైన ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్యం, చీడపీడల నివారణ చర్యలపై అవగాహన కల్పించామని ఆమె తెలిపారు. రైతులు ఆధునిక సాగు పద్ధతులను పాటించి పత్తి ఉత్పాదకతను పెంచుకోవాలని వ్యవసాయ అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రమాదేవి నూజివీడు సీడ్స్ ప్రతినిధి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పిరేషనల్ బ్లాక్ ఫెలో పోస్ట్ రాత పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



గద్వాల నవంబర్ 3 (విజన్ ఆంధ్ర బ్యూరో)గట్టు ఆస్పిరేషనల్ బ్లాక్ ఫెలో పోస్ట్ కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం గద్వాలలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. మొత్తం 80 మార్కులకు నిర్వహించే ఈ పరీక్షలో వ్యాసంతో పాటు ప్రజెంటేషన్, డేటా అనాలసిస్, కంప్యూటర్, ఐటీ స్కిల్స్, తదితర అంశాలపై ప్రశ్నలు ఇచ్చినట్లు నిర్వాహకులు కలెక్టరుకు తెలియజేశారు. ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్న వారిలో పరీక్ష రాసేందుకు మొత్తం 76 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 51 మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించి నిబంధనల మేరకు అర్హులైన అభ్యర్థిని ఉద్యోగానికి ఎంపిక చేయాల్సిందిగా ఆదేశించారు. ఈ పర్యటనలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రాజ్ కుమార్, ఈడీఎం శివ, జిహెచ్ఎం రేణుకా దేవి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి పై ప్రమాదాలు జరుగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలి

44వ జాతీయ రహదారిని సందర్శించిన -- జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు



అలంపూర్ నవంబర్ 2 (విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల జిల్లా లోని ప్రధాన జాతీయ రహదారి అయినా 44వ జాతీయ రహదారి పై ఎలాంటి ప్రమాదాలు జరగడం గాని, ప్రాణ నష్టం కానీ జరుగకుండా పటిష్ట చర్యలు తీసుకోవడం తో పాటు అవసరమైన చోట మార్పులు చేర్పులు చేసి తగిన ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు పోలీస్ అధికారులకు, జాతీయ రహదారి అథారిటీ అధికారులకు సూచించారు. మంగళవారం జిల్లా ఎస్పీ జాతీయ రహదారిని సందర్శించి, జిల్లా లోని బీచుపల్లి నుండి అలంపూర్ టోల్ గెట్ వరకు ఉన్న జాతీయ రహదారిని పరిశీలించి ప్రమాదాలు ఎక్కువ జరిగే హాట్ స్పాట్ లను డి. ఎస్పీ మొగిలయ్య తో కలిసి సందర్శించారు. ఈ మధ్యకాలం లో జాతీయ రహదారి పై జరిగిన రోడ్డు ప్రమాదాలకు గల కారణాలను పోలీస్ అధికారులు ఎస్పీ కి వివరించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ,జిల్లా లో ఏప్పుడు అత్యంత రద్దిగా ఉండే జాతీయ రహదారి పై ప్రమాదాలు జరుగకుండా నివారించాలని, అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి అవసరమైన చోట సైన్ బోర్డ్, లైటింగ్ ఏర్పటు చెయ్యాలని, రోడ్డు లో ఏమైనా డిఫెక్ట్ ఉంటే అవసరమైన మార్పులు, చేర్పులు చెయ్యాలని సూచించారు. అలాగే అవసరమైన చోట వేగా నియంత్రికలు కూడా ఏర్పాటు చెయ్యాలని, ముఖ్యశీగా ప్రస్తుతం జాతీయ రహదారి పై ప్రధాన స్టేజిల దగ్గర ఫ్లైఓవర్ లు నిర్మాణం అవుతునందున అక్కడ ఏర్పటు చేసే సర్వీస్ రోడ్ల పక్కన సైడ్ స్థాపర్స్ కు రేడియం స్టిక్కరింగ్ వేయించాలని, రోడ్డు పై వాహనాలు ఎట్టి పరిస్థితులలో నిలుపకుండా హై వే పెట్రోలింగ్ నిరంతర పర్యవేక్షణ ఉండాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్, హై వే అథారిటీ అధికారులు సమన్వయము చేసుకుంటూ ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ పర్యటనలో అలంపూర్, శాంతి నగర్ సి ఐ లు ప్రదీప్, శంకర్, ఎస్సై లు రవి, తరుణ్ కుమార్, స్వాతి, సురేష్, హై వే ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీధర్, ఇంజనీర్స్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు-జిల్లా కలెక్టర్ కె.హరిత



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 3: (విజన్ ఆంధ్ర)జిల్లాలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లాలోని దహేగాం మండల కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుకు కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మండలంలో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అప్పటికప్పుడు పరిష్కారమయ్యే సమస్యలను అదే రోజు పరిష్కరించడం జరుగుతుంది అని తెలిపారు. సమస్యలు ఉన్న రైతులు దరఖాస్తులు సమర్పించాలని, అధికారులు పరిశీలించి క్షేత్రస్థాయిలో సమాచారంతో పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు. ప్రజలు ప్రజాసేతు యాప్ ను సద్వినియోగం చేసుకోవాలని, యాప్ లో ఇంటి వద్ద నుండి క్యూ ఆర్ కోడ్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, ఎలాంటి వ్యయ ప్రయాసలకు గురి కావద్దని తెలిపారు. మండలంలోని హత్తిని గ్రామానికి చెందిన పెద్దల బాణక్క తన భూ సమస్య పరిష్కారానికి మీ సేవలో స్లాట్ బుక్ చేసుకోవడానికి డబ్బులు లేకపోవడంతో ఆందోళన చెందుతున్న విషయం తెలుసుకొని కలెక్టర్ వెంటనే 1 వేయి 500 రూపాయలు మహిళా రైతుకు అందజేయడంతో సదరు మహిళ రైతు ధన్యవాదాలు తెలుపుతూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మునవర్ షరీఫ్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కీసరలో మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ పర్యటన



మల్కాజిగిరి, నవంబర్ 3, విజన్ ఆంధ్ర: మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ మంగళవారం డీఈఈ, ఏఈలతో కలిసి కీసర సర్కిల్‌లో పర్యటించారు. ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా నీటి సరఫరా ఏర్పాట్లపై హెచ్ ఎం డబ్ల్యూ ఎస్ ఎస్ బీ, మిషన్ భగీరథ అధికారులతో సమన్వయం చేసుకుని,ప్రజలకు నిరంతర నీటి సరఫరా అందించేందుకు, ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు.

విధుల పట్ల అంకితభావంతో పనిచేయడం అభినందనీయం -జిల్లా కలెక్టర్ కె.హరిత



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 3:(విజన్ ఆంధ్ర)విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించడంతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. మంగళవారం జిల్లాలోని రెబ్బెన మండల కేంద్రంలో ఎస్.సి. కాలనీలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలనుఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఇటీవల పాఠశాల ఉపాధ్యాయుల వ్యవహారశైలిపై విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అందిన ఫిర్యాదుల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పాఠశాల పరిస్థితులను పరిశీలించి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యాబోధన జరుగుతున్న తీరును, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను, ఉపాధ్యాయుల పనితీరును స్వయంగా పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రశ్నలు అడిగి వారి పఠనా సామర్థ్యం, విషయ పరిజ్ఞానాన్ని పరీక్షించారు. విద్యార్థులు చక్కగా చదవడం, ఉపాధ్యాయులు వారికి అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలను బోధించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో నిర్వహిస్తున్న కంప్యూటర్ తరగతులను పరిశీలించి, కంప్యూటర్ విద్యపై విద్యార్థులకు ఉన్న ఆసక్తిని గమనించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం అందించడం అభినందనీయమని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించడం ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వేయవచ్చని తెలిపారు. విద్యార్థులకు సాధారణ విద్యతో పాటు కంప్యూటర్ విద్యను అందిస్తున్న ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, భోజనం నాణ్యత, రుచి, పరిశుభ్రతను గమనించారు. విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన, రుచికరమైన, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలకు పిలిపించి వారితో మాట్లాడారు. పాఠశాలలో విద్యాబోధన, ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని, తమ పిల్లలను ప్రతిరోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని సూచించారు. విద్యార్థుల విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల భాగస్వామ్యం ఎంతో కీలకమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో అందుబాటులో ఉన్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండటం, విద్యార్థులకు అనుకూలమైన వాతావరణం కల్పించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రతి ఉపాధ్యాయుడు అంకితభావంతో పనిచేయాలని, విద్యార్థులలో చదువుపై ఆసక్తి పెంపొందిస్తూ వారి సామర్థ్యాలకు అనుగుణంగా బోధన అందించాలని సూచించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి విద్య, క్రమశిక్షణ, నైతిక విలువలు, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన ఎంతో అవసరమని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అయిజ మున్సిపల్ చైర్మన్ సీఎం సురేష్ అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం..

49 అంశాలకు ఆమోదం



అయిజ నవంబర్ 3 (విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పురపాలక సంఘం కౌన్సిల్ సాధారణ సమావేశం మంగళవారం మున్సిపల్ చైర్మన్ సీఎం సురేష్ అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో మొత్తం 51 అంశాలను ప్రవేశపెట్టగా, 39, 45వ అంశాలను తిరస్కరించి మిగిలిన 49 అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.ఈ సమావేశంలో పట్టణంలోని వివిధ వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి పైప్‌లైన్లు, వీధి దీపాలు, రోడ్ల మరమ్మతులు తదితర అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలకు ఆమోదం లభించింది.ముఖ్యంగా వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు రూ.20 లక్షలు, డంపింగ్ యార్డులో సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్‌కు విద్యుత్ సదుపాయం కల్పించేందుకు రూ.25 లక్షల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు.అదేవిధంగా రాజోలి వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నుంచి అయిజ, వడ్డేపల్లి మున్సిపాలిటీలకు తాగునీటి సరఫరా మెరుగుపరిచేందుకు రూ.20 కోట్లతో రూపొందించిన వాటర్ సప్లై ఇంప్రూవ్‌మెంట్ స్కీమ్‌కు ప్రభుత్వ పాలనా అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.అలాగే శిథిలావస్థలో ఉన్న తాగునీటి ట్యాంకుల తొలగింపు, అంగన్‌వాడీ కేంద్రాలకు తాగునీటి సదుపాయం, వీధి కుక్కల నియంత్రణ, పారిశుద్ధ్య నిర్వహణ, రోడ్ల భద్రత తదితర అంశాలపై కూడా నిర్ణయాలు తీసుకున్నారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్, వైస్ చైర్మన్, వార్డు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ లోన్లకు వడ్డీ మాత్రమే కట్టించుకోవాలి

యూనియన్ బ్యాంకు మేనేజర్ కి వినతిపత్రం అందజేసిన -- రాజోలి గ్రామ రైతులు



రాజోలి నవంబర్ 3 (విజన్ ఆంధ్ర)జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండల కేంద్రంలో రైతులు మంగళవారం యూనియన్ బ్యాంక్ మేనేజర్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం రాజోలి కరువు మండలంగా ప్రకటించిన విషయాన్ని తెలుపుతూ, గ్రామంలో ఎలినో ప్రభావంతో రైతులు వేసిన పంట పొలాలన్నీ ఎండిపోయినయ్ రైతులు అప్పులు చేసి వ్యవసాయంలో చాలా నష్టాల్లో కూరుకుపోయారు . కావున అగ్రికల్చర్ లోన్లకు వడ్డీ మాత్రమే కట్టించుకొని అన్ని విధాల రైతులను ఆదుకోవాలని విన్నవించారు. అలాగే ప్రభుత్వం చెప్పిన విధంగా రైతులకు ఇబ్బందులు కలవకుండా చూడాలని, రైతులకు తక్షణమే లోన్లు రీ షెడ్యూల్ చేయాలని తెలుపుతూ రాజోలి రైతులందరము కలసి వినతి పత్రం అందించడం జరిగిందని రైతులు తెలిపారు. ఇట్టి విషయంపై బ్యాంకు మేనేజర్ సానుకూలంగా స్పందిస్తూ రైతుల విషయం పై అధికారులకు తెలిపి రైతులకు వెసులుబాటు కల్పిస్తామని తెలిపారు.

జల్లాపురం గ్రామంలో లీ సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలన

రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



మానవపాడు నవంబర్ 3 (విజన్ ఆంధ్ర బ్యూరో)జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం జల్లాపురం గ్రామ శివారులో నిర్వహిస్తున్న రీసర్వే పనులను మంగళవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆకస్మికంగా పరిశీలించారు. నిబంధనలను అనుసరించి సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని, హద్దుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. రైతుల పొలాల సర్వే విషయంలో పక్క చేను రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఇరుపక్షాల సమక్షంలో నిష్పక్షపాతంగా సర్వే చేయాలన్నారు. ఆయా గ్రామాల సర్పంచులు సర్వేకు సహకరించాలని, ప్రజలకు ఏమైనా సందేహాలు ఉంటే అధికారులను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని కోరారు. లైసెన్స్ సర్వేయర్ల సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు.సమీప పొలాల రైతులు కలెక్టర్ ను కలవగా వివిధ అంశాలపై మాట్లాడారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్నందున రైతులు రబీ సీజన్ లో ఆరుతడి పంటలపై దృష్టి సారించాలన్నారు. జిల్లాలోని రిజర్వాయర్లలో ఉన్న కొద్దిపాటి నీళ్లను వచ్చే వర్షాకాలం వరకు తాగునీటి అవసరాలకు వినియోగించడం జరుగుతుందన్నారు. పంటలకు సాగునీటిని విడుదల చేసే అవకాశం లేదని తమ బోరు, బావుల్లో నీటి లభ్యత ఆధారంగా మాత్రమే పంటలు సాగు చేయాలని, ఎలాంటి నీటి వసతులు లేని రైతులు ఏ పంటలు సాగు చేయవద్దన్నారు. ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని, పాడిపై కూడా రైతులు దృష్టి పెడితే మంచి ఆదాయాన్ని పొందవచ్చన్నారు. సమీపంలోని ఆర్డిఎస్ కాలువను పరిశీలించిన కలెక్టర్ నీళ్లు చాలా తక్కువగా ఉన్నందున రైతులు తుంగభద్ర నీటిపై ఆధారపడి పంటలు సాగు చేస్తే ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఉపాధి హామీలో ఒక్కో గ్రామ పంచాయతీలో రూ. 1.0 కోటి విలువైన పనులను చేసేందుకు అవకాశం ఉందన్నారు. వివిజి రాంజీ పథకంలో జలసిరి కార్యక్రమంలో పంట కుంటలు, ఇంకుడు గుంతలు, తదితర జల సంరక్షణ పనులను పెద్ద ఎత్తున చేపట్టాలని అధికారులకు సూచించారు. రైతు కూలీలు వ్యవసాయ పనులు చేయలేకపోతున్నామని నిరుత్సాహ పడకుండా ఉపాధి హామీ పనులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటే లబ్ధి పొందవచ్చన్నారు. ఉపాధి హామీలో కాలువల వెంట పెరిగిన ముళ్ల పొదలను తొలగించడంతోపాటు డిస్ట్రిబ్యూటరీ, ఫీడర్ ఛానల్ కాలవల్లో పూడికతీత పనులు కూడా చేపట్టేందుకు అధికారులు కృషి చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తెలియజేశారు.ఈ పర్యటనలో సర్పంచ్ నందిని, సర్వే ఏడి నూకరాజు, తహసిల్దార్ మన్సూర్ అలీ సిద్దికి, డిప్యూటీ తహసిల్దార్ రాములు, ఆర్ఐ గురురాజు, సర్వేయర్ ఇలాయత్, తదితరులున్నారు.

అకాల వర్షం.. నేలకొరిగిన వరి పంట!

కష్టపడి పండించిన పంట కళ్లముందే నాశనం.. ఆందోళనలో అన్నదాతలు



నారాయణపేట, నవంబర్ 3 (విజన్ ఆంధ్ర)ఆరుగాలం కష్టపడి సాగు చేసిన వరి పంట చేతికొచ్చే సమయంలో ప్రకృతి ప్రకోపం రైతులకు కన్నీళ్లు మిగిల్చింది. గత రెండు రోజులుగా ఊట్కూర్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో వీచిన ఈదురు గాలులు, కురిసిన అకాల వర్షానికి వరి పంట నేలకొరిగింది. పంట కోతకు సిద్ధంగా ఉన్న సమయంలో ఒక్కసారిగా వాతావరణం మారడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.పెట్టుబడుల కోసం అప్పులు చేసి, కుటుంబ సభ్యులతో కలిసి కష్టపడి సాగు చేసిన పంట కళ్లముందే నేలరాలడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సాగు ఖర్చులు పెరిగి ఇబ్బందులు పడుతున్న రైతులకు అకాల వర్షం రూపంలో మరో దెబ్బ తగిలింది. నేలకొరిగిన వరి పంటను కోయడం, ధాన్యాన్ని సేకరించడం కష్టంగా మారిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట నాణ్యత దెబ్బతినడంతో పాటు దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని వాపోతున్నారు.ప్రభుత్వ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి అకాల వర్షానికి దెబ్బతిన్న వరి పంటను పరిశీలించి నష్టాన్ని అంచనా వేయాలని సామాజిక కార్యకర్త హెచ్. నరసింహ కోరారు. నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.25 వేల చొప్పున నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిహారం మంజూరు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కామారెడ్డి మున్సిపాలిటీపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణకు ఆదేశం

- నిర్దిష్ట గడువులోగా విచారణ నివేదిక సమర్పించాలి - జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కామారెడ్డి బ్యూరో నవంబర్ 3(విజన్ఆంధ్ర)కామారెడ్డి మున్సిపాలిటీలో కొందరు కౌన్సిలర్లు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని, మున్సిపల్ పాలనలో పలు అవకతవకలు జరుగుతున్నాయని ఇటీవల పలు దినపత్రికల్లో ప్రచురితమైన కథనాలపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ స్పందించారు. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరిని ఆదేశించారు.ఈ విచారణలో భాగంగా మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం పరిధిలో చేపట్టిన టెండర్ల ప్రక్రియ, పారిశుద్ధ్య సిబ్బంది నియామకాలు, వారి హాజరు, వేతనాల చెల్లింపులు, సీసీ కెమెరాల ఏర్పాటు పనులు, వాటిలో ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యుల జోక్యంపై వచ్చిన ఆరోపణలను క్షుణ్ణంగా పరిశీలించనున్నారు.అదేవిధంగా పట్టణ ప్రణాళికా విభాగం జారీ చేసిన నోటీసులు, వాటిపై తీసుకున్న తదుపరి చర్యలు, మున్సిపల్ కౌన్సిల్ నెలవారీ సమావేశాల నిర్వహణ, గణేష్ నిమజ్జనం ఏర్పాట్ల కోసం కొనుగోలు చేసిన ఇనుప సామగ్రి వినియోగం, అనంతరం వాటి విక్రయానికి సంబంధించిన వివరాలను విచారణలో పరిశీలించనున్నారు.మున్సిపల్ వాహనాల నెలవారీ ఇంధన వినియోగం, వ్యాపార అనుమతుల జారీ, ఇంటి పన్ను మదింపు ప్రక్రియ తదితర అంశాలపైనా సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించనున్నారు.ఆరోపణలు రుజువైతే బాధ్యులపై చర్యలుఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు అందించే సేవల్లో ఎలాంటి అవకతవకలు, అక్రమ వసూళ్లు జరిగినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. విచారణలో ఆరోపణలు రుజువైతే బాధ్యులైన ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.మున్సిపల్ సేవల కోసం ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసినా, ప్రజలను బెదిరింపులకు గురిచేసినా సంబంధిత ఆధారాలతో ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. ఫిర్యాదులను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కార్యాలయంలో లేదా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో సమర్పించవచ్చని తెలిపారు.ఫిర్యాదుదారుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని కలెక్టర్ స్పష్టం చేశారు. మున్సిపల్ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కేంద్ర ఉద్యోగులకు పెరగనున్న డీఏ

న్యూఢిల్లీ, నవంబర్ 3, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. కరువు భత్యం , కరువు ఉపశమనంలను 3 శాతం పాయింట్లు పెంచేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో ఉద్యోగుల డీఏ, పింఛనుదారుల డీఆర్ 60 శాతం నుంచి 63 శాతానికి పెరగనున్నాయి. దాదాపు 50 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 68 లక్షల మంది పింఛనుదారులు ప్రయోజనం పొందనున్నారు.డీఏ పెంపు ఉద్యోగుల ప్రాథమిక వేతనంపై ఆధారపడి ఉంటుంది. అంటే ప్రాథమిక వేతనంలో 3 శాతం పాయింట్ల మేరకు అదనపు భత్యం లభిస్తుంది. ఉదాహరణకు, రూ. 18,000 బేసిక్ పే ఉన్న ఉద్యోగికి ప్రస్తుతం 60 శాతం డీఏ ప్రకారం రూ. 10,800 లభిస్తోంది. కొత్త రేటు 63 శాతానికి చేరితే ఈ మొత్తం రూ. 11,340 అవుతుంది. అంటే నెలకు అదనంగా రూ. 540 అందుతుంది. అలాగే, రూ. 35,400 ప్రాథమిక వేతనం ఉన్న ఉద్యోగికి నెలకు రూ. 1,062 అదనంగా లభిస్తుంది. రూ. 50,000 బేసిక్ పే ఉన్న ఉద్యోగికి నెలవారీ డీఏ రూ. 30,000 నుంచి రూ. 31,500కు పెరుగుతుంది. దీంతో నెలకు రూ. 1,500 అదనపు ప్రయోజనం కలుగుతుంది.మోదీ సర్కార్ నిర్ణయం వల్ల కేంద్ర ప్రభుత్వ పింఛనుదారులకూ ప్రయోజనం కలుగుతుంది. వారి అర్హతగల ప్రాథమిక పింఛనుపై డీఆర్ 60 శాతం నుంచి 63 శాతానికి పెరుగుతుంది. దీంతో నెలవారీ పింఛను ఆదాయంలో పెరుగుదల ఉంటుంది.డీఏ, డీఆర్ పెంపుతో కేంద్ర ప్రభుత్వంపై ఏడాదికి సుమారు రూ. 10,016 కోట్ల అదనపు ఆర్థిక భారం పడనున్నట్లు సమాచారం. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల ప్రభావాన్ని తగ్గించి, ఉద్యోగులు, పింఛనుదారులకు ఆర్థిక ఊరట కల్పించడం ఈ నిర్ణయం ఉద్దేశమని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.సాధారణంగా కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రెండుసార్లు జనవరి 1, జూలై 1 తేదీల నుంచి అమలయ్యేలా డీఏ, డీఆర్ రేట్లను సవరిస్తుంది. అయితే తాజా పెంపు అమలు తేదీ, బకాయిల చెల్లింపుపై తుది స్పష్టత కోసం అధికారిక ప్రభుత్వ ఉత్తర్వులను జారీ చేసింది.

ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులపై క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించిన జిల్లా కలెక్టర్

తక్కువ నీటి వినియోగంతో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలి
జిల్లా కలెక్టర్ ప్రియాంక



నారాయణపేట ప్రతినిధి, నవంబర్ 3 (విజన్ ఆంధ్ర) ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాల తగ్గుదల కారణంగా పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ప్రియాంక మంగళవారం క్షేత్రస్థాయిలో పర్యటించి పంటల పరిస్థితిని పరిశీలించారు. నారాయణపేట మండల పరిధిలోని అప్పక్‌పల్లి, చిన్నజట్రం, కొల్లంపల్లి గ్రామాల్లో పర్యటించిన కలెక్టర్ ఆయా గ్రామాలకు చెందిన రైతుల పంట పొలాలను సందర్శించి వర్షాభావ పరిస్థితుల వల్ల దెబ్బతిన్న పంటలను స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా అప్పక్‌పల్లి గ్రామానికి చెందిన రైతు సాగు చేసిన వరి, టమాట, మిరప పంటలను కలెక్టర్ పరిశీలించారు. సకాలంలో వర్షాలు కురవకపోవడం, భూగర్భ జలమట్టం తగ్గిపోవడంతో బోర్లలో నీరు అడుగంటిపోయి పంటలకు సాగునీరు అందకపోవడంతో పంటలు ఎండిపోయిన పరిస్థితిని రైతు కలెక్టర్‌కు వివరించారు. ముఖ్యంగా వరి పంటకు అవసరమైన నీరు అందుబాటులో లేకపోవడంతో పంటను కొనసాగించలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.తాను ఇతరుల భూమిని కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్నానని, పంటల సాగు కోసం పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని రైతు తన ఆవేదనను కలెక్టర్‌కు వివరించారు. రైతు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్న కలెక్టర్ విచారం వ్యక్తం చేస్తూ, ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల సాగుపై ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు.అనంతరం చిన్నజట్రం, కొల్లంపల్లి గ్రామాల్లో మరో ఇద్దరు రైతులు సాగు చేసిన వరి పంటలను కూడా కలెక్టర్ పరిశీలించారు. వర్షాలు లేకపోవడం, బోర్లలో నీటి లభ్యత తగ్గిపోవడంతో ఎండిపోయిన పంటలను పరిశీలించి రైతులతో నేరుగా మాట్లాడారు. గత సంవత్సరం ఇదే సమయంలో వర్షపాతం ఎలా ఉందని, అప్పట్లో ఎంత విస్తీర్ణంలో పంటలు సాగు చేశారని, ప్రస్తుత పరిస్థితులతో పోలిస్తే దిగుబడులు, పెట్టుబడులు, ఆదాయంలో ఎంత తేడా వచ్చిందని రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఎల్‌నినో ప్రభావం వల్ల వాతావరణంలో చోటుచేసుకునే మార్పులు వర్షపాతంపై ప్రభావం చూపే అవకాశం ఉందని, వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో వ్యవసాయ రంగం సవాళ్లను ఎదుర్కొంటోందని కలెక్టర్ పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో భూగర్భ జలాలపై ఒత్తిడి పెరుగుతోందని, బోర్లలో నీటి లభ్యత తగ్గిపోవడం వల్ల ముఖ్యంగా అధిక నీటి అవసరం ఉన్న పంటల సాగు రైతులకు భారంగా మారుతోందని తెలిపారు.రైతులు కేవలం వర్షాలపైనే ఆధారపడకుండా అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూగర్భ జలాల పరిస్థితి, నేల స్వభావం, వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో అధిక నీటి వినియోగం అవసరమయ్యే సంప్రదాయ పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని తెలిపారు.

రైతులకు అండగా ఉండేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. గ్రామాల్లో పంటల పరిస్థితి, నీటి వనరుల లభ్యత, సాగు విస్తీర్ణం తదితర అంశాలను పరిశీలిస్తూ రైతులకు అవసరమైన వ్యవసాయ సలహాలు అందించాలని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించడంతో పాటు నీటి పొదుపు పద్ధతులపై సూచనలు చేయాలని పేర్కొన్నారు.రైతులు ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల సాగులో తగిన మార్పులు చేసుకోవాలని, ప్రకృతి పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారా పెట్టుబడి నష్టాలను తగ్గించుకునే ప్రయత్నం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచించారు.జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులపై ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం దృష్టి సారిస్తున్న నేపథ్యంలో రైతులకు సరైన సమయంలో వ్యవసాయ సలహాలు అందించడం, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించడం ద్వారా వ్యవసాయ రంగానికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్, మండల వ్యవసాయ శాఖ అధికారి, ఏఈఓలు పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మోడల్ స్కూల్‌లో ఆకస్మిక తనిఖీ..
విద్యా ప్రమాణాలు, మౌలిక వసతుల పరిశీలన



ఆదిలాబాద్ బ్యూరో నవంబర్ 3 (విజన్ ఆంధ్ర)ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు, పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు.మంగళవారం గుడిహత్నూర్ మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, విద్యార్థుల హాజరు శాతం, మౌలిక వసతులను పరిశీలించారు. ఉపాధ్యాయులతో మాట్లాడి బోధనా ప్రమాణాలు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యంపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని సూచించారు.మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులతో కలిసి నేలపై కూర్చొని భోజనం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా? భోజనం రుచిగా ఉంటుందా? నాణ్యత ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ పరిశుభ్రమైన, పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని, భోజన తయారీ, సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని నిర్వాహకులను హెచ్చరించారు.అనంతరం వంటశాల, కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు. పాఠశాల ప్రాంగణంలో సాగు చేస్తున్న వివిధ రకాల కూరగాయల మొక్కలను తిలకించారు. కిచెన్ గార్డెన్‌లో పండించిన తాజా కూరగాయలను విద్యార్థుల భోజనానికి వినియోగించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇటువంటి తోటల ద్వారా విద్యార్థులకు ప్రకృతి, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. పాఠశాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి సూచించారు.అనంతరం పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులు రూపొందించిన ప్రయోగాలు, ప్రాజెక్టులను పరిశీలించి వారి ప్రతిభను అభినందించారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన యోగా, మ్యూజిక్ రూమ్‌లను ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు సృజనాత్మకత, శారీరక, మానసిక వికాసానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.జిల్లా స్థాయి పీఎం శ్రీ పాఠశాలల మాక్ పార్లమెంట్ పోటీల్లో గుడిహత్నూర్ తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలవడం పట్ల కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు తన చేతుల మీదుగా సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్ ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, తహసీల్దార్ కవితారెడ్డి, ఏపీఎం సుజాత, సర్పంచ్ ఆడే శీల, ఉపాధ్యాయులు, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు వృత్తి నైపుణ్యాలతో ఆర్థికంగా ఎదగాలి

మూడు నెలల ఉచిత వృత్తి శిక్షణ తరగతులు ప్రారంభించిన సింగరేణి సేవా సమితి
టైలరింగ్, మగ్గం వర్క్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లో శిక్షణ
శిక్షణ పూర్తి చేసిన వారికి ఖాదీ గ్రామోద్యోగ్ మహా విద్యాలయం సర్టిఫికెట్లు



కొత్తగూడెం బ్యూరో నవంబర్ 04(విజన్ ఆంధ్ర)మహిళలు వృత్తి విద్యా కోర్సులను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఆర్థికంగా ఎదగాలని సింగరేణి జీఎం (పర్సనల్) వెల్ఫేర్, సీఎస్ఆర్ అండ్ సెక్యూరిటీ కే. అజయ్ కుమార్ పిలుపునిచ్చారు.సింగరేణి కార్పొరేట్ ఏరియాలో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలకు మూడు నెలల పాటు నిర్వహించనున్న ఉచిత వృత్తి శిక్షణ తరగతులను మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. పాత కొత్తగూడెం మహిళలకు టైలరింగ్, బర్లిపిట్ మహిళలకు మగ్గం వర్క్, గాజులరాజం బస్తీ మహిళలకు ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లో శిక్షణ అందించనున్నారు.ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ.. ఉద్యోగుల కుటుంబ మహిళలతో పాటు ప్రాజెక్టు ప్రభావిత, పరిసర ప్రాంత మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చేయడమే సింగరేణి సేవా సమితి ప్రధాన లక్ష్యమన్నారు. అందులో భాగంగానే వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలు శిక్షణ తరగతులకు క్రమం తప్పకుండా హాజరై, నైపుణ్యాలను పూర్తిస్థాయిలో నేర్చుకొని స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని సూచించారు.శిక్షణ పూర్తయిన అనంతరం నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు హైదరాబాద్‌లోని ఖాదీ గ్రామోద్యోగ్ మహా విద్యాలయం ద్వారా ధ్రువపత్రాలు అందజేయనున్నట్లు వెల్లడించారు. శిక్షణ పొందిన మహిళలు సొంతంగా యూనిట్లు ఏర్పాటు చేసుకోవడంతో పాటు మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్‌లో స్టాళ్లు ఏర్పాటు చేసి విక్రయించేందుకు కూడా సింగరేణి సంస్థ సహకారం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) బి. శివ కేశవ రావు, డీవైపీఎం కే. శివ కుమార్, వెల్ఫేర్ పీఏ కే. వరప్రసాద రావు, సేవా కో-ఆర్డినేటర్ ఇజాజ్ షరీఫ్, సేవా సెక్రటరీ మాధవీ స్వర్ణలత, సేవా కో-ఆర్డినేటర్లు రమాదేవి, మీనాక్షి, అరుణ, పద్మావతి, దీప, శిక్షకులు, సేవా సభ్యులు, శిక్షణ అభ్యర్థులు పాల్గొన్నారు.

మురాసు తుఫాన్ ప్రభావం
పెన్‌పహాడ్ వ్యాప్తంగా నేలవాలిన వరి చేలు

పెన్‌పహాడ్, నవంబర్ 03 : మురాసు తుఫాన్ ప్రభావంతో వీచిన బలమైన గాలులకు పెన్‌పహాడ్ మండల వ్యాప్తంగా వరి చేలు నేలకొరిగాయి. అర్నబ్ తుఫాన్ దెబ్బ నుండి కోలుకోకముందే ఇప్పుడు మరో తుఫాన్ మురాసు ప్రభావం వల్ల మంగళవారం కురిసిన వర్షం, గాలులకు చేతికొచ్చిన పంట పొలాలకు నేల వాలాయి. అన్నదాతలు సాగునీటి కష్టాలు ఎదుర్కొని మండల వ్యాప్తంగా సుమారు 5 వేల ఎకరాలలో వరి పండించారు. ప్రస్తుతం పంట కోత దశకు వచ్చింది. ఈ దశలో వరుస తుఫాన్లు రైతులను కలవరపెడుతున్నాయి. అర్నబ్ తుఫాన్ ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో ఉన్న పంట పొలాలు ముంపునకు గురై దెబ్బతిన్నాయి. ఇప్పుడు మురాసు తుఫాన్ వచ్చి నిండా రైతులను ఆగం చేసినవి. పెన్‌పహాడ్ గ్రామానికి చెందిన కౌలు రైతు బంటు కృష్ణ సాగు చేసిన 8 ఎకరాల వరి పంట గాలుల ధాటికి పూర్తిగా నేలవాలింది. పంట చేతికొచ్చే సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే సాగు కోసం భారీగా పెట్టుబడులు పెట్టిన రైతులకు పంట నేలకొరగడంతో ఆర్థికంగా నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడింది. కష్టపడి సాగు చేసిన పంట గాలుల ప్రభావంతో దెబ్బతినడంతో పెట్టుబడులు తిరిగి వస్తాయో లేదోనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కరువు మండలంగా ప్రకటించిన పెన్‌పహాడ్ మండలంలో తుఫాన్ ప్రభావం రైతులను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. ఒకవైపు కరువు పరిస్థితులు, మరోవైపు తుఫాన్ ప్రభావంతో పంటలు దెబ్బతినడం రైతులకు తీవ్ర భారంగా మారింది.

డిసెంబర్ 15 నుంచి ఆశా వర్కర్ల నిరవధిక సమ్మె
కనీస వేతనం రూ.18 వేలు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్




సిర్పూర్ (టి), నవంబర్ 3 (విజన్ ఆంధ్ర): కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) మండలం లోనవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో మంగళవారం ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మెడికల్ సూపర్‌వైజర్ పద్మజకు సమ్మె నోటీసు అందజేశారు. ఆశా వర్కర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని, కనీస వేతనంగా నెలకు రూ.18 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు యూనియన్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నగరం పద్మ మాట్లాడుతూ.. ఆశా వర్కర్లతో ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయించుకుంటూ కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ప్రజలకు నిరంతరం వైద్య ఆరోగ్య సేవలు అందిస్తూ, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల విజయవంతానికి ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ వారికి తగిన గుర్తింపు, గౌరవం, వేతనాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఆశా వర్కర్లకు నెలకు రూ.18 వేల స్థిర వేతనం నిర్ణయించి పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ.50 లక్షల జీవిత బీమా, రూ.50 వేల అంత్యక్రియల ఖర్చులు చెల్లించాలని డిమాండ్ చేశారు. రూ.5 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించడంతో పాటు పారితోషికాలలో సగం పెన్షన్‌గా ఇవ్వాలని కోరారు. ప్రతి ఆదివారం, పండుగ సెలవులతో పాటు ఏడాదికి 20 రోజుల సాధారణ సెలవులు, ఆరు నెలల వేతనంతో కూడిన వైద్య సెలవులు మంజూరు చేయాలని పేర్కొన్నారు. ఏఎన్ఎం, జీఎన్ఎం శిక్షణ పూర్తి చేసిన ఆశా వర్కర్లకు పదోన్నతి సౌకర్యం కల్పించాలని, రెండో పీఆర్సీలో కనీస వేతనాన్ని రూ.30 వేలకు పెంచాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రకటించిన రెండు డీఏలను ఆశా వర్కర్లకు కూడా వర్తింపజేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.డిసెంబర్ 15 నుంచి ప్రారంభమయ్యే నిరవధిక సమ్మెలో జిల్లా వ్యాప్తంగా ఆశా వర్కర్లందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నగరం పద్మ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్, జిల్లా సహాయ కార్యదర్శి వెలిశాల కృష్ణమాచారి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు చిలారి సురేఖ, పీహెచ్‌సీ లీడర్ కేసర కవిత, ఇతర పీహెచ్‌సీ నాయకులు నిర్మల, శారదతో పాటు పెద్ద సంఖ్యలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బియ్యం వ్యాపార దుకాణాల్లో తనిఖీలు రెండు కేసులు నమోదు
- అధిక ధరలకు బియ్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం - అదనపు కలెక్టర్ విక్టర్



కామారెడ్డి బ్యూరో నవంబర్ 3(విజన్ఆంధ్ర)కామారెడ్డి పట్టణంలో బియ్యం ధరల పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని, ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశంలో జారీ చేసిన ఆదేశాల మేరకు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు, తూనికలు కొలతల శాఖ అధికారితో కలిసి పట్టణంలోని పలు హోల్‌సేల్, రిటైల్ బియ్యం వ్యాపార దుకాణాల్లో మంగళవారం తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల సందర్భంగా బియ్యం ప్యాకెట్లపై తయారీదారు చిరునామా, వినియోగదారుల సేవా కేంద్రం ఫోన్ ముద్రించకపోవడాన్ని అధికారులు గుర్తించారు. నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి న్యాయ కొలతల శాస్త్రం (ప్యాకేజ్డ్ కమోడిటీస్) నిబంధనలు 2011లోని 6(1)(ఎ), 6(2) నిబంధనల ప్రకారం రెండు వ్యాపార సంస్థలపై కేసులు నమోదు చేశారు.కేసులు నమోదైన వ్యాపార సంస్థలు:1.జై సంతోషిమాత కిరాణా, సుభాష్ రోడ్, కామారెడ్డి2.లక్ష్మీ సాయి కిరాణా, జేపీఎన్ రోడ్, కామారెడ్డి.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్ మాట్లాడుతూ, కామారెడ్డి పట్టణంలోని హోల్‌సేల్, రిటైల్ బియ్యం వ్యాపారులు ప్రభుత్వం, సంబంధిత అధికారులు నిర్ణయించిన గరిష్ట ధరలకు మించి బియ్యం విక్రయించరాదని స్పష్టం చేశారు. నిర్ణీత ధరలను ఉల్లంఘించి అధిక ధరలకు బియ్యం విక్రయించినట్లు గుర్తిస్తే సంబంధిత చట్టాలు, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలకు బియ్యం న్యాయమైన ధరలకు అందుబాటులో ఉండేలా వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, తనిఖీలకు వచ్చే అధికారులకు సహకరించాలని అదనపు కలెక్టర్ సూచించారు.

భూ భారతి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి - జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కామారెడ్డి బ్యూరో నవంబర్ 3(విజన్ఆంధ్ర)భూ భారతి దరఖాస్తులతో పాటు పునఃసర్వే, జీఓ 59, భూదాన్ భూములు, విజిలెన్స్ కేసులు, హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించిన అంశాలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు.మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో రెవెన్యూ డివిజన్ అధికారులు, తహసీల్దార్లతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో వివిధ అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూ భారతి పాత, కొత్త విధానాల్లో అందిన దరఖాస్తుల పరిష్కార పురోగతిని సమీక్షించారు. ముఖ్యంగా 60 రోజులకు పైగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ప్రాధాన్యత క్రమంలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.భూదాన్ భూములకు సంబంధించిన వివరాలను రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం ఫారం-1 నుంచి ఫారం-4 వరకు అవసరమైన వివరాలను భూ భారతి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.జీఓ 59 కింద అందిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, తదుపరి ప్రక్రియ కోసం నిర్దేశించిన రుసుమును బ్యాంకు చలానా ద్వారా చెల్లించేలా సంబంధిత దరఖాస్తుదారులకు డిమాండ్ నోటీసులు జారీ చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు.పునఃసర్వే పురోగతిని సమీక్షిస్తూ, ప్రతి రెవెన్యూ డివిజన్ అధికారి, తహసీల్దార్ రోజుకు కనీసం ఒక గ్రామాన్ని సందర్శించి పునఃసర్వే పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి బృందానికి రోజుకు కనీసం 30 ఎకరాల పునఃసర్వే పూర్తి చేసే లక్ష్యాన్ని నిర్దేశించినందున, లక్ష్యాలకు అనుగుణంగా పనులు జరిగేలా చూడాలన్నారు.ప్రభుత్వ అవసరాల కోసం సేకరించిన భూముల వివరాలను కూడా భూ భారతి పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేసి, భూముల వివరాలను నవీకరించాలని ఆదేశించారు. ముఖ్యంగా సాగునీటి ప్రాజెక్టులు, జాతీయ రహదారులు తదితర అభివృద్ధి పనుల కోసం సేకరించిన భూముల వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయాలన్నారు.కామారెడ్డి జిల్లాకు సంబంధించిన హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న అన్ని కేసుల్లో నిర్ణీత గడువులోగా కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. విజిలెన్స్ కేసులు, ఇతర పెండింగ్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్లక్ష్యం లేకుండా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ టెలికాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ వి.విక్టర్, సూపరింటెండెంట్ రషీద్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి శ్రీనివాస్, రెవెన్యూ డివిజన్ అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

కాలనీలలో నెలకున్న సమస్యలు పరిష్కరించాలి

అల్వాల్ డీసీని కోరినమాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి



అల్వాల్, నవంబర్ 3: విజన్ ఆంధ్ర: అల్వాల్ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో నెలకున్న సమస్యలను పరిష్కరించాలని మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి కోరారు. మంగళవారం ఆమె, మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు అల్వాల్ డిసి భోగేశ్వరులను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...పలు కాలనీలలో నేటికీ అపరిష్కృతంగా ఉన్న అభివృద్ధి పనులను పరిష్కరించాలని ఆమె, డీసీ భోగేశ్వర్లను కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ నాయకులు యాదగిరి గౌడ్, శరన్ గిరి, సాజిద్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు

అల్వాల్ సఖి సెంటర్ కేంద్రంలో దివ్యాంగులకు వీల్ చైర్స్, ఎల్ బో స్టిక్స్ వాకర్లు పంపిణీ

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి : ఫైజన్ అహ్మద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్



అల్వాల్, నవంబర్ 3, విజన్ ఆంధ్ర: దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ ఫైజన్ అహ్మద్ అన్నారు. సోమవారం అల్వాల్ సఖి సెంటర్ కేంద్రంలో దివ్యాం గులకు వీల్ చైర్స్, ఎల్ బో స్టిక్స్ వాకర్లు పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అధితిగా హాజరై పరికరాలు పంపిణీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీ డబ్ల్యూడీ వారి సహకారంతో ఎల్ బో స్టిక్స్ ,ఎల్ ఐ సి గోల్డెన్ జూబ్లీ ఫౌండేషన్ వారి సహాకారంతో వీల్ చైర్స్ వాకర్స్ దివ్యాంగులకుపంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పీ డబ్ల్యూడీ అధికారి శారద, సీమ, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ఎన్.వినయ్, ఎన్ పి అర్ డి రాష్ట్ర అధ్యక్షులు వెంకట్, శ్రీనివాస్ రెడ్డి, టైగర్ నరసిహ, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు

వ్యవసాయానికి సోలార్ పంపుసెట్లు

అధికారులకు రెడ్‌కో సీఎండీ కీలక ఆదేశాలు

హైదరాబాద్, నవంబర్3: రాష్ట్రంలో సాగుకు సోలార్ పంపుసెట్లను అందించనున్నట్టు రెడ్‌కో సీఎండీ జితేశ్ వీ పాటిల్ వెల్లడించారు. ఇప్పటికే మంజూరైన సోలార్ పంపుసెట్ల బిగింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. టీజీ రెడ్‌కో వీసీ, ఎండీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన ఆ సంస్థ అధికారులు, జిల్లా మేనేజర్లతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పునరుత్పాదక ఇంధన పథకాల అమలును వేగవంతం చేసి గడువులోగా పూర్తిచేయాలని సూచించారు. మాడల్ సోలార్ విలేజ్, రూఫ్‌టాప్ సోలార్, పీఎం కుసుమ్ పథకం, వ్యవసాయ పంపుసెట్ల సోలరైజేషన్, ఎలక్ట్రికల్ వాహన చార్జింగ్ స్టేషన్లపై ఆయన ఆరా తీశారు. గృహజ్యోతి ఇండ్లపై సోలార్ ప్లాంట్లురూఫ్‌టాప్ సోలార్ పథకంలో భాగంగా గృహజ్యోతి పథకం కింద నిర్మించిన ఇండ్లపై విద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటు చేయాలని రెడ్‌కో సీఎండీ జితేశ్ వీ పాటిల్ ఆదేశించారు. ప్లాంట్ల ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఆసక్తి చూపిన వారి ఇండ్లపై ప్లాంట్ల ఇన్‌స్టాలేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. పీఎం కుసుమ్ లక్ష్యాల సాధనకు జిల్లా స్థాయిలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. సమావేశంలో రెడ్‌కో జీఎం సీఎస్‌వీ ప్రసాద్, జిల్లా మేనేజర్లు పాల్గొన్నారు.

హైదరాబాద్ పాతబస్తీలో దారుణ హత్య

కాపాడేందుకు వెళ్లిన వ్యక్తిపై కూడా దాడి

హైదరాబాద్ పాతబస్తీ కాంచన బాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హఫీజ్ బాబా నగర్‌లో తెల్లవారుజామున దారుణ హత్య జరిగింది . సయ్యద్ ఒమర్ అలియాస్ మషల్లా ఒమర్ అనే యువకుడిపై దుండగులు కత్తితో దాడి చేసి హత్య చేశారు. సంఘటన స్థలంలోనే ఒమర్ ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది.సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీం తో ఆధారాలు సేకరిస్తున్నారు.ఒమర్‌ను కాపాడేందుకు ప్రయత్నించిన సయ్యద్ అనే వ్యక్తిపై కూడా దుండగులు దాడి చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.ఈ హత్యను అమన్ ఖురేషి, అలీ భైసా అనే వ్యక్తులు చేసారని ఘటనాస్థలంలో ఉన్న కొందరు స్థానికులు తెలిపారు. మృతుడు ఒమర్ నేర చరిత్ర కలిగిన వ్యక్తి మద్యం, గంజాయి మత్తులో ఓ గ్యాంగ్ ని ఏర్పాటు చేసుకొని స్థానికులను బెదిరించడం, దాడులు చేయడం, డబ్బులు వసూలు చేయడం వంటి ఆరోపణలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. హత్యకు దారితీసిన పరిస్థితులు, నిందితుల వివరాలపై పోలీసుల సిసి కెమెరాల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు.

యాసంగి సాగులో వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలి


– నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని రైతులకు అవగాహన కల్పించాలి – జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కామారెడ్డి బ్యూరో నవంబర్ 3(విజన్ఆంధ్ర)రాబోయే యాసంగి (రబీ) సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గడం, భూగర్భ జలాల మట్టం పడిపోవడాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశం మందిరంలో వ్యవసాయ, నీటిపారుదల, ఉద్యానవన తదితర సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో యాసంగి పంటల ప్రణాళిక, నీటి లభ్యత, ప్రత్యామ్నాయ పంటల సాగుపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నీటి వనరులు పరిమితంగా ఉన్నందున అధిక నీరు అవసరమయ్యే వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో అధిక దిగుబడి, ఆదాయం పొందగలిగే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. పెసర, మినుములు, కందులు వంటి పప్పుధాన్యాలు, సూర్యకాంతి, వేరుశనగ, నువ్వులు వంటి నూనెగింజలు, జొన్న, సజ్జ, మొక్కజొన్న వంటి చిరుధాన్యాలు, కూరగాయల సాగును ప్రోత్సహించాలని తెలిపారు.గ్రామ, మండల స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి పంట మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలన్నారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, పంచాయతీ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయిలో రైతులకు సరైన మార్గదర్శనం చేయాలని ఆదేశించారు. ప్రతి అధికారి రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.ఆయిల్‌పామ్, కూరగాయల వంటి ఉద్యానవన పంటల సాగుతో తక్కువ నీటిని వినియోగిస్తూ మెరుగైన ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. రైతులకు బిందు సేద్య పరికరాలు, విత్తనాలపై ప్రభుత్వం అమలు చేస్తున్న సబ్సిడీలను అర్హత, నిబంధనల ప్రకారం అందేలా చూడాలని ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు.సాగుభూమి సంరక్షణకు సంబంధించి అమలు చేస్తున్న 'భూమి బచావో అభియాన్'తో పాటు ఇతర ప్రభుత్వ పథకాలు, రాయితీల వివరాలను ప్రతి రైతుకు చేరవేయాలన్నారు. పశువులకు పశుగ్రాసం కొరత ఏర్పడకుండా పశుగ్రాస పంటల సాగును కూడా ప్రోత్సహించాలని సూచించారు.రైతు బీమా పరిహారం పొందడంలో రైతు కుటుంబాలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా తహసీల్దార్లు మరణ ధ్రువీకరణ పత్రాలు, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలను ఎలాంటి జాప్యం లేకుండా మంజూరు చేయాలని ఆదేశించారు.నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు ముందస్తు ప్రణాళికతో పంటల ఎంపిక చేసుకోవాలని, నీటి అవసరం తక్కువగా ఉండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి ఆర్థికంగా నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రైతులకు విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ విక్టర్, వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి, ఉద్యాన శాఖ అధికారిని జ్యోతి, గిరిజన శాఖ అధికారి సౌజన్య, డి ఆర్ డి ఓ దామోదర్ రెడ్డి, ఆర్డీఓలు, తహసీల్దార్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఏడీఏలు, అధికారులు, అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

జాతీయ ఐక్యతా దినోత్సవ వేడుకల్లో పాల్గొనడం -జిల్లాకు గర్వకారణం

– దేశ ఐక్యత, సమగ్రతపై అవగాహన పెంపొందించే కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యం అభినందనీయం – జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కామారెడ్డి బ్యూరో నవంబర్ 3(విజన్ఆంధ్ర)గుజరాత్ రాష్ట్రంలోని ఏక్తా నగర్‌లో జాతీయ ఐక్యతా దినోత్సవం (రాష్ట్రీయ ఏక్తా దివస్) సందర్భంగా నిర్వహించిన సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి వేడుకలు, ఏక్తా దివస్ పరేడ్‌లో కామారెడ్డి జిల్లా నుంచి వెళ్లిన 19 మంది సభ్యుల బృందం పాల్గొని తిరిగి వచ్చిందిఈ సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను బృంద సభ్యులు కలిసి, తమకు ఈ అరుదైన అవకాశం కల్పించినందుకు జిల్లా యంత్రాంగానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, జాతీయ ఐక్యత, దేశభక్తి, సమైక్యతా భావాలను పెంపొందించే ఇటువంటి కార్యక్రమాల్లో జిల్లా నుంచి ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు, రైతులు పాల్గొనడం అభినందనీయమని తెలిపారు. గుజరాత్‌లో నిర్వహించిన ఏక్తా దివస్ పరేడ్‌ను ప్రత్యక్షంగా వీక్షించి, అందులో భాగస్వాములు కావడం ద్వారా దేశ ఐక్యత, సమగ్రత, సాంస్కృతిక వైవిధ్యంపై మరింత అవగాహన పెంపొందించుకునే అవకాశం లభించిందన్నారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ దేశ సమైక్యత కోసం చేసిన కృషి, ఆయన ఆశయాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఇలాంటి జాతీయ స్థాయి కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని బృంద సభ్యులకు సూచించారు.జిల్లా నుంచి మొత్తం 19 మంది సభ్యులతో కూడిన బృందం గుజరాత్ పర్యటనకు వెళ్లిందని, ఈ బృందానికి నోడల్ అధికారిగా రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎన్. కృష్ణ గౌడ్ వ్యవహరించారని తెలిపారు.ఈ సందర్భంగా బృంద సభ్యులు మాట్లాడుతూ, గుజరాత్‌లో ఏక్తా దివస్ పరేడ్‌ను ఘనంగా నిర్వహించడం, అందులో పాల్గొనే అవకాశం లభించడం తమకు ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. ఈ అవకాశం కల్పించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా పోలీసు అధికారి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా యంత్రాంగం అందించిన ప్రోత్సాహం, సహకారం మరువలేనివని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బృంద సభ్యులు నరేందర్ రెడ్డి, రాజిరెడ్డి, ఎన్. సంతోష్, ఏక నితిన్ గౌడ్, రోహిత్, ప్రభాస్, సాధన, రజిత, బి. సూరజ్, లక్ష్మి, దీప, రాధ, సుబ్బారావు, నరేందర్, లింగారెడ్డి, రాంగోపాల్ రెడ్డి, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ ను సద్వినియోగం చేసుకోవాలి: వినోద్ యాదవ్



మల్కాజిగిరి, నవంబర్ 3 ,విజన్ ఆంధ్ర సీఎంఆర్ఎఫ్ ను పేదలు సద్వినియోగం చేసుకోవా లని కాంగ్రెస్ పార్టీ మౌలాలి డివిజన్ అధ్యక్షుడు పోతుల వినోద్ యాదవ్ అన్నారు. మౌలాలి ఆర్టీసీ కాలనీకి చెందిన ఉస్మాన్ అలీ క్యాన్సర్ తో బాధపడుతున్నాడు. ఆయనకు మంజూరైన ఎల్ ఓసీ పత్రాన్ని ఆయన మంగళవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో మౌలాలి డివిజన్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకన్న, జనరల్ సెక్రెటరీ సలీం సీనియర్ నాయ కుడు ఫారూఖ్, జిల్లా కార్యదర్శి మంద భాస్కర్, జిల్లా జాయింట్ సెక్రటరీ ప్రేమ్ కుమార్, చంద్రకాంత్, మల్కా జిగిరి యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజయ్, మౌలాలి డివిజన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు షకీల్, పాండురంగాచారి, వెంకటేష్ ,బాబా, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

సివిల్ సప్లయ్ అధికారుల అవినీతిపై విచారణ జరపాలి

డీఎస్ఓ, డీఎంల అక్రమాస్తులు జప్తు చేయాలి మిల్లర్ల అక్రమాల్లో అధికారుల పాత్రపై ఆరా తీయాలి బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్



వనపర్తి జిల్లా ప్రతినిధి, నవంబర్ 3 (విజన్ ఆంధ్ర) సివిల్ సప్లయ్ శాఖలో పనిచేస్తున్న జిల్లా స్థాయి అధికారులు (డీఎస్ఓ), జిల్లా మేనేజర్ల (డీఎం) అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఉమ్మడి పాలమూరు జిల్లాలో సివిల్ సప్లయ్ శాఖ అధికారుల వ్యవహారాలపై ఏసీబీ, సీఐడీ అధికారులు విస్తృత స్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు. వేల కోట్ల రూపాయల అవినీతి జరుగుతోందన్న ఆరోపణలకు అధికారులే కారణమా? అన్న కోణంలో దర్యాప్తు జరగాలన్నారు. అక్రమాలకు పాల్పడినట్లు తేలిన అధికారుల ఆస్తులను గుర్తించి జప్తు చేయాలని డిమాండ్ చేశారు.మహబూబ్‌నగర్ జిల్లాలో సుమారు రూ.9.5 కోట్ల విలువైన ధాన్యాన్ని దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ రైస్ మిల్లుకు సంబంధించి ఆస్తుల బదిలీ కోసం రూ.కోటి లంచం తీసుకుని ఎన్‌వోసీ ఇచ్చారనే ఆరోపణలపై జిల్లా మేనేజర్‌పై తక్షణమే విచారణ జరిపించాలని కోరారు.వనపర్తి జిల్లాలో ఇటీవల అనుమతులు లేవనే కారణంతో రెండు రైస్ మిల్లులను కూల్చివేశారని, అలాంటప్పుడు వాటికి ధాన్యం కేటాయింపులు ఎలా జరిగాయి? మిల్లింగ్ అనుమతులు ఎవరిచ్చారు? అనే అంశాలపై అధికారులు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. మరోవైపు జిల్లాలోని ఓ మిల్లులో డీఎస్ఓ తనిఖీ చేసి క్లీన్‌చిట్ ఇచ్చిన రెండు రోజులకే విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేయగా 14 వేల ధాన్యం బస్తాల తేడా గుర్తించారని ఆరోపించారు.ఉమ్మడి పాలమూరు జిల్లాలో పలువురు డీఎంలు, డీఎస్ఓలు తక్కువ సమయంలోనే కోట్లాది రూపాయల ఆస్తులు కూడబెట్టినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఒక్కో సీజన్‌లో కొందరు అధికారులు రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు అక్రమంగా సంపాదిస్తున్నారనే ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరగాలన్నారు. సంబంధిత అధికారుల అవినీతి వివరాలను త్వరలో ఏసీబీ, సీఐడీకి అందజేస్తామని తెలిపారు.ధాన్యం సేకరణ, గన్నీ బ్యాగుల సరఫరా, ట్రక్‌షీట్లు, ధాన్యం నిల్వలు, టెండర్లు, రవాణా బిల్లులు, బ్యాంకు చెల్లింపులు, స్టాక్ ధ్రువీకరణ పత్రాలు, కాంట్రాక్టులు, ఔట్‌సోర్సింగ్ నియామకాల వరకు పలు వ్యవహారాల్లో అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. మిల్లర్లపై తనిఖీలు చేస్తున్న తరహాలోనే అధికారులపైనా విచారణ చేపట్టి, వారి ఆస్తులు, బినామీ వ్యవహారాలను వెలుగులోకి తీసుకురావాలని అన్నారు. ఈ సమావేశంలో బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులు వివి గౌడ్, కరెంట్ నరసింహ, దేవర శివ, బత్తుల జితేందర్, కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు రైతులకు అన్యాయం చేసింది గత ప్రభుత్వమే

తొమ్మిదేళ్లు ఏం చేశారో బీఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పాలి రైతులపై మొసలి కన్నీరు కారుస్తున్నారు విలేకరుల సమావేశంలో మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే మేఘారెడ్డి



వనపర్తి జిల్లా ప్రతినిధి, నవంబరు 3 (విజన్ ఆంధ్ర)పాలమూరు సాగునీటి ప్రాజెక్టులను ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెట్టి రైతాంగానికి అన్యాయం చేసిన గత పాలకులు ఇప్పుడు అదే ప్రాజెక్టుల పేరుతో రాజకీయ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి విమర్శించారు. తొమ్మిదేళ్ల పాలనలో ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేకపోయారో బీఆర్ఎస్ నాయకులు ముందుగా రైతులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.మంగళవారం వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పాలమూరు ' రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, కల్వకుర్తి, జూరాల తదితర సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిందని ఆరోపించారు. జూరాల నీటి నిల్వ సామర్థ్యం, రామన్‌పాడు సమాంతర కాలువ నిర్మాణంలోని సాంకేతిక లోపాలు, గూడెం దొడ్డి రిజర్వాయర్ నిర్మాణం వంటి సమస్యలను అధికారంలో ఉన్నప్పుడే పరిష్కరించి ఉంటే రైతులకు ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు.పాలమూరు ' రంగారెడ్డి ప్రాజెక్టు 90 శాతం పూర్తయిందని మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ.. ప్రాజెక్టు అంచనా వ్యయం, ఇప్పటివరకు చేసిన ఖర్చు, మిగిలిన పనుల వివరాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. కృష్ణా జలాల వినియోగం, ఆంధ్రప్రదేశ్‌కు నీటి తరలింపు విషయంలో గత ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సాగునీటి సరఫరాకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.రైతుల గురించి మాట్లాడే హక్కు లేదుఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల పాలనలో రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేని బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు రైతుల గురించి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్ని ప్రాజెక్టులు నిర్మించారు? ఎన్ని పూర్తిచేశారు? పాలమూరు రైతాంగానికి ఎంత సాగునీరు అందించారో వెల్లడించాలని సవాల్ విసిరారు.రాష్ట్రంలో 365 కరువు మండలాలను ప్రకటించిన నేపథ్యంలో రైతుల సమస్యలపై ముఖ్యమంత్రి నేతృత్వంలో జరిగిన కేబినెట్ సమీక్షలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులకు సత్వర ఉపశమనం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.నిరంజన్‌రెడ్డిపై విమర్శలుమాజీ మంత్రి నిరంజన్‌రెడ్డిపై ఎమ్మెల్యే మేఘారెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. ఆయనను 'నీళ్ల దొంగ నిరంజన్‌రెడ్డి'గా అభివర్ణించారు. ఆయనకు సంబంధించిన ఫామ్‌హౌస్‌లలో అక్రమంగా బోర్లు వేయించి, రైతులకు అందాల్సిన సాగునీటిని తన ఫామ్‌హౌస్‌ల వైపు మళ్లించుకున్నారని ఆరోపించారు. గతంలో 'వరి వేస్తే ఉరే' అంటూ రైతులను భయపెట్టిన నాయకులు ఇప్పుడు రైతుల సంక్షేమం గురించి మాట్లాడటం విడ్డూరమన్నారు.నిరుద్యోగుల సమస్యలపై గతంలో బాధ్యతారహితంగా మాట్లాడిన నాయకులు ఇప్పుడు వారి పక్షాన మాట్లాడటం రాజకీయ అవకాశవాదానికి నిదర్శనమని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో నిరంజన్‌రెడ్డికి బీఫామ్ కూడా దక్కదని వ్యాఖ్యానించారు.గత పాలకులు చేసిన తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు రైతుల కష్టాలను రాజకీయ అస్త్రాలుగా మార్చుకోవద్దన్నారు. గత తొమ్మిదేళ్ల పాలనలో సాగునీటి రంగంలో సాధించిన ప్రగతిపై బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. అల్వాల వేదికగా హరీశ్‌రావు చేసిన విమర్శలకు సమాధానంగానే ఈ వివరాలను వెల్లడిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో వనపర్తి మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాధవి రమేష్, పెబ్బేరు మున్సిపల్ ఛైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, పట్టణ అధ్యక్షుడు కదిరే రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మంచారి, వైస్ ఛైర్మన్ మధుసూదన్‌గౌడ్, పెబ్బేరు మున్సిపల్ వైస్ ఛైర్మన్ సుమిత్ర, ఎల్లారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ డీసీసీ అధ్యక్షుడు శంకర్‌ప్రసాద్, మాజీ ఎంపీపీ శంకర్‌నాయక్, పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మళ్లీ తెరపైకి రాజీనామాతో రాజ్ గోపాల్ రెడ్డి

నల్గొండ, నవంబర్ 3, మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి రేవంత్ ప్రభుత్వంపై తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. తన నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం రూపాయి నిధులు ఇవ్వడం లేదని, చేసిన పనులకు బిల్లులు చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపిస్తూ.. నియోజకవర్గ ప్రయోజనాల కోసం అవసరమైతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు కూడా సిద్ధమంటూ బహిరంగంగా ప్రకటన చేశారు. మునుగోడులో కనీసం రోడ్డు వేసుకోవడానికి కూడా సీఎం రేవంత్ రెడ్డి నిధులు ఇవ్వడం లేదు.. నేను ఎవరికీ భయపడను, ఎవరితోనూ రాజీపడను అంటూ ఆయన నేరుగా ముఖ్యమంత్రిపైనే తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.పైకి నియోజకవర్గ నిధులు, అభివృద్ధి పనుల కొరతను కారణంగా చూపుతున్నప్పటికీ.. రాజగోపాల్ రెడ్డి అసహనం వెనుక సుదీర్ఘకాలంగా రగులుతున్న అసంతృప్తి జ్వాలలు ఉన్నాయని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచీ తనకు మంత్రి పదవి దక్కుతుందని ఆశపడుతూ వచ్చారు. ఆ అవకాశాలు కనిపించడం లేదు. ఈ అసంతృప్తికి తోడు, ఇటీవల డియల్ రోడ్డు ప్రాజెక్టు కాంట్రాక్ట్ వివాదం రాజగోపాల్ రెడ్డికి మరింత తలనొప్పిగా మారింది. తన సొంత వ్యాపార, నిర్మాణ ప్రయోజనాలకు సంబంధించిన పనుల్లోనూ ప్రభుత్వం నుంచి ఆశించిన సహకారం అందకపోవడం, రాజకీయంగా తనను ఉద్దేశపూర్వకంగా అణగదొక్కుతున్నారనే భావన ఆయనను ఆందోళనకు గురిచేసింది.ఓ వైపు సొంత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ రాజకీయ ప్రాధాన్యత దక్కకపోవడం, మరోవైపు వ్యాపార కాంట్రాక్టుల విషయంలోనూ నిరాశే ఎదురుకావడంతో ఆయన నిప్పుల మీద నడుస్తున్నంతగా ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని ఆయన సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి.

జవహర్ నవోదయ క్యాంపస్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

- క్షేత్రస్థాయిలో పనుల ప్రగతిని పరిశీలించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి
- అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశం



నిజామాబాద్, నవంబర్ 03 :(విజన్ ఆంధ్ర) జక్రాన్పల్లి మండలం కలిగోట్ లో నూతనంగా నెలకొల్పుతున్న జవహర్ నవోదయ విద్యాలయ కొత్త క్యాంపస్ భవన నిర్మాణ ప్రదేశాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం క్షేత్రస్థాయిలో సందర్శించారు. జే.వీ.ఎన్ నిర్వహణకు అనువైన పరిస్థితులు, అందుబాటులో ఉన్న వసతులను నిశితంగా పరిశీలించారు. ఇప్పటివరకు చేపట్టిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనులను నాణ్యతతో వేగంగా జరిపించాలని, విద్యార్థులకు అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పనులు చేపట్టే సందర్భంగా ఏవైనా ఆటంకాలు ఎదురవుతున్నాయా అని ఆరా తీశారు. అటవీ శాఖతో పాటు ఇతర అన్ని రకాల అనుమతులు తీసుకున్నామని, ఎలాంటి సమస్యలు లేవని సంబంధిత అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల ప్రయోజనార్థం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ విద్యా సంస్థను ఏర్పాటు చేస్తోందని, దీనిని దృష్టిలో పెట్టుకుని నిర్దేశిత గడువు లోపు పనులు పూర్తయ్యేలా చొరవ చూపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. తరగతి గదులు, డార్మెటరీ, డైనింగ్ హాల్, లైబ్రరీ, బాలబాలికలకు వేర్వేరుగా హాస్టల్ భవనాలు, స్టాఫ్ క్వార్టర్స్ కోసం నిర్మించనున్న భవన సదుపాయాల బ్లూప్రింట్ ను పరిశీలించారు. విద్యార్థులతో పాటు అధ్యాపకులు, సిబ్బందికి తగిన వసతి, బోధనా తరగతుల నిర్వహణ వంటి వాటికి ఇబ్బందులు లేకుండా అవసరమైన సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులకు అవసరమైన ఇసుక, మొరం నిల్వలకు నిబంధనల మేరకు వెంటదివెంట అనుమతులు మంజూరు చేయాలని స్థానిక రెవెన్యూ అధికారులకు సూచించారు. మిషన్ భగీరథ నీటి వసతి, రోడ్డు, విద్యుత్ వంటి అన్ని వసతులు సకాలంలో అందుబాటులోకి రావాలని, విద్యార్థులు భద్రతకు ప్రాధాన్యత ఉండేలా ప్రహరీ నిర్మాణం చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. కనీసం రెండుమూడు వారాలకు ఒక పర్యాయం అయినా క్షేత్రస్థాయి సందర్శన జరుపుతూ, నిర్మాణ పనుల ప్రగతి గురించి తనకు నివేదించాలని ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియకు సూచించారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

ముధోల్ ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పిస్తాం

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ జిల్లా,నవంబర్ 03,(విజన్ ఆంధ్ర); ముధోల్ ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో (సీహెచ్‌సీ) వైద్య సేవలను మరింత మెరుగుపరిచి, రోగులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. మంగళవారం ఆయన ముధోల్ ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, ఆసుపత్రిలోని వివిధ విభాగాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది సంఖ్య, ప్రతిరోజూ చికిత్స కోసం వస్తున్న రోగుల వివరాలు, వారికి అందిస్తున్న వైద్య సేవల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రక్త పరీక్షల గది, మందుల పంపిణీ కేంద్రం తదితర విభాగాలను పరిశీలించి, ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్యం అందించాలని వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన వైద్య సేవలు, మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆసుపత్రి భవనం పాతదైనందున అవసరమైన మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఆసుపత్రిలో మార్చురీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని, నూతన ఆసుపత్రి భవన నిర్మాణానికి సంబంధించి ఉన్నతాధికారులతో సంప్రదించి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. ఈ తనిఖీలో డీసీహెచ్ఎస్ కాశీనాథ్, తహసీల్దార్ శ్రీలత, సర్పంచ్ షబానా బేగం, ఇతర అధికారులు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో చదివే ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ ఉంచాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.



నిర్మల్ జిల్లా,నవంబర్ 03,(విజన్ ఆంధ్ర); ప్రభుత్వ బడుల్లో చదివే ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు నిరంతరం ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ముధోల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణను పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన భవంతిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. దాని స్థానంలో నూతన అదనపు తరగతుల నిర్మాణానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. పాఠశాలకు సంబంధించి విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఐదవ తరగతి విద్యార్థులతో కలెక్టర్ నేరుగా మాట్లాడారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలన్నారు. వారి స్నేహితులెవరైనా బడికి రానట్లయితే, వారిని కూడా తీసుకొని రావాలన్నారు. వారితో లెక్కలు సులభంగా అర్థమయ్యేలా మెలకువలను నేర్పి, కొన్ని లెక్కలు చేయించారు. ఇంగ్లీష్ పదాలను వ్యతిరేక క్రమంలో చదివిపించారు. విద్యార్థుల ప్రతిభను కలెక్టర్ మెచ్చుకున్నారు. పలువురు విద్యార్థులకు పెన్నులను బహుమతులుగా ఇచ్చారు. వారిని అభినందించారు. ఉపాధ్యాయుల బోధన, విద్యార్థుల ప్రతిభపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని పేర్కొన్నారు. ఈ తనిఖీలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, తహసిల్దార్ శ్రీలత, ఎంపిడివో లవకుమార్, డిఎల్పిఓ లక్ష్మణ్, సర్పంచ్ షబానా బేగం, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వే, భూ భారతి పెండింగ్ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

- రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ లోకేష్ కుమార్



మంచిర్యాల (ప్రతినిధి) నవంబర్ 3 విజన్ ఆంధ్ర : భూముల రీ సర్వే, భూభారతి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ లోకేష్ కుమార్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ లోని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు (రెవెన్యూ), కలెక్టరేట్ పరిపాలన అధికారులతో విజిలెన్స్ కేసుల పురోగతి, భూదాన్ భూములు, భూముల రీ-సర్వే పురోగతి, హైకోర్టు కేసులు, భూ భారతి పథకంలో పాత, కొత్త పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, భూసేకరణకు సంబంధించిన అంశాలు, యూ ఎల్ సి భూములు, జీఓ నం.59, 76, 118 కింద పెండింగ్‌లో ఉన్న భూముల క్రమబద్ధీకరణ దరఖాస్తుల పురోగతి అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ మాట్లాడుతూ భూదాన్ భూములకు సంబంధించిన నివేదిక, భూముల రీసర్వే ప్రక్రియ పురోగతి, న్యాయస్థానాలలో పెండింగ్‌లో ఉన్న భూ సంబంధిత కేసులు, భూసేకరణ అంశాలపై జిల్లాల వారీగా సమీక్షించారు. యు ఎల్ సి భూములు, జి.ఓ. 59, 76, 118 క్రింద పెండింగ్‌లో ఉన్న క్రమబద్ధీకరణ దరఖాస్తుల స్థితిగతులను సమీక్షించి సంబంధిత దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని తెలిపారు. భూ భారతి కార్యక్రమంలో భాగంగా పాత, కొత్త పెండింగ్ దరఖాస్తులకు సంబంధించి క్షేత్రస్థాయిలో విచారణ చేసి, రికార్డులను అనుసరించి వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. విజిలెన్స్, ఇంటెలిజెన్స్ విభాగాలకు సంబంధించిన కేసుల పురోగతి వేగవంతం చేయాలని, భూ పరిపాలనకు సంబంధించిన పెండింగ్ అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, రికార్డులను సక్రమంగా నిర్వహించి, నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాలలో రీ సర్వే పనులు సమర్థవంతంగా కొనసాగుతున్నాయని, భూభారతి పెండింగ్ దరఖాస్తులు నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులోగా అధికారుల సమన్వయంతో పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. జి.ఓ. 59, 76, 118 క్రింద ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణను వేగవంతం చేసి గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మోతిరాం, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎ.డి. శ్రీనివాస్, కలెక్టరేట్ పరిపాలనాధికారి శ్రీనివాసరావు దేశ్‌పాండే, బి, డి సెక్షన్ల సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కల్లాల వద్దే ధాన్యం కొనుగోళ్లు.. అన్నదాతకు లాభాలు..!



నిజామాబాద్ నవంబర్03:(విజన్ ఆంధ్ర) : వరిసాగు చేసిన రైతులకు ఈసారి ధర కలిసివస్తోంది. గతంలో ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితులు ఉండేవి. ప్రస్తుతం మిల్లర్లు, స్థానిక వ్యాపారులతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న కొనుగోలుదారులు ధాన్యం సేకరణకు పోటీపడుతుండటంతో రైతులకు మెరుగైన ధర లభిస్తోంది. క్వింటాలుకు రూ.3,300 నుంచి రూ.3,400 వరకు చెల్లిస్తున్నారు. కొన్ని రకాల ధాన్యానికి నాణ్యత, డిమాండ్‌ను బట్టి మరింత ధర పలుకుతోంది.

4.35 లక్షల ఎకరాల్లో సాగు

నిజామాబాద్ జిల్లాలో ఈ వానాకాలం సుమారు 4.35 లక్షల ఎకరాల్లో వరి సాగైనట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. సుమారు 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని భావిస్తున్నారు. ఇందులో 6.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం 736 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇంత భారీ విస్తీర్ణంలో సాగైన ధాన్యానికి మార్కెట్లోనూ డిమాండ్ ఉండటంతో కొనుగోలుదారులు రైతుల వద్దకు వస్తున్నారు. ముఖ్యంగా పచ్చి ధాన్యాన్నే కల్లాల వద్దకు వచ్చి కొనుగోలు చేస్తుండటంతో అన్నదాతకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతోంది.

పోటీతో పెరిగిన ధరలు

గతంలో సాధారణ ధాన్యానికి క్వింటాలుకు రూ.2,300 మద్దతు ధర లభించేది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో కొనుగోలుదారుల మధ్య పోటీ నెలకొనడంతో పచ్చి ధాన్యానికే రూ.3,300 నుంచి రూ.3,400 వరకు ధర పలుకుతోంది. ముఖ్యంగా బీపీటీ వంటి సన్న రకాలపై వ్యాపారులు ఆసక్తి చూపుతున్నారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోళ్లు సాగిస్తున్నారు. దీంతో రైతులకు తమ పంటను విక్రయించేందుకు ప్రత్యామ్నాయ అవకాశాలు పెరిగాయి.

మిల్లర్లకూ ధాన్యం అవసరం

ప్రభుత్వానికి గతంలో కేటాయించిన ధాన్యం నిల్వలు, కస్టమ్ మిల్లింగ్ బియ్యం సరఫరా బాధ్యతల నేపథ్యంలో మిల్లర్లకు ధాన్యం సేకరణ అవసరం ఏర్పడింది. ఈ క్రమంలో కొందరు మిల్లర్లు రైతుల వద్ద నుంచి నేరుగా ధాన్యం కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. మరోవైపు ఇతర రాష్ట్రాల వ్యాపారుల రాకతో మార్కెట్లో పోటీ పెరిగింది. ఈ పరిణామం రైతులకు అనుకూలంగా మారుతోంది.

కల్లాల వద్దే కొనుగోళ్లు..

గతంలో ధాన్యాన్ని ఆరబెట్టి, తూకం వేయించి కొనుగోలు కేంద్రాలకు తరలించే క్రమంలో రైతులు రవాణా, హమాలీ తదితర ఖర్చులు భరించాల్సి వచ్చేది. ప్రస్తుతం పలుచోట్ల వ్యాపారులే నేరుగా రైతుల కల్లాల వద్దకు వచ్చి పచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. తేమశాతం, ధాన్యం రకం, నాణ్యత ఆధారంగా ధర నిర్ణయిస్తున్నారు. దీంతో రైతులకు సమయం, శ్రమతోపాటు అదనపు ఖర్చులు కూడా తగ్గుతున్నాయి.

అన్నదాతకు అదనపు ఆదాయం

ఒకవైపు సాగు ఖర్చులు పెరుగుతున్న తరుణంలో మరోవైపు పంటకు మెరుగైన ధర లభించడం రైతులకు ఊరటనిస్తోంది. ప్రభుత్వ మద్దతు ధరతో పోలిస్తే బహిరంగ మార్కెట్లో ఎక్కువ ధర లభించే పరిస్థితి ఏర్పడింది. కొనుగోలుదారుల మధ్య పోటీ కొనసాగితే రైతులకు మరింత ప్రయోజనం చేకూరే అవకాశముంది. మొత్తంగా ఈసారి ధాన్యం కొనుగోళ్లలో నెలకొన్న పోటీ అన్నదాతకు ఆర్థికంగా కలిసివస్తోంది.

మాధవ్ నగర్ ఆర్ఓబీకి రూ.101.80 కోట్లతో సవరించిన పరిపాలనా అనుమతి

- రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న అదనపు నిధుల మంజూరుకు నిరంతర పోరాటం ఫలించింది: ఎంపీ ధర్మపురి అర్వింద్
- సహకరించిన మంత్రులు భట్టి, కోమటిరెడ్డి లకు ధన్యవాదాలు తెలిపిన ఎంపీ అర్వింద్



నిజామాబాద్ నవంబర్03:(విజన్ ఆంధ్ర) : నిజామాబాద్ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న మాధవ్ నగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) నిర్మాణానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డిచ్‌పల్లినిజామాబాద్ రైల్వే స్టేషన్ల మధ్య లెవెల్ క్రాసింగ్ నంబర్ 193 వద్ద నాలుగు వరుసల ఆర్ఓబీ నిర్మాణానికి రూ.101.80 కోట్లతో సవరించిన పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ నవంబర్ 2, 2026న +.ా.ౣ.చీశీ.568 జారీ చేసింది. గతంలో రూ.93.12 కోట్లుగా ఉన్న ప్రాజెక్టు వ్యయాన్ని రూ.101.80 కోట్లకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం ద్వారా అదనపు నిధుల అనుమతులకు మార్గం సుగమమైంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి గత రెండేళ్లుగా అదనపు నిధుల మంజూరు, సవరించిన అంచనాలకు సంబంధించిన పరిపాలనా అనుమతులు పెండింగ్‌లో ఉండటంతో నిర్మాణ పనులు ఆశించిన వేగంతో ముందుకు సాగలేదు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఎంపీ ధర్మపురి అర్వింద్ పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వానికి, సంబంధిత మంత్రులకు విజ్ఞప్తులు చేశారు. గతంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కూడా కలిసి అదనపు నిధుల అవసరాన్ని వివరించారు. వెంటనే స్పందించిన కోమటిరెడ్డి ఫైల్ ని క్లియర్ చేసి ఆర్థిక శాఖకి పంపారు. ఆర్థిక శాఖలో రెండేళ్లుగా ఫైల్ క్లియర్ కాకపోవడంతో ప్రజల ఇబ్బందులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు అక్టోబర్ 27న మాధవ్ నగర్ ఆర్ఓబీ వద్ద ఎంపీ అర్వింద్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్ఓబీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలంటూ ఎంపీ స్వయంగా భిక్షాటన కార్యక్రమం చేపట్టి ప్రజలు, నాయకులు, వాహనదారుల నుంచి విరాళాలు సేకరించారు. ప్రజల సమస్య పరిష్కారం కోసం ప్రజాప్రతినిధిగా తాను ఎంతవరకైనా వెళ్లడానికి సిద్ధమనే సందేశాన్ని ఈ వినూత్న నిరసన ద్వారా తెలియజేశారు. అనంతరం అక్టోబర్ 29న హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి మాధవ్ నగర్ ఆర్ఓబీకి సంబంధించిన రూ.8.68 కోట్ల అదనపు నిధులకు ఆర్థిక, పరిపాలనా అనుమతులు మంజూరు చేయాలని ఎంపీ అర్వింద్ విజ్ఞప్తి చేశారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరినట్లు ఎంపీ తెలిపారు. అక్టోబర్ 31న నిజామాబాద్ కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో కూడా మాధవ్ నగర్, అర్సపల్లి ఆర్ఓబీ నిర్మాణాల పురోగతిని ఎంపీ సమీక్షించారు. పనుల్లో జరుగుతున్న జాప్యంపై అధికారులను ప్రశ్నిస్తూ, నిర్దేశిత మైలురాళ్ల ప్రకారం పనులు వేగవంతం చేసి రానున్న నాలుగైదు నెలల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ వరుస ప్రయత్నాలు, రాష్ట్ర ప్రభుత్వంతో జరిపిన చర్చలు, ప్రజా నిరసనల నేపథ్యంలో నవంబర్ 2న ప్రభుత్వం సవరించిన పరిపాలనా అనుమతులు జారీ చేయడం సంతోషకరమైన పరిణామమని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు. దీనికి సహకరించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారికి, ఆర్ అండ్ బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారికి ఎంపీ అర్వింద్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతర కృషి

మాధవ్ నగర్ ఆర్ఓబీ పూర్తయితే నిజామాబాద్ నగరంతో పాటు డిచ్‌పల్లి, చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు గణనీయంగా తగ్గుతాయని, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, అత్యవసర వైద్య సేవల కోసం ప్రయాణించే వారికి ఎంతో ఉపశమనం కలుగుతుందని ఎంపీ తెలిపారు. ప్రభుత్వం సవరించిన అనుమతులు మంజూరు చేసిన నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు ఇకపై ఎలాంటి జాప్యం లేకుండా పనులను వేగవంతం చేయాలని, నిర్ణీత గడువులోగా ఆర్ఓబీ నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ కోరారు.

ఇళ్ళ స్థలాల సాధనకై జేఎన్జే సొసైటీ సభ్యుల ధర్నా

- పేట్ బషీరాబాద్, నిజాంపేట్ స్థలాలే ఇవ్వాలని డిమాండ్
- జర్నలిస్టుల ఇళ్ళస్థలాల పై జాప్యం తగదు
- ప్రత్యేక జీవో ద్వారా స్థలాలు కేటాయించాలి
- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య డిమాండ్




హైదరాబాద్, నవంబర్ 03 (విజన్ ఆంధ్ర): ఇళ్ళస్థలాల కోసం పద్దెనిమిదేళ్ళుగా ఎదురు చూస్తున్న జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ సభ్యులు తమకు ఇకనైనా ప్రభుత్వం ఇళ్ళస్థలాలిచ్చి న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం ఇందిరాపార్కు వద్ద ధర్నా చేశారు. జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ(టీమ్ జేఎన్ జే) ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో సొసైటీ సభ్యులతో పాటు పలువురు జర్నలిస్టు సంఘాల నాయకులు, సీనియర్ పాత్రికేయులు పాల్గొన్నారు. ఈ ధర్నాలో పలువురు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నాయకులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం జాప్యం చేయడం సరైంది కాదని అన్నారు. 18 ఏళ్ళ క్రితం జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీకి పేట్ బషీరాబాద్, నిజాంపేట్ లలో కేటాయించి స్థలాలను ఆ సొసైటీ సభ్యులకు ఇవ్వకుండా ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం అన్యాయమని ధ్వజమెత్తారు.జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ స్థలాలు కేటాయించేలా ప్రత్యేక జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా, జర్నలిస్టులకిచ్చిన ఇళ్ల స్థలాల హామీని అమలు చేయకపోవడం బాధాకరమని అన్నారు. 18 ఏళ్ల క్రితం ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు చెల్లించి ఇళ్ల స్థలాల కోసం ఇంతకాలం ఎదురుచూస్తున్న జేఎన్‌జే హౌసింగ్ సొసైటీ సభ్యులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో నిజాం పేటలో సర్వే నంబర్ 332లో 32 ఎకరాలు, పేట్ బషీరాబాద్ సర్వే నెంబర్ 25/2 లో 38 ఎకరాల భూమి కేటాయించారని, ఈ భూమిని ఇప్పుడు ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం జర్నలిస్టుల ఆశలపై నీళ్లు చల్లడమేనని అన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చిందని, అంతేకాకుండా అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పలుమార్లు హామీలిచ్చారని వారు గుర్తుచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు (జీవో) జారీ చేసి జేఎన్ జే సొసైటీ సభ్యులకు, అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. సొసైటీ సభ్యులు రమణారావు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో పాల్గొన్న సభ్యులు తమకు పేట్ బషీరాబాద్, నిజాంపేట స్థలాలనే ఇవ్వాలని కోరుతూ తీర్మానం చేశారు. సీనియర్ పాత్రికేయులు ఎంవీఆర్ శాస్త్రి, జూబ్లీహిల్స్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు గోపరాజు, టీఆర్ ఎస్ మీడియా విభాగం అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, జేఎన్ జే సొసైటీ నాయకులు అశోక్ రెడ్డి, శ్రీనివాసరావు, గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ కార్యదర్శి బొల్లం శ్రీనివాస్, టీడబ్ల్యూజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు కుంచం శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, కో-కన్వీనర్లు ఎం. రవికుమార్, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు నిరంతర అభివృద్ధిలో పిఎసిఎస్ పాత్ర కీలకం

- అదనపు కలెక్టర్ రాజా గౌడ్



నిజామాబాద్ నవంబర్ 03;(విజన్ ఆంధ్ర) నిజామాబాద్ ఉమ్మడి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (NDCCB) యొక్క 104 వ వార్షిక మహాజన సభ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో అధికారిక PIC కమిటీ సభ్యులు, నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. రాజా గౌడ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకు నిరంతరం అభివృద్ధి పథంలో పయనిస్తూ, ఆర్థికంగా మరింత బలోపేతం అవుతున్నందుకు ముఖ్యకార్యనిర్వహణాధికారి, ఉన్నతాధికారులు, సిబ్బందిని మరియు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అధ్యక్షులను, ప్రత్యేకంగా అభినందించారు. బ్యాంకు అభివృద్ధిలో పిఎసిఎస్ ల పాత్ర కీలకం అని పేర్కొన్నారు. తదుపరి బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి నాగభూషణం వందే బ్యాంకు యొక్క ఆర్థిక పరిస్థితి మహాజన సభ కు వివరించారు, సభ్య సంఘాల సహకారం తో ఇటీవల బ్యాంకు రాష్ట్ర స్థాయిలో అత్యుత్తముగా ఉంటూ, NABARD మరియు TGCAB ద్వారా ఉత్తమ అవార్డు అందుకుందని తెలిపారు.



ఉమ్మడి నిజామాబాద్ జిల్లా రైతాంగమునకు సేవలో సహకార బ్యాంకు ప్రథమ స్థాయి లో ఉందని వివరించారు. ఈ సమావేశంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పిఎసిఎస్ అధ్యక్షులు పాల్గొని బ్యాంకుకు సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలపై చర్చించారు. ఇటీవల నూతనముగా సహకార సంఘ అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన పిఎసిఎస్ అధ్యక్షులకు అదనపు కలెక్టర్ బి. రాజా గౌడ్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, జిల్లా సహకార అధికారి ఎన్. శ్రీనివాసరావు , కామారెడ్డి జిల్లా సహకార అధికారి రామ్మోహన్ , బ్యాంకు ఉన్నతాధికారులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పిఎసిఎస్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



విశాఖ మేయర్ పీఠం కూటమి కైవసం

- 44 వేలకు పైగా ఓట్ల ఆధిక్యంతో ముక్కా శ్రావణి విజయం

విశాఖపట్నం:ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. విశాఖపట్నం మేయర్ పీఠాన్ని టీడీపీ అభ్యర్థి ముక్కా శ్రావణి కైవసం చేసుకున్నారు. వైసీపీ అభ్యర్థి వరుదు కల్యాణిపై 44 వేలకు పైగా ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. జీవీఎంసీలో అత్యధిక డివిజన్లను కూటమి అభ్యర్థులు దక్కించుకున్నారు. విశాఖ టీడీపీకి కంచుకోట అని ఈ విజయం మరోసారి నిరూపించిందని ముక్కా శ్రావణి పేర్కొన్నారు. తనను గెలిపించిన నగర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు ఏలూరు కార్పొరేషన్‌లో జనసేన అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడు 44,665 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు.

ఈవీఎం గోదాములభద్రత పకడ్బందీగా ఉంది

- ఇంచార్జ్ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



వనపర్తి జిల్లా ప్రతినిధి, నవంబర్ 03 (విజన్ ఆంధ్ర) : జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం వెనుక భాగంలో ఉన్న ఈవీఎంల భద్రతా గోదామును కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ నిర్వహిస్తున్నట్లు ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. మంగళవారం నెలవారీ తనిఖీల్లో భాగంగా ఆయన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్‌తో కలిసి ఈవీఎం గోదామును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా గోదాం వద్ద చేపట్టిన భద్రతా ఏర్పాట్లను వారు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ముఖ్యంగా సీసీ కెమెరాల నిఘా వ్యవస్థ పనితీరును పరిశీలించి, అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. ఈసీఐ నిబంధనలకనుగుణంగా తనిఖీలు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈసీఐ మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ ఎప్పటికప్పుడు ఈవీఎం గోదామును తనిఖీ చేసి ఉన్నతాధికారులకు సమగ్ర నివేదిక సమర్పిస్తున్నట్లు వివరించారు. ఇందులో భాగంగానే నేడు నెలవారీ తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. అంతకుముందు, జిల్లా కేంద్రానికి విచ్చేసిన ఇంచార్జ్ కలెక్టర్‌కు అదనపు కలెక్టర్ వినోద్ కుమార్, ఆర్డీవో పూల మొక్క అందజేసి సాదర స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తహశీల్దార్ రమేష్ రెడ్డితో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూ భారతి దరఖాస్తులు, రీసర్వే వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్



వనపర్తి జిల్లా ప్రతినిధి, నవంబర్ 03 (విజన్ ఆంధ్ర) : జిల్లాలో భూ భారతి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, భూదాన్ భూముల గుర్తింపును త్వరితగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

మంగళవారం రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) లోకేష్ కుమార్ అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం నుంచి ఈ వీసీకి అదనపు కలెక్టర్ వినోద్ కుమార్ హాజరయ్యారు.

సీసీఎల్ఏ ఆదేశాల మేరకు స్పష్టమైన ఆదేశాలు : ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సీసీఎల్ఏ లోకేష్ కుమార్ పలు రెవెన్యూ అంశాలపై సమీక్ష జరిపారు. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, భూదాన్ భూముల గుర్తింపు, వివరాల ఆన్‌లైన్ నమోదు, భూముల రీసర్వే ప్రక్రియలను వేగవంతం చేయాలని సూచించారు. ఈ నేపథ్యంలో జిల్లా రెవెన్యూ అధికారులకు అదనపు కలెక్టర్ వినోద్ కుమార్ పలు కీలక సూచనలు జారీ చేశారు. భూ భారతి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలన్నారు. భూదాన్ భూములకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. అలాగే జిల్లాలో కొనసాగుతున్న భూముల రీసర్వే పనులను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం, అధికారులు సమన్వయంతో పనిచేసి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిరుపతయ్య, డీఆర్వో రామ్‌రెడ్డి, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, సర్వే ఏడీ శ్రీనివాసులు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వారసత్వ పరిరక్షణలో స్వచ్ఛంద సేవకుల పాత్ర కీలకం - అదనపు కలెక్టర్



ములుగు నవంబర్ 03, విజన్ ఆంధ్ర ప్రతినిధి : వెంకటాపూర్: వారసత్వ కట్టడాల పరిరక్షణపై అవగాహన కల్పించడంలో స్వచ్ఛంద సేవకులు కీలక పాత్ర పోషించాలని అదనపు కలెక్టర్ సంపత్ రావు అన్నాడు. మంగళవారం పాలంపేట రామప్ప దేవాలయంలో జరిగిన ప్రపంచ వారసత్వ స్వచ్ఛంద సేవకుల శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యాడు. పర్యాటక శాఖ నోడల్ అధికారి ధర్మనాయక్, కాకతీయ వారసత్వ సమితి అధ్యక్షుడు పాండురంగారావు, ప్రతినిధి శ్రీధర్ రావులతో కలిసి జ్యోతి వెలిగించాడు.

రామప్ప విశిష్టతను ప్రపంచానికి చాటాలని సూచించాడు.

ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఇమ్మడి భాస్కర్, సమితి సభ్యుడు శ్రీనివాస్, సర్పంచ్ చల్లగొండ రాజు, పర్యాటక మార్గదర్శకులు గోరంటల విజయ్ కుమార్, వెంకటేష్, పురావస్తు శాఖ పర్యవేక్షకుడు బాబు, పర్యాటక పోలీసులు అరుణ్, భద్రు, సంబంధిత శాఖల సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

మంగపేట నూతన ఎస్ హెచ్ ఓ కు ఘన సన్మానం చేసిన జ్వాలా ట్రస్ట్.



ములుగు నవంబర్ 03, విజన్ ఆంధ్ర ప్రతినిధి : మంగపేట పోలీస్ స్టేషన్ కు నూతనంగా స్టేషన్ హౌస్ ఆఫీసర్ బాధ్యతలు స్వీకరించిన (ఎస్సై) మధుకర్ ను జ్వాలా సేవా సమితి – మంగపేట తరఫున మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూలగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మంగపేట ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణకు ఆయన సేవలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు కోడెల నరేష్, ప్రధాన కార్యదర్శి బండపల్లి రవి గౌడ్, ఉపాధ్యక్షులు పుల్లంశెట్టి అజయ్ తదితర ముఖ్యులు పాల్గొన్నారు.

వాణిజ్య భవనాల ఆస్తి పన్నుపై ఆరోపణలు నిరాధారం - ములుగు పురపాలక సంఘం

ములుగు నవంబర్ 03, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు పురపాలక సంఘం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపినది ఏమనగా – వాణిజ్య భవనాల ఆస్తి పన్నును ప్రభుత్వ ఉత్తర్వు 230 ప్రకారం, మండలి తీర్మానం, జిల్లా కలెక్టర్ ఆమోదంతో యూనిట్ రేటు 0.30 పైసల చొప్పున మాత్రమే విధించాము. నమోదు విలువ రూ. 1700 నుండి రూ. 9200 లకు పెరగడం వల్ల పన్ను పెరిగినట్లు కనిపిస్తోంది. 9వ వార్డుకు చెందిన వక్కల రమేష్ ఆరోపణలు నిరాధారమని తేలింది. ఆధారాలు లేకుండా తప్పుడు ఆరోపణలు చేస్తే చట్టపర చర్యలు తీసుకుంటామన్నారు.

భూభారతి దరఖాస్తుల పరిష్కారంపై దృశ్య సమావేశం - అదనపు కలెక్టర్ మహేందర్ హాజరు



ములుగు నవంబర్ 03,విజన్ ఆంధ్ర ప్రతినిధి : మంగళవారం భూ పరిపాలన ప్రధాన కమిషనర్ లోకేష్ కుమార్ హైదరాబాద్ నుంచి నిర్వహించిన దృశ్య సమావేశంలో ములుగు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మహేందర్ పాల్గొన్నారు. సమీకృత కలెక్టరేట్ నుంచి జరిగిన ఈ సమావేశంలో భూభారతి పెండింగ్ దరఖాస్తులు, రీసర్వే, జీవో 59, 76 క్రమబద్ధీకరణ, హైకోర్టు కేసుల పురోగతిపై సమీక్ష జరిగింది. ప్రతి మండలానికి రెండు సర్వే బృందాలను కేటాయించి రీసర్వేను వేగవంతం చేయాలని, పెండింగ్ దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలని లోకేష్ కుమార్ ఆదేశించాడు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణవేణి, ఏవో రాజ్ కుమార్, పర్యవేక్షకులు మహేష్ బాబు, మంజుల, తహసీల్దార్ విజయభాస్కర్, ఉప తహసీల్దార్ మల్లేశ్వర్ తదితరులు మహేందర్ తో కలిసి పాల్గొన్నారు.

పెనుగోలు ఆదివాసీ భూములు లాక్కోవద్దు - పట్టాలు ఇవ్వాలి: కొరస నరసింహమూర్తి



ములుగు నవంబర్ 03, విజన్ ఆంధ్ర ప్రతినిధి : వందల ఏళ్లుగా పెనుగోలు ఆదివాసీలు సాగు చేసుకుంటున్న భూములను మోడీకుంట ప్రాజెక్టు పేరుతో లాక్కోవద్దని, పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షుడు కొరస నరసింహమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం ములుగు కలెక్టర్ కార్యాలయంలో అదనపు జిల్లా కలెక్టర్ మహేందర్ ను కలిసి వినతి పత్రం అందజేశాడు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ.... వందల ఏళ్లుగా అడవులను, కొండలను నమ్ముకొని బతుకుతున్న పెనుగోలు ఆదివాసీలను ప్రభుత్వాలు పట్టించుకోలేదని, నేటికీ రోడ్డు, విద్య, వైద్య సేవలు లేవని ఆవేదన వ్యక్తం చేశాడు. అనారోగ్యం వస్తే జోలె కట్టి మోయాల్సిన దుస్థితి ఉందన్నాడు. పక్కనే జనం లేని గ్రామాలకు కోట్లు పెట్టి రోడ్లు వేసిన ప్రభుత్వం, జనం ఉన్న పెనుగోలుకు ఎందుకు రోడ్డు వేయడం లేదని ప్రశ్నించారు. పెసా గ్రామసభలు, 1/59, 1/70, అటవీ హక్కుల గుర్తింపు చట్టాలను పక్కన పెట్టి ఇష్టానుసారంగా భూములు ఇస్తున్నారని, ఇది సరికాదన్నాడు. జపాన్ లాంటి దేశాల్లో ఒక్క విద్యార్థి కోసం రైలు వేశారని, ఆరుగురు ఆదివాసీల కోసం ప్రత్యేక జోన్ ఏర్పాటు చేశారని, ఇక్కడ మా బతుకులను ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. అడవి నుంచి ఆదివాసీని వేరు చేయడం నీటి నుంచి చేపను వేరు చేయడమేనని అత్యున్నత న్యాయస్థానం చెప్పిందని గుర్తు చేశాడు. మాకు సేవలు ఇవ్వకపోయినా మా బతుకు మేము బతికాము, ఇప్పుడు మా భూములను తీసుకోవద్దని కోరాడు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎట్టి విద్యాసాగర్, సోషల్ మీడియా రాష్ట్ర అధికార ప్రతినిధి పాయం అజయ్, పాయం కృష్ణమూర్తి, బొగ్గుల నారాయణ, శివాజీ, ఉయిక సురేష్, రాజేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మియాపూర్ 550 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రజా ప్రయోజనం కోసం కేటాయించాలి

- ప్రజల నివాసాలకు పట్టాలు ఇవ్వాలి

- ప్రభుత్వ భూమిని అమ్మితే ప్రజా పోరాటాలు తప్పవు

- యంసిపిఐ (యు)రాష్ట్ర కార్యదర్శి గాధగోని రవి హెచ్చరిక





శేరిలింగంపల్లి.నవంబర్ 3: (విజన్ ఆంధ్ర) : మియాపూర్ గ్రామ సర్వే నంబర్ 100,101 లలో కాలనీలలో నివాసాలు పోను మిగిలిన 550 ఎకరాల భూమిని ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించాలని,ప్రజల నివాసాలకు పట్టాలు ఇచ్చి చట్టబద్ధత చేయాలని, ప్రభుత్వ భూమిని అమ్మితే ప్రజా పోరాటాలు తప్పవని యంసిపిఐ (యు)రాష్ట్ర కార్యదర్శి గాధగోని రవి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఇటీవల శేర్లింగంపల్లి మండలం, మియాపూర్ గ్రామ సర్వే నంబర్ 100,101 లలోని 550 ఎకరాల భూమి ప్రభుత్వానిదేనని ఇటీవల సుప్రీంకోర్టు వచ్చిన తీర్పు వెలుగులో రాష్ట్ర ప్రభుత్వం ఈ భూమి ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చి ప్రజా పాలన సాగిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పడం వల్ల ఈ భూమిని అమ్మకూడదని ఇక్కడ నివాసాల వారికి ఇంటి పట్టాలి వాళ్ళని డిమాండ్ చేస్తూ ఈరోజు 100,101 సర్వే నంబర్ లోని ప్రభుత్వ భూమిని స్టాలిన్ నగర్, ముజాఫర్ అహ్మద్ నగర్ నివాసాలను ఎంసిపిఐ(యు) ఆధ్వర్యంలో వామపక్ష పార్టీల రాష్ట్ర నేతలు సందర్శించారు. తదనంతరం స్టాలిన్ నగర్ ముజాఫర్ అహ్మద్ నగర్ కాలనీ వాసులతో జరిగిన సమావేశంలో యంసిపిఐ (యు)రాష్ట్ర కార్యదర్శి గాధగోని రవి మాట్లాడుతూ.. మియాపూర్ గ్రామ పరిధిలోని 100 101 సర్వే నంబర్లలో 550 ఎకరాల భూమితో పాటు అనేక సర్వే నెంబర్లలో ప్రభుత్వ భూములు ఉన్నాయని నాలుగు దశాబ్దాల క్రితమే యంసిపిఐ (యు) ప్రభుత్వాలకు తెలియజేసిందని గుర్తు చేశారు. 1994లో అమరజీవి కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ శాసనసభ్యునిగా ఉన్న సమయంలోనే శాసనసభలలో మియాపూర్ తో పాటు హైదరాబాద్ చుట్టుపక్కల కబ్జాలకు గురి అవుతున్న భూములపై చర్చపెట్టి ప్రభుత్వాలను నిలదీశారని గుర్తు చేశారు. ఆ సందర్భంలోనే 1996లో ఆనాటి రాష్ట్ర ప్రభుత్వం ఈ భూముల నిజానిజాల కోసం త్రిసభ్య కమిషన్ వేసి ప్రజల ముందు నివేదించిందని ఆ నివేదికలో ఇది ముమ్మాటికీ ప్రభుత్వ భూమిని తేలడంతోటి మియాపూర్ ఈ భూములలో వారసుల ముసుగులో దొంగ దారిన అధికారులు స్థానిక గ్రామ పరి పాలకులు కుమ్మక్కై ప్రభుత్వ భూమిని పక్కదారి పట్టించి సొసైటీల పేరుతోటి మధ్యతరగతి కార్మిక వర్గాన్ని మోసం చేశారని ఆరోపించారు. మియాపూర్ లోని అనేక భూములతో పాటు ఈ 100, 101 సర్వే నెంబర్లలోని భూమి ప్రజలకు దక్కాలని ఆనాటి యంసిపిఐ(యు)ఉద్యమం తాండ్ర కుమార్ గారి నాయకత్వంలో స్టాలిన్ నగర్, ముజాఫర్ అహ్మద్ నగర్ లను ఏర్పాటు చేసి ప్రజలకు నివాసాలు ఏర్పాటం జరిగిందని గుర్తు చేశారు. ప్రాంతంలో భూ బకాసురుల కబంధ హస్తాలలో చిక్కుకుపోయి అనేక ప్రభుత్వ భూమి అపార్ట్మెంట్లు రియల్ ఎస్టేట్ వ్యాపారాలకబ్జాలకు గురి అయిందని భూమిని రక్షించడానికి యంసిపిఐ (యు) నాయకత్వం అనేక త్యాగాలు చేస్తూ జైలకు కేసులు పెట్టించుకోవడం జరిగిందని అనప్పటికీ ఇది పేదలకు ఇళ్ల స్థలాల కింద దక్కించాలని పోరాటాలు జరిగాయని ఇది రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని గత రాష్ట్ర ప్రభుత్వాల పాలనలాగా ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ పాలన ఉంటే పేద ప్రజలకు న్యాయం జరగదని అన్నారు.ఆర్థిక వనరులను సమకూర్చడంతోనే సంక్షేమం జరిగితే ప్రజలకు ప్రకటించిన వాగ్దానాలను అమలు చేయలేక ప్రభుత్వ భూములను అమ్మకాలు పెట్టడం జరుగుతుందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ భూములు అమ్మకం కాకుండా ప్రజా ప్రయోజనాల కోసం కాపాడాలని ప్రజల నివాసాలు నిలబెట్టడానికి కృషి చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేశారు. మియాపూర్ 100,101 లలోని 550 ఎకరాల ప్రభుత్వ భూమిని రాష్ట్ర ప్రభుత్వం అమ్మకూడదని ఈ భూమిలో స్టాలిన్ నగర్ ముజాఫర్ అహ్మద్ నగర్ కాలనీవాసుల నివాసాలకు ఇంటి పట్టాలు ఇచ్చి చట్టబద్ధత చేయాలని, మిగులు భూమిని ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించాలని ప్రభుత్వ భూమిని అమ్మితే ప్రజా పోరాటాలు చేపడతామని ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వ భూముల అమ్మకమే రాష్ట్ర ప్రభుత్వ పనిగా ఉందని ప్రజల ప్రయోజనాలు పక్కన పెట్టారని కార్యక్రమానికి హాజరైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జి నరసింహారావు అన్నారు. చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నప్పుడు ఈ ప్రాంతంలో ప్రజలు గుడిసెలు వేసుకొని నివాసాలు ఏర్పాటు చేసుకొని ఉన్నారని అన్నాడు విద్యుత్ చార్జీలు పెంచడంతోపాటు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబించారని హైటెక్ పాలనను అరిచేతుల్లో చూపుతున్నట్లు ఆనాడు ప్రజలను అణిచివేశారని ఈనాటి రేవంత్ రెడ్డి ఆయన శిష్యుడే కాబట్టి ప్రజలకు మేలు చేయలేని విధంగా ఆయన గుణగణాలు ఉన్నాయని ప్రభుత్వ భూముల జోలికి వస్తే పోరాటాలు తప్పవని హెచ్చరించారు. సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు జే.వి చలపతిరావు గారు మాట్లాడుతూ.. దశాబ్దాలుగా ఇక్కడ నివాసాలు ఉంటున్న పేద ప్రజల పట్ల కమ్యూనిస్టు పార్టీ ఎర్రజెండా త్యాగాల పూరితంగా పోరాటాలు చేసిందని ఆ పోరాటాలు మరిచిన గత ప్రభుత్వాలు ఏమి చేయలేకపోయాయని ఈనాడు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తే ప్రజలే తగిన బుద్ధి చెప్పి హక్కులు సాధించుకుంటారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ భూముల ద్వారా ఆదాయాన్ని తీయాలని వారి ప్రయోజనాల కోసం వినియోగించి ఇక్కడ నివాసాలకు చట్టబద్ధత చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హన్మేష్ మాట్లాడుతూ.. ఈ వందలాది ఎకరాల ప్రభుత్వ భూమి రియల్ స్టేట్ వ్యాపారులకు వరం అయ్యే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ముందస్తుగానే భూమిని అమ్మేస్తున్నట్టు ప్రకటించడం రాష్ట్ర ప్రభుత్వ తప్పుడు విధానాన్ని ప్రకటించుకుందని హైదరాబాద్ మహానగరంలో ఈ భూమి రియల్ ఎస్టేట్ కబంధ హస్తాలకు వెళ్లకుండా ప్రజల అవసరాల కోసం వినియోగించాలని ఇక్కడ నివాసాలు ఉన్న కాలనీలలో ప్రజలకు నష్టం కలిగించే విధంగా ఇండ్ల జోలికి రాష్ట్ర ప్రభుత్వం రాకూడదని అలా జరిగితే ప్రజలు పోరాటాలు చేయడానికి చైతన్యవంతులుగా ఉన్నారని అన్నారు. ఎస్ యుసిఐ(సి)రాష్ట్ర కమిటీ సభ్యులు జానీ పాషా మాట్లాడుతూ.. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టమని రెడ్ కార్పెట్ పరిచి మరి ఆహ్వానిస్తున్నారని అందుకే ఇలాంటి ప్రజలకు చెందవలసిన ఇలాంటి భూమిని పెట్టుబడిదారులకు దార దత్తం చేయడానికి ప్రయత్నం చేస్తుందని అలాంటి జరిగితే రాష్ట్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకుంటుందని అన్నారు. యంసిపిఐ (యు) పొలిట్ బ్యూరో సభ్యులు వల్లెపు ఉపేందర్ రెడ్డి, మోర్తాల చంద్రరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్, కుంభం సుకన్యలు ప్రసంగించారు. ఇంకా ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.తుకారాం నాయక్, పానుగంటి నరసయ్య, రవి,తిరుపతి,గ్రేటర్ హైదరాబాద్ కమిటీ కార్యదర్శి మైదం శెట్టి రమేష్ సహాయ కార్యదర్శి తుడుం అనిల్ కుమార్, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి వర్గ సభ్యులు అంగడి పుష్ప, తాండ్ర కళావతి,కర్ర దానయ్య ఇస్లావత్ దశరథ్ నాయక్,పల్లె మురళి, సిపిఎం రంగారెడ్డి జిల్లా నాయకులు సి శోభన్,కృష్ణ, మరియు జి శివాని,డి. శ్రీనివాసులు, మహేష్,ఎన్ నాగభూషణం, డీ.కే నారాయణ, సూర్తనా బేగం,రజియా బేగం,ఎం రాణి, ఎన్ గణేష్,కొడిపాక రాజు,యం. శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ముప్పు..రబీలో సాగు బంద్!

- తాగునీటికే ప్రాధాన్యం..

ఉపాధి పనుల విస్తరణకు ఆదేశం

- వనపర్తిలో ఇంచార్జ్ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సమీక్ష



వనపర్తి జిల్లా ప్రతినిధి, నవంబర్ 3 (విజన్ ఆంధ్ర) : ఎల్‌నినో ప్రభావంతో రానున్న కాలంలో తీవ్ర నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నందున జిల్లాలో ముందస్తు జాగ్రత్త చర్యలు వేగవంతం చేయాలని ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం వనపర్తి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా, మండల స్థాయి అధికారులతో ఆయన సన్నాహక సమావేశం నిర్వహించారు.

రబీలో పంటల సాగు వద్దు.. తాగునీటికే తొలి ప్రాధాన్యం

ఎల్‌నినో ప్రభావం వల్ల ఏర్పడే నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని ఈ ఏడాది రబీ సీజన్‌లో రైతులు ఎవరూ పంటల సాగుకు పూనుకోవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న నీటిని కేవలం తాగునీటి అవసరాల కోసమే వినియోగించాలని ఆదేశించారు. ఈ నెల 13వ తేదీలోపు జిల్లాలోని అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి నీటి సంరక్షణపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ శాఖ రూపొందించిన అవగాహన పోస్టర్లను ప్రతి ఇంటికీ చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

కూలీలకు ప్రత్యామ్నాయ ఉపాధి.. వీబీ-జీ రామ్-జీ పనులు

రబీ సాగు లేనందున రైతులకు, కూలీలకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించేందుకు వీబీ-జీ రామ్-జీ పథకం కింద పనులను ముమ్మరం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లో నీటి పారుదల కాలువల శుభ్రత, నిర్వహణ పనులు చేపట్టాలి. జలసిరి కార్యక్రమంలో భాగంగా నీటి సంరక్షణ నిర్మాణాలు, భూగర్భ జలాల పెంపునకు రీఛార్జ్ గుంతలు, ఫామ్ పాండ్స్, సోక్ పిట్స్ నిర్మాణాలు చేపట్టాలి.గ్రామీణ రహదారులపై పెండింగ్ పనులు, మురుగుకాలువల నిర్మాణం, పశువుల కోసం గడ్డి పెంపకం పనులు గుర్తించాలి.స్వచ్ఛభారత్ కింద మరుగుదొడ్లు లేని ఇళ్లను గుర్తించి నిర్మాణాలు పూర్తి చేయడంతో పాటు, పాఠశాలల్లోనూ మరుగుదొడ్ల పనులు చేపట్టాలి.జాబ్ కార్డుల ప్రక్షాళన చేపట్టి, మరణించిన వారు, అందుబాటులో లేని అనర్హుల పేర్లను తొలగించాలి. కూలీల సంఖ్యను గణనీయంగా పెంచాలని ఆదేశించారు.

మిషన్ భగీరథ ప్రత్యేక డ్రైవ్

నవంబర్ 15 నుంచి డిసెంబర్ 1 వరకు మిషన్ భగీరథ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. తాగునీటి సరఫరాలో ఎక్కడైనా మరమ్మతులు ఉంటే వెంటనే పూర్తి చేయాలని, అవసరమైన చోట బోర్‌వెల్స్‌తో పాటు ప్రత్యామ్నాయ నీటి వనరులను గుర్తించాలని అధికారులను ఆదేశించారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

ప్రస్తుతం నిర్దేశించిన పనుల పురోగతిపై రానున్న పది రోజుల్లో మరోసారి సమీక్షా సమావేశం నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. తదుపరి సమావేశానికి ప్రతి మండల అధికారి తాము చేపట్టిన చర్యలు, పనుల పురోగతికి సంబంధించిన కార్యాచరణ నివేదికతో హాజరుకావాలని హెచ్చరించారు. ఆదేశాల అమలులో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్, (రెవెన్యూ) వినోద్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి రాంరెడ్డి, జడ్పీ సీఈఓ యాదయ్య, డీఆర్డీఓ ఉమాదేవి, ఎంపీడీవోలు, జిల్లా మరియు మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ ఎన్. ఖీమ్యా నాయక్



వనపర్తి జిల్లా ప్రతినిధి, నవంబర్ 3 (విజన్ ఆంధ్ర) : ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదని, రానున్న రోజుల్లో కరువు పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉన్నందున ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణ, విద్యుత్ పొదుపునకు ప్రాధాన్యత ఇవ్వాలని అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఎన్. ఖీమ్యా నాయక్ సూచించారు. కురిసిన ప్రతి వర్షపు నీటి చుక్కను వృథా చేయకుండా భూమిలో ఇంకేలా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. మంగళవారం ఎదుల మండలం మాచుపల్లి గ్రామంలో సాంస్కృతిక శాఖ కళాకారుల ఆధ్వర్యంలో ఎల్‌నినో ప్రభావం, నీటి సంరక్షణ, విద్యుత్ పొదుపుపై నిర్వహించిన గ్రామస్థాయి అవగాహన కార్యక్రమానికి అదనపు కలెక్టర్ డీఆర్డీఓ పీడీ ఉమాదేవి, జిల్లా పౌర సంబంధాల అధికారి పి. సీతారాంతో కలిసి హాజరయ్యారు. కళాకారులు ఆటపాటల ద్వారా ప్రజలకు నీటి పొదుపు ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావం వచ్చే జూలై వరకు కొనసాగే అవకాశం ఉన్నందున భూగర్భ జలాలు తగ్గిపోయి కరువు పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. ఈ పరిస్థితులను అధిగమించేందుకు ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇంటి పైకప్పుపై పడే వర్షపు నీటితో పాటు బట్టలు ఉతికిన నీరు, అంట్లు తోమిన నీటిని రోడ్లపైకి వదలకుండా ఇంకుడు గుంతల్లోకి మళ్లించాలని చెప్పారు. ఇంకుడు గుంతల ఏర్పాటుకు ప్రభుత్వం రూ.6,500 ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు.

రైతులకు ఫార్మ్ పాండ్లతో ప్రయోజనం

రైతులు తమ పొలాల్లో నీటి కుంటలు (ఫార్మ్ పాండ్లు) ఏర్పాటు చేసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఒక గుంట విస్తీర్ణంలో నీటి కుంట ఏర్పాటుకు ప్రభుత్వం రూ.1.30 లక్షల ఆర్థిక సహాయం అందిస్తోందని, వీటిని వి.బి.జి. రామ్‌జీ పథకం కింద ఉపాధి హామీ కూలీలతో నిర్మించనున్నట్లు వివరించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భూగర్భ జలాలను పెంపొందించుకోవడంతో పాటు అవసరమైనప్పుడు నీటిని వినియోగించుకోవచ్చని, చేపల పెంపకం కూడా చేపట్టవచ్చని తెలిపారు. పశుగ్రాసం పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని, సబ్సిడీపై గడ్డి విత్తనాలు సరఫరా చేయడంతో పాటు ఎకరాకు రూ.14 వేల ఆర్థిక సహాయం అందిస్తుందని పేర్కొన్నారు. రైతులు పశు గ్రాసాన్ని తమ పశువులకు వినియోగించుకోవడంతో పాటు మిగిలిన దానిని విక్రయించి ఆదాయం పొందవచ్చన్నారు.



ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి

గ్రామాల్లో జాబ్ కార్డులు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పనులకు హాజరుకావాలని సూచించారు. చెరువులు, కుంటలు, కాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగించడం ద్వారా ఉపాధి పొందడంతో పాటు నీటి నిల్వ సామర్థ్యం పెరిగి భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయని తెలిపారు. చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు కూడా ఈ పనులు దోహదపడతాయని చెప్పారు.

ఫార్మ్ పాండ్ పనుల పరిశీలన

అనంతరం మాచుపల్లి గ్రామ శివారులోని రైతు వ్యవసాయ పొలంలో వి.బి.జి. రామ్‌జీ పథకం కింద నిర్మిస్తున్న నీటి కుంటను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఇలాంటి నీటి కుంటలను మరిన్ని ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్న కూలీలతో మాట్లాడి పనుల పరిస్థితి, కూలి డబ్బులు సకాలంలో బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కూలి డబ్బులు సకాలంలో అందుతున్నాయని కూలీలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎదుల ఎంపీడీవో, మాచుపల్లి సర్పంచ్ అనురాధ, పంచాయతీ కార్యదర్శి, ఏపీఎం తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు అమ్ముతున్న బ్రాండ్ షాపులపై చర్య తీసుకోవాలి - సర్పంచుల ఫోరం.



భూపాలపల్లి జిల్లా 03 నవంబ్వర్ (విజన్ ఆంధ్ర) : టేకుమట్ల మండల సర్పంచులు అందరూ కలెక్టర్ కి టేకుమట్ల మండల కేంద్రంలో ఉన్న రెండు వైన్ షాపులు రాజరాజేశ్వర వైన్ షాప్ మరియు పార్క్ లేని వైన్ షాపులు రెండు సిండికేట్ అయి ఒకటి హోల్సేల్ ధరలకు అమ్ముకుంటూ మరొకటి రిటైల్ షాపు రిటైల్ గా అమ్ముకుంటూ ఒక క్వార్టర్ కు 30 రూపాయలు మరియు ఫుల్ బాటిల్ కు 120 రూపాయలు ఎక్కువ అమ్ముతూ ప్రజలను ఇబ్బంది చేస్తూ విచ్చలవిడిగా మధ్య అమ్మకానికి పాల్పడుతున్నారు మరియు రోజు సాయంత్రం 10 గంటలకు తెరవాల్సిన షాపును 8 గంటల వరకు మూసి వేస్తున్నారు. కావున ఇట్టి విషయంపై టేకుమట్ల మండల సర్పంచులందరూ కలిసి టేకుమట్ల సర్పంచుల మండల ఫోరం అధ్యక్షతన కలెక్టర్ రాహుల్ శర్మ కి వినతి పత్రం అందజేసినారు . సర్పంచుల అధ్యక్షుడు కుర్రె మల్లయ్య, మాట్ల శ్రీను, రజిని మహేందర్, తోట సాగర్, అంబాల కిరణ్ ,పొన్నం సాంబయ్య, నాంపల్లి వీరేశం తదితరులు పాల్గొన్నారు.

జన శిక్షణ్ సంస్థ ఆధ్వర్యంలో దర్జీ అడ్వాన్స్‌డ్ శిక్షణ కార్యక్రమం ప్రారంభం

ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్

ఆదిలాబాద్ బ్యూరో నవంబర్ 3)విజన్ ఆంధ్ర)కేంద్ర ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామికవేత్తల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, జన శిక్షణ్ సంస్థ అదిలాబాద్ నిర్వహిస్తున్న దర్జీ అడ్వాన్స్‌డ్ శిక్షణ కార్యక్రమంలో అదిలాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షణ కార్యక్రమాన్ని ఉత్సాహంగా ప్రారంభించి, శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. జన శిక్షణ్ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్, ఏం రెడ్డి వర్క్ దర్జీ పనుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు ఉచిత శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా మహిళలు కుట్టుపనిలో మెళకువలు నేర్చుకొని, స్వయం ఉపాధి అవకాశాలను పొందడంతో పాటు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ మాట్లాడుతూ.. మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదిగి, తమ కుటుంబాలకు అండగా నిలవాలనే లక్ష్యంతో జన శిక్షణ్ సంస్థ అందిస్తున్న ఉచిత నైపుణ్య శిక్షణలు ఎంతో అభినందనీయమని అన్నారు. కుట్టుపని వంటి వృత్తి నైపుణ్యాలను నేర్చుకోవడం ద్వారా మహిళలు తమలోని ప్రతిభను వెలికితీసి, స్వయంగా ఉపాధి పొందే



స్థాయికి ఎదగవచ్చని తెలిపారు. జన శిక్షణ్ సంస్థ ఆధ్వర్యంలో గతంలోనే 20 శిక్షణ బ్యాచ్‌లు విజయవంతంగా పూర్తిచేయడం సంస్థ అందిస్తున్న శిక్షణల నాణ్యతకు, అభ్యర్థుల్లో నైపుణ్యాలను పెంపొందించడంలో సంస్థ చేస్తున్న కృషికి నిదర్శనమని అన్నారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు నిరుద్యోగ యువతీ యువకులకు, ముఖ్యంగా మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకొని, నేర్చుకున్న నైపుణ్యాలతో భవిష్యత్తులో స్వయం ఉపాధి పొందుతూ ఉన్నత స్థాయికి ఎదగాలని అభ్యర్థులకు సూచించారు. నైపుణ్యాభివృద్ధి ద్వారా సమాజంలో ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని, ఇలాంటి కార్యక్రమాలకు తన పూర్తి సహకారం ఉంటుందని చైర్‌పర్సన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ గంట జీవన్ , జన శిక్షణ్ సంస్థ ప్రతినిధులు, శిక్షకులు, శిక్షణ పొందుతున్న అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

పేదింటి బిడ్డ పెళ్లికి అండగా నిలిచిన కాకులమర్రి దంపతులు



ములుగు నవంబర్ 03, విజన్ ఆంధ్ర ప్రతినిధి : మంగళవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కష్టంలో ఉన్న పేదింటి ఆడబిడ్డ పెళ్లికి భరోసాగా నిలిచి పెద్ద మనసు చాటుకున్నారు ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు, ఏటూరునాగారం మేజర్ పంచాయతీ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత. ఏటూరునాగారానికి చెందిన ఎండి అన్వర్ పాషా మేనకోడలి పెళ్లి ఆర్థిక ఇబ్బందుల మధ్య జరుగుతోందని తెలుసుకుని వెంటనే స్పందించారు. పేదింటి బిడ్డ పెళ్లికి 15 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని స్థానికులు, బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాకులమర్రి ప్రదీప్ రావు, తాడూరి రఘు, ఉప సర్పంచ్ పర్వతాల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ చైర్మ చైర్మన్ గా ఆకులు డాక్టర్ ఆకుల నరేష్ బాబు నియామకం



సిద్దిపేట జిల్లా ప్రతినిధి అక్టోబర్ 3 (విజన్ ఆంధ్ర) : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సిద్దిపేట జిల్లా శాఖ చైర్మన్‌గా డాక్టర్ ఆకుల నరశ్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదే విధంగా వైస్ చైర్మన్ గా డా. బండారి విష్ణు కాంత్, కోశాధికారి గా కస్తూరి భూమ్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులుగా అయిత బాల్ రాజేశం ఎన్నిక అయినారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ గారి ద్వారా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డా. నరేశ్ మాట్లాడుతూ మానవ సేవే పరమ ధర్మంగా భావించి నా విధులను నిబద్ధతతోనిర్వహిస్తానని ప్రమాణం చేస్తున్నాననీ, కుల, మత, ప్రాంత, భాష, రాజకీయ భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సమానంగా సేవలందిస్తాననీ, ఆపదలు, విపత్తులు, ప్రమాదాలు, అనారోగ్య పరిస్థితుల్లో బాధితులకు అండగా నిలుస్తాననీ, రక్తదానం, ఆరోగ్య శిబిరాలు, మానవతా సేవా కార్యక్రమాలను ప్రోత్సహిస్తానని తెలిపారు.రెడ్ క్రాస్ సొసైటీ ఆశయాలు, నియమ నిబంధనలు, మానవతా సూత్రాలకు కట్టుబడి సంస్థ గౌరవాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ఒక్క గుట్కా పొట్లం నోట్లో ఏం చేస్తుందో తెలుసా..? చూస్తే వణికిపోతారు..!



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా నవంబర్ 3 (విజన్ ఆంధ్ర బ్యూరో):భారతదేశంలో లక్షలాది మంది ప్రతిరోజూ గుట్కా, తంబాకు తింటున్నారు. అయితే ఆ చిన్న పొట్లం మీ నోటి లోపల ఎంత పెద్ద విధ్వంసం సృష్టిస్తుందో ఈ వీడియోలో 3 డి లో చూడండి. గుట్కాలో సుపారీ, తంబాకు, సున్నం ఉంటాయి. మీరు దాన్ని నమిలినప్పుడు దానిలోని పదునైన కణాలు మీ నోటి లోపలి మృదువైన చర్మాన్ని లోపలి నుంచి పూర్తిగా చీల్చేస్తాయి. ఆ చిన్న చిన్న గాయాల ద్వారా తంబాకులో ఉన్న 70కి పైగా ప్రమాదకరమైన క్యాన్సర్ కారక రసాయనాలు నేరుగా మీ రక్తంలోకి వెళ్లిపోతాయి. నిరంతరం గుట్కా తినడం వల్ల నోటి లోపలి చర్మం ప్లాస్టిక్ లాగా గట్టిగా మారిపోతుంది, దీంతో నోరు పూర్తిగా తెరవలేని పరిస్థితి వస్తుంది. దీన్నే సబ్ మ్యూకస్ ఫైబ్రోసిస్ అంటారు. కానీ అసలు ప్రమాదం ఆ తర్వాతే మొదలవుతుంది. ఈ విషపూరిత రసాయనాలు మీ ఆరోగ్యకరమైన కణాల్లోకి చొచ్చుకుపోయి వాటి డి ఎన్ ఏ, ని శాశ్వతంగా దెబ్బతీస్తాయి. డిఎన్ఏ దెబ్బతిన్న తర్వాత మీ నోటి కణాలు అదుపు తప్పి వేగంగా పెరగడం మొదలెడతాయి, ఒకదానిపై ఒకటి పేరుకుపోతాయి. ఈ కణాల విచిత్రమైన గుంపు నెమ్మదిగా పెద్ద క్యాన్సర్ కణితిగా మారి నోటి చర్మాన్ని పూర్తిగా చీల్చేస్తుంది. సకాలంలో పట్టించుకోకపోతే ఈ క్యాన్సర్ కణాలు రక్తం ద్వారా ఊపిరితిత్తులు, లివర్ వరకు చేరి శరీరమంతా వ్యాపిస్తాయి. ఈ వ్యాధికి చికిత్స చాలా బాధాకరంగా ఉంటుంది, సర్జరీ ద్వారా నోరు లేదా దవడలో పెద్ద భాగాన్ని కోసి తీసేయాల్సి వస్తుంది.

హాస్పటల్లో పనిచేసిన మహిళ కార్మికులకు పెండింగ్ లో ఉన్న వేతనం చెల్లింపు

- బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి,



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా నవంబర్ 3 (విజన్ ఆంధ్ర బ్యూరో): కూకట్ పల్లి నియోజకవర్గం లోని హౌసింగ్ బోర్డ్ లో విశిష్ట హాస్పిటల్ లో గత ఏడు నెలలుగా పని చేసిన వేతనం కోసం మహిళా కార్మికులు ఎంతో ఇబ్బందులు పడ్డారు విశిష్ట హాస్పటల్ యజమాన్యం నిర్లక్ష్యం వహిస్తూ మహిళా కార్మికులకు రావాల్సిన పెండింగ్ లో ఉన్న వేతనం నాలుగు 4,లక్షల 19000/- వేల రూపాయలు ఇవ్వాల్సి ఉండగా అవి ఇవ్వకపోవడంతో ఎవరైతే మనకు కార్మికుల పట్ల న్యాయం జరుగుతుందని తెలుసుకొని తోటి కార్మిక మిత్రుల ద్వారా బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి గురించి తెలుసుకొని, అతని కార్యాలయం వద్దకు వెళ్లి ఆ మహిళ కార్మికులకు జరిగిన అన్యాయం గురించి వివరించారు.వెంటనే స్పందించిన రవి విశిష్ట హాస్పటల్ యజమాన్యం తో మాట్లాడి మహిళా కార్మికులు మొత్తం ఒక్కొక్కరికి రావాల్సిన వేతనం, జితేంద్ర ప్రసాద్ 60,000, వీరస్వామి 90,000, సాకేత్ 13000, శ్రావ్య 17000, సమత 15000, మనుష 8000, సుకన్య 40,000, నాగరాణి 55000, రేవతి 16000, జ్యోతి 18000, భాగ్యలక్ష్మి 17000, ఝాన్సీ 70,000, వేల రూపాయలు మొత్తం 4 లక్షల19000/- వేల రూపాయలు మొత్తం 12 మంది మహిళ కార్మికులకు చెక్కు రూపంలో అందజేయడం జరిగింది. మహిళా కార్మికులు మాట్లాడుతూ కార్మికుల కష్టజీతం ఇప్పించడంతో సహాయం చేసిన కార్మిక నాయకుడు రవికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంతోష్ గౌడ్, జగన్, సుదర్శన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి నృత్యంలో 12 ప్రపంచ రికార్డులు సాధించిన రుంకు వైష్ణవి



హైదరాబాద్, నవంబర్ 03 (విజన్ ఆంధ్ర) : కేవలం 12 ఏళ్ల వయసులో ఏకధాటిగా 12 గంటల పాటు కూచిపూడి నృత్య ప్రదర్శన చేసి 12 ప్రపంచ రికార్డులు సాధించి చిన్నారి రుంకు వైష్ణవి అందరి ప్రశంసలు అందుకుంది. స్పందన నృత్యకేళి స్కూల్ ఆఫ్ డాన్స్ ఆధ్వర్యంలో పియర్సన్ స్కూల్ వేదికగా నిర్వహించిన 'గణ నృత్యం' కార్యక్రమంలో 122 భంగిమలు, 522 పాటలకు అనుగుణంగా నృత్యం చేసి ప్రతిభ చాటింది. ఈ సందర్భంగా భారత్ వరల్డ్ రికార్డ్స్ అధ్యక్షుడు, ప్రపంచ రికార్డుల నేషనల్ కోఆర్డినేటర్ లయన్ కె.వి.రమణారావు, ప్రపంచ రికార్డుల జ్యూరీ సభ్యురాలు, మిస్ గార్జియస్ ఇండియా-2026 విజేత అలిసియా జోసెఫ్, రాష్ట్ర ప్రతినిధి దండు ఉషశ్రీ వైష్ణవికి 12 రికార్డుల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసిన నృత్య గురువు డా.ఎన్.రవికుమార్‌ను అతిథులు అభినందించారు. జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, ఉపాధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యుడు బొంగూరి మహేందర్ రెడ్డి, నెమూరి శంకర్ గౌడ్, ప్రేమ్ కుమార్, అల్లాడి తనీష్, ఎరుకొండ రాజు, కుప్ప శ్రీకాంత్ గౌడ్, జక్కు కృష్ణ, నందగిరి సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల జెండాలను పక్కనపెట్టి గ్రామ అభివృద్ధికి కలిసిమెలిసిగా గ్రామ అభివృద్ధికి నడుం బిగిద్దాం

సీసీ రోడ్డు ప్రారంభోత్సవంలో పాల్గొన్నఎంపీ రఘునందన్ రావు.........

సిద్దిపేట జిల్లా ప్రతినిధి నవంబర్ 3 (వి (విజన్ ఆంధ్ర) : సిద్దిపేట జిల్లా కేంద్రంలో గల గజ్వేల్ నియోజకవర్గం లోని మండల కేంద్రమైన కొండపాక లో రోడ్డు చిన్నదిగా ఉన్నది ఉద్దేశంతో డివైడర్ కొంత వేసి మధ్యన కొన్ని కారణాలవల్ల ఆగిపోవడం వల్ల తిరిగి నూతన సర్పంచిగా ఎన్నికైన మంచాల నవీన శ్రీనివాస్ ఆధ్వర్యంలో రోడ్డు పనులు మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు కొబ్బరికాయ కొట్టి తిరిగి ప్రారంభించడం జరిగింది. కొంతమంది కోర్టు కేసుల మూలంగా ఉన్నటువంటి సమస్యను సైతం ఎంపీ గారు స్వయంగా వెళ్లి మాట్లాడి ఒప్పించినట్టు సమాచారం. గ్రామాలలో అభివృద్ధి కొరకు భారతీయ జనతా పార్టీ అభివృద్ధి దశగా ఉండేటట్లుగా మోడీ ప్రభుత్వం అన్ని గ్రామ పంచాయతీలకు నిధులను మంజూరు చేస్తుందని ఆయన తెలిపారు. గ్రామ పంచాయతీలకు ఇచ్చినటువంటి నిధులను రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల కేటాయించకుండా అట్టి నిధులను వేరే పనులకు వాడుకొని కేంద్ర ప్రభుత్వాన్ని నిందలు వేస్తుందన్నారు. అన్ని గ్రామ పంచాయతీలకు నిధులను మంజూరు చేస్తూ గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నది కేవలం నరేంద్ర మోడీ ప్రభుత్వమే అని అన్నారు వి బి జి రాంజీ పథకం అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు ఏలినోనా కారణంగా నీటి సమస్య అని విద్యుత్ సమస్య అని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుంది కావున కేంద్ర ప్రభుత్వం నుండి విద్యుత్ భారం తగ్గేందుకుగాను ప్రతి కుటుంబం 60 వేల రూపాయల వరకు సబ్సిడీ రూపంలో సూర్యోదయ పథకము అమల్లోకి వచ్చిందని ప్రతి ఒక్కరు ఇంటి పైన సోలార్ నిర్మించుకొని ఉచితంగా ఎలాంటి కరెంట్ బిల్లు లేకుండా విద్యుత్ కొరత లేకుండా మీ ఇంటికి సరిపోయే కరెంటును మీరే తయారు చేసుకోవచ్చని ఆయన అన్నారు. గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ రాజకీయాలను పక్కనపెట్టి మీ గ్రామాభివృద్ధికి మీరందరూ కలిసికట్టుగా పని చేసుకోవాలని మీ గ్రామం అభివృద్ధి చెందితే మీకే అందరికీ గ్రామస్తులందరూ సంతోషంగా ఉంటారని ఆయన అన్నారు అభివృద్ధి విషయంలో మీకు ఎల్లవేళలా నేను



అందుబాటులో ఉంటానని మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు హామీ ఇచ్చారు. కాళ్లలో కట్టెలు పెట్టే పద్ధతులు మానుకొని అభివృద్ధి దశగా మీరందరూ నడవాలని ఆయన కోరారు. గ్రామ సర్పంచ్ మంచాల నవీన శ్రీనివాస్ అతి చిన్న వయసులో మహిళసర్పంచిగా ఎన్నిక కావడం సాఫ్ట్వేర్ ఉద్యోగి అయిన మీ గ్రామ అభివృద్ధి కొరకు కృషి చేస్తున్న ఆమెను అందరూ గౌరవ మర్యాదలతో ఆదరించి ఆమెను మీ గ్రామాభివృద్ధికి పనుల విషయంలో అందరూ కలగొలుపుగా ఉండి మీ గ్రామ పంచాయతీని ఉత్తమ గ్రామ పంచాయతీగా పేరు ప్రఖ్యాతలు తెచ్చుకునేలా అందరూ కలిసికట్టుగా ఉండాలని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు అనంతరం గ్రామ సర్పంచ్ మంచాల నవీన మాట్లాడుతూ అన్న రఘు అన్న ఎల్లవేళలా ఏ సమస్య అయినా చెప్పిన మాకు అన్నా అన్ని అండదండలుగా ఉంటూ ఉంటున్నాడని నేను మీ వెనువెంటే ఉంటూ మీ గ్రామాభివృద్ధికి కృషి చేస్తాను అని హామీ ఇవ్వడంతో మండల కేంద్రమైన కొండపాకలో డ్రైనేజీ వ్యవస్థ గాని రోడ్డు విస్తరణ పనులను గాని తాగునీటి సమస్య పైన గానీ విద్యుత్తు సమస్యల పైన గాని మేము గ్రామంలో అన్ని ప్రజలకు అందుబాటులో ఉంటూ నా వంతుగా కృషి చేస్తున్నారని ఆమె అన్నారు. ఎంపీ రఘున్న అన్నట్లుగా మన కొండపాక గ్రామపంచాయతీని అన్ని విధాల అభివృద్ధి చేసి ఉత్తమ గ్రామ పంచాయతీగా అవార్డు తీసుకోవడానికి నా వంతుగా నేను కృషి చేస్తానని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి మంచాల నవీనమంచాల యాదగిరి తప్పుడు స్వామి ముచ్చర్ల రమేష్ మల్లేశం కనకయ్య తో పాటుగా గ్రామపంచాయతీ మెంబర్లు పాటుగా గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రామాలయ ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్ పర్సన్ చంద్రకళా బిక్షపతి



ములుగు నవంబర్ 03;విజన్ ఆంధ్ర ప్రతినిధి. జిల్లా కేంద్రంలోని రామాలయంలో ఈ నెల 9 నుంచి 11 వరకు జరగనున్న విగ్రహ పునః ప్రతిష్టాపన, ధ్వజ స్తంభ ప్రతిష్టాపన వేడుకల ఏర్పాట్లను పురపాలక చైర్ పర్సన్ చింతనిప్పుల చంద్రకళా బిక్షపతి పరిశీలించి ఆలయ కమిటీ అధ్యక్షుడు దొంతిరెడ్డి రాకేష్ రెడ్డి ల ఆధ్వర్యంలో జరిగే ఈ వేడుకలను ఘనంగా నిర్వహించాలని, యాగశాల ఏర్పాట్లను పరిశీలించి ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో దొంతిరెడ్డి రవిరెడ్డి, వెంకట్ రెడ్డి, పాపిరెడ్డి, వెంకటనారాయణరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, కొండారెడ్డి దిడ్డి రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎండీ గౌస్ పల్లిలో మాదిగ జాగృతి సంఘం గ్రామ కమిటీ ఎన్నిక



ములుగు నవంబర్ 03, విజన్ ఆంధ్ర ప్రతినిధి : మల్లంపల్లి మండలం ఎండీ గౌస్ పల్లి గ్రామంలో మాదిగ జాగృతి సంఘం సమావేశం జిల్లా ప్రధాన కార్యదర్శి జె. కరుణాకర్ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు పసుల సాగర్ పాల్గొని. మాట్లాడుతూ - ఈ దేశ అసలు పేరు జంబూద్వీపమని, ఆది పురుషుడు ఆది జాంభవ మహారాజ్ అని, ఆ జాతి వారసులే నేటి మాదిగలని అన్నాడు. తెలంగాణలో ఉన్న 50 లక్షల మాదిగలను ఒక తాటిపైకి తెచ్చి జంబూద్వీప సంస్కృతిని పునర్జీవింప చేయడమే ఎంజేఎస్ లక్ష్యమని తెలిపాడు. కార్యక్రమంలో ములుగు జిల్లా బీసీ, ఎస్సీ, ఎస్టీ చైర్మన్ ముంజాల బిక్షపతి పాల్గొన్నారు.

అనోజిగూడ డంపింగ్ యార్డును తరలించే వరకు పోరాటం ఆగదు:ఏనుగు సుదర్శన్ రెడ్డి,

- రావుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో డంపింగ్ యార్డు తరలింపు కోసం ధర్నా,
- రెండు నెలల్లో డంపింగ్ యార్డును పూర్తిగా తరలిస్తామని అధికారుల హామీ,
- శాశ్వత పరిష్కారం చూపే వరకు ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం,



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా నవంబర్ 3 ,(విజన్ ఆంధ్ర బ్యూరో): మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఘట్కేసర్ సర్కిల్ పోచారం డివిజన్ అనోజిగూడ డంపింగ్ యార్డును పూర్తిగా తరలించి ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపాలనే డిమాండ్‌తో రావుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ధర్నా కార్యక్రమం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి ,జిల్లా ఉపాధ్యక్షులు గొంగళ్ల బాలేష్, తో పాల్గొని డంపింగ్ యార్డు తరలింపు డిమాండ్‌కు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఏనుగు సుదర్శన్ రెడ్డి, మాట్లాడుతూ, అనోజిగూడ డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. డంపింగ్ యార్డును పూర్తిగా తరలించే వరకు తమ పోరాటం ఆగదని తేల్చిచెప్పారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

రెండు నెలల్లో తరలిస్తామని అధికారుల హామీ:

డంపింగ్ యార్డు తరలింపు అంశంపై స్పందించిన అధికారులు, రెండు



నెలల్లో డంపింగ్ యార్డును పూర్తిగా తరలించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు నాయకులు వెల్లడించారు. ఈ హామీని అధికారులు ఆచరణలో పెట్టి, నిర్ణీత గడువులోగా తరలింపు ప్రక్రియను పూర్తి చేయాలని వారు కోరారు.

శాశ్వత పరిష్కారం వచ్చే వరకు ఉద్యమం:

డంపింగ్ యార్డు తరలింపు విషయంలో కేవలం హామీలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో స్పష్టమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ప్రజలకు శాశ్వత పరిష్కారం లభించే వరకు ప్రజల పక్షాన పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అనోజిగూడ డంపింగ్ యార్డు తరలింపు విషయంలో అధికారులు ఇచ్చిన హామీ మేరకు చర్యలు తీసుకుంటారా? నిర్ణీత రెండు నెలల్లో తరలింపు ప్రక్రియ పూర్తవుతుందా? అన్నది వేచి చూడాల్సి ఉంది. ఈ కార్యక్రమంలో మేడ్చల్ రూరల్ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్ యాదవ్, జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శి శివనాయక్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ప్రణయ్, సీనియర్ నాయకులు వీరారెడ్డి, సత్యనారాయణ రెడ్డి, జిహెచ్ఎంసి బీసీ సంఘం ఉపాధ్యక్షులు అఖిలభారత రజక సంఘం ప్రధాన కార్యదర్శి కొమ్మరాజు సతీష్, జోగు అఖిల్, పరశురాం, డంపింగ్ యార్డ్ బాధితులు,యువకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కేతి బచావోతో సాగుభూమికి భరోసా

- కొండం రవీందర్ రెడ్డి



ములుగు నవంబర్ 03, విజన్ ఆంధ్ర ప్రతినిధి : మంగళవారం కేతి బచావో అభియాన్ లో భాగంగా మల్లంపల్లి గ్రామంలో రైతు చిట్టిరెడ్డి మల్లారెడ్డి మిరప పొలంలో జరిగిన సాగుభూమి సంరక్షణ సదస్సుకు ఆత్మ చైర్మన్ కొండం రవీందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నీటి కొరత నేపథ్యంలో తక్కువ నీటితో పండే ఆరుతడి పంటల వైపు రైతులు మళ్లాలని రవీందర్ రెడ్డి సూచించారు. నేల ఆరోగ్యం, సేంద్రియ సాగు, నీటి పొదుపే భవిష్యత్తుకు భరోసా అని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు అరుణజ్యోతి, రాజు, విజయభాస్కర్, విశ్వతేజ నేల పరీక్ష, సమతుల్య ఎరువులు, తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. ఇఫ్కో మేనేజర్ విశాల్ షిండే డ్రోన్ ద్వారా నానో ఎరువుల పిచికారీ ప్రదర్శన ఇచ్చారు. సర్పంచ్ శ్యామరావు, వ్యవసాయ అధికారి శ్రీధర్, ఏఈఓ జ్యోతిరాణి, పలువురు రైతులు పాల్గొన్నారు.

కురుమూర్తి జాతరకు పోలీస్ శాఖ అభేద్య భద్రతా వలయం

వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమవుతోంది. నవంబర్ 10వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఈ మహా జాతరకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చే నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం ముందస్తుగానే అప్రమత్తమైంది. ఇందులో భాగంగా జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి, ఐపీఎస్ సోమవారం కురుమూర్తి క్షేత్రాన్ని సందర్శించి క్షేత్రస్థాయిలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయ ప్రధాన ద్వారం నుంచి మొదలుకొని, కొండపైకి వెళ్లే ఘాట్ రోడ్డు, భక్తులు బస చేసే ప్రాంగణాలు, అన్నదాన సత్రాలు, తాత్కాలిక దుకాణ సముదాయాలు, పార్కింగ్ స్థలాల వరకు ప్రతి ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆలయ అధికారులు, రెవెన్యూ, మున్సిపల్, వైద్య, విద్యుత్ శాఖల అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఉద్దాల ఉత్సవమే అత్యంత కీలకం

బ్రహ్మోత్సవాల్లో అత్యంత వైభవంగా, అత్యంత రద్దీగా జరిగే ఘట్టం ఉద్దాల ఉత్సవం. నవంబర్ 16వ తేదీన జరగనున్న ఈ ఉత్సవానికి ఉమ్మడి మహబూబ్‌నగర్ తో పాటు నారాయణపేట, వనపర్తి, నాగర్ కర్నూల్, గద్వాల జిల్లాల నుంచే కాకుండా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి కూడా లక్షల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఒకేసారి భారీ సంఖ్యలో జనం ఒకే ప్రాంతంలో గుమిగూడడం వల్ల తొక్కిసలాట వంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు పటిష్టమైన



క్రౌడ్ మేనేజ్‌మెంట్ ప్లాన్ సిద్ధం చేయాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. ఉద్దాల కొండపైకి భక్తులను విడతల వారీగా అనుమతించడం, దర్శనానికి వచ్చే మార్గం, తిరిగి వెళ్లే మార్గాన్ని వేర్వేరుగా ఏర్పాటు చేయడం, మహిళలు, చిన్న పిల్లలు, వృద్ధుల కోసం ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

ట్రాఫిక్, నిఘా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి

జాతర సమయంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ముందస్తుగానే ప్రత్యేక ప్రణాళికను రూపొందించారు. ఆలయానికి రెండు కిలోమీటర్ల దూరంలోనే విశాలమైన ప్రాంతాల్లో నాలుగు ప్రత్యేక పార్కింగ్ స్థలాలను గుర్తించి, అక్కడి నుంచి భక్తులను ఉచిత బస్సుల ద్వారా ఆలయానికి తరలించేలా ఏర్పాట్లు చేయనున్నారు. అదేవిధంగా జాతర సమయంలో భారీ వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లించి, వీఐపీ వాహనాలకు ప్రత్యేక మార్గాన్ని కేటాయించనున్నారు. భద్రతా పరంగా జాతర ప్రాంగణం మొత్తం వందకు పైగా సీసీటీవీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ ఉండేలా ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయనున్నారు. రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచడంతో పాటు, మహిళా భక్తుల భద్రత కోసం షీ టీమ్స్ ను, దొంగతనాలు అరికట్టేందుకు సాదా దుస్తుల్లో పోలీసులను నియమించనున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు ఫైర్ ఇంజన్లు, అంబులెన్సులు, వైద్య బృందాలను 24 గంటల పాటు అందుబాటులో ఉంచాలని ఎస్పీ స్పష్టం చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ప్రతి భక్తుడు సురక్షితంగా స్వామివారిని దర్శించుకుని ప్రశాంతంగా ఇంటికి చేరేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, భక్తుల భద్రత, సౌకర్యాల విషయంలో ఎక్కడా రాజీ పడేది లేదని ఎస్పీ శ్రీమతి డి.జానకి ఉద్ఘాటించారు. వారితో సీఐ రామకృష్ణ తదితర పోలీసులు ఉన్నారు.



రూ.4.25 కోట్ల 'శ్రీరామచంద్ర' లగ్జరీ వాచ్ విడుదల

- ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్న రామతత్వం

అయోధ్య రామమందిరం, రాముడు, హనుమంతుడి ప్రతిమలతో జాకబ్ & కో ప్రత్యేక ఎడిషన్




తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, నవంబర్ 03: లగ్జరీ వాచ్ ప్రపంచంలో భారతీయ ఆధ్యాత్మికత మరోసారి ప్రతిష్టాత్మక గుర్తింపు పొందింది. ప్రపంచ ప్రఖ్యాత లగ్జరీ వాచ్ బ్రాండ్ జాకబ్ & కో (జ్యుఎశీఎ & జశీ.) శ్రీరామచంద్రుడి స్ఫూర్తితో రూపొందించిన ప్రత్యేక లిమిటెడ్ ఎడిషన్ 'శ్రీరామచంద్ర' వాచ్‌ను విడుదల చేసింది. ఈ వాచ్ తయారీలో భారతీయ సంస్కృతి, కళాత్మకత ఉట్టిపడేలా డిజైన్ చేశారు. వాచ్ డయల్‌పై అయోధ్య రామమందిరం నమూనా, శ్రీరాముడు, హనుమంతుడి సూక్ష్మ ప్రతిమలను అత్యంత నైపుణ్యంతో చెక్కారు. 18 క్యారెట్ల రోజ్ గోల్డ్ కేస్, ఆకర్షణీయమైన బ్లూ డయల్, తిరిగే భూగోళం ప్రత్యేక ఫీచర్, 48 గంటల పవర్ రిజర్వ్ వంటి అత్యాధునిక సాంకేతికతలు ఈ వాచ్ సొంతం. ఈ లిమిటెడ్ ఎడిషన్ వాచ్ ధర అక్షరాలా రూ.4.25 కోట్లుగా కంపెనీ నిర్ణయించింది. కేవలం కొంతమంది అత్యంత సంపన్నులకు, కలెక్టర్లకు మాత్రమే అందుబాటులో ఉండే ఈ వాచ్, భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మికతకు ప్రపంచ స్థాయిలో లభిస్తున్న గుర్తింపుకు మరో ప్రత్యేక ఉదాహరణగా నిలుస్తోందని ఆధ్యాత్మిక, ఫ్యాషన్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

రాష్ట్రమంతా కూటమి ప్రభంజనం..

నందికొట్కూరులో మాత్రం ఫ్యాన్ సునామీ!

- ఏపీ మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీకి దక్కిన ఏకైక మున్సిపాలిటీ
- 32 వార్డుల్లో 23 వైసీపీదే
- నంద్యాల జిల్లాలో జగన్ పార్టీ సత్తా
- టీడీపీకి 9 వార్డులే



తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, నవంబర్ 03: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల ఫలితాల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి తన అధికార పీఠాన్ని మరింత పదిలం చేసుకుంటూ దూసుకుపోతుంటే, నంద్యాల జిల్లా నందికొట్కూరు మున్సిపాలిటీ మాత్రం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది.

రాష్ట్రం అంతా ఒకవైపు.. నందికొట్కూరు మరోవైపు

రాష్ట్రంలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఎక్కడ చూసినా కూటమి అభ్యర్థులదే హవా కొనసాగుతోంది. అధికారంలో ఉన్నామన్న బలం, ప్రభుత్వ పథకాలతో కూటమి క్లీన్ స్వీప్ చేస్తోంది. అయితే ఈ ప్రభంజనాన్ని తట్టుకుని నంద్యాల జిల్లాలోని నందికొట్కూరు మున్సిపాలిటీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరుగులేని విజయాన్ని నమోదు చేసింది. రాష్ట్రమంతా ఒకవైపు, నందికొట్కూరు మరోవైపు అన్న నానుడిని నిజం చేసింది.

23 వార్డుల్లో ఫ్యాన్ హవా

మొత్తం 32 వార్డులున్న నందికొట్కూరు మున్సిపాలిటీలో వైఎస్సార్‌సీపీ ఏకంగా 23 వార్డులను కైవసం చేసుకుని స్పష్టమైన మెజారిటీతో పాలకవర్గాన్ని ఏర్పాటు చేయబోతోంది. అధికార టీడీపీ కేవలం 9 వార్డులకే పరిమితమై చతికిలపడింది. జనసేన, బీజేపీలకు ఒక్క వార్డు కూడా దక్కలేదు. నంద్యాల జిల్లా వైసీపీకి కంచుకోట లాంటిది. గత సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రమంతా కూటమి వేవ్ ఉన్నా నందికొట్కూరు, ఆళ్లగడ్డ లాంటి నియోజకవర్గాల్లో వైసీపీ పోటీ ఇచ్చింది. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో ఆ పట్టును మరింత బిగించింది. స్థానికంగా ఉన్న వైసీపీ నాయకత్వం బలం, క్యాడర్ ఐక్యత, టీడీపీలోని అంతర్గత విభేదాలే ఈ విజయానికి కారణమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఏదేమైనా ఏపీ మున్సిపల్ ఫలితాల్లో వైసీపీకి దక్కిన ఏకైక భారీ విజయంగా, ఓదార్పుగా నందికొట్కూరు ఫలితం నిలిచిపోనుంది. ఈ ఫలితంతో నందికొట్కూరు వైసీపీ శ్రేణుల్లో పెద్ద ఎత్తున సంబరాలు జరుగుతున్నాయి. టపాసులు పేల్చి, మిఠాయిలు పంచుకుంటూ తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేసి, విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య



మంచిర్యాల (ప్రతినిధి) నవంబర్ 3 విజన్ ఆంధ్ర : ప్రభుత్వ పాఠశాలలలో అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసి, విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, విద్యార్థులకు అందిస్తున్న విద్యా, వసతి సౌకర్యాలు, సివిల్ పనుల పురోగతిని సమీక్షించడంతో పాటు, తరగతి గదులు, వసతి గృహాలు, వంటగది, తాగునీటి సదుపాయాలు, విద్యార్థుల హాజరు, విద్యా ప్రగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సివిల్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు వేగం పెంచాలని, నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పనుల అమలులో ఎలాంటి జాప్యం జరగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసన స్థాయిని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, ప్రతి విద్యార్థి అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరిచేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా, వసతి, ఇతర సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని తెలిపారు. విద్యార్థుల వసతి గృహాలు, వంటగదిని పరిశీలించి, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, పరిశుభ్రత, నిర్వహణ తీరును సమీక్షించారు. నీటిని వృథాను అరికట్టాలని, ప్రతి నీటి బొట్టును బాధ్యతాయుతంగా వినియోగించాలని తెలిపారు. నీటి వృథాకు కారణమవుతున్న లీకేజీలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. విద్యార్థుల వివరాల నమోదు, రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని, ఎఫ్ ఆర్ ఎస్ వివరాలను నిర్దేశిత సమయంలోగా పూర్తి చేసి ఎప్పటికప్పుడు నవీకరించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల ప్రధాన భవనం వెలుపల లైటింగ్ సదుపాయం సరిగా లేని విషయాన్ని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఈ డబ్ల్యు ఐ డి సి ఎఈ బషీర్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, గుత్తేదారు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో మెప్మా ఏడీ.. రూ.4.75 కోట్ల అక్రమాస్తులు గుర్తింపు

- కిలోల కొద్దీ బంగారం, వెండి.. ఆస్తిపత్రాలు స్వాధీనం



హైదరాబాద్: ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలతో మెప్మా అదనపు డైరెక్టర్ నల్లగుంట్ల యాదగిరి రావుపై ఏసీబీ కేసు నమోదు చేసింది. హైదరాబాద్‌తో పాటు 10 ప్రాంతాల్లో మంగళవారం నిర్వహించిన సోదాల్లో సుమారు రూ.4.75 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించింది. ఉప్పల్ హైకోర్టు కాలనీలో రూ.2 కోట్ల విలువైన జీ+3 భవనంతో పాటు రెండు ఫ్లాట్లు, వాణిజ్య దుకాణం, వివిధ ప్రాంతాల్లో 12 ఓపెన్ ప్లాట్లకు సంబంధించిన పత్రాలను గుర్తించారు. అలాగే 1,792 గ్రాముల బంగారం, మూడు కిలోల వెండి, రూ.73 లక్షల విలువైన ఫార్చ్యూనర్ కారు, మరో కారు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వివిధ బ్యాంకు ఖాతాల్లో రూ.32.30 లక్షల నగదు నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. యాదగిరి రావు కుమారుడికి సంబంధించిన పరిశ్రమల పెట్టుబడులపైనా అధికారులు ఆరా తీస్తున్నారు. అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు తదుపరి విచారణ కొనసాగిస్తున్నారు.

ఆరోగ్య రంగంలో కీలక సమీక్షలు

- సెకండరీ హెల్త్‌కేర్ భవనాలు, క్యాన్సర్ సేవలపై మంత్రి రాజనర్సింహ ఫోకస్
- 90 శాతం వైద్య సేవలు జిల్లాల్లోనే అందించాలి,
- క్యాన్సర్‌కు మెరుగైన స్క్రీనింగ్, చికిత్స



తెలంగాణ స్టేట్ బ్యూరో, విజన్ ఆంధ్ర, నవంబర్ 03, సెక్రటేరియట్:

రాష్ట్రంలో వైద్య, ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వరుస సమీక్షలు నిర్వహించారు. జూబ్లీహిల్స్‌లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో సోమవారం జరిగిన ఈ సమావేశాల్లో సెకండరీ హెల్త్‌కేర్ భవన నిర్మాణాలు, క్యాన్సర్ వైద్య సేవలపై ప్రత్యేకంగా చర్చించారు. ఈ సమావేశాల్లో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ గౌరవ్ ఉప్పల్, ప్రభుత్వ సలహాదారు, క్యాన్సర్ వైద్య నిపుణులు నోరి దత్తాత్రేయుడు, వివిధ జిల్లాల డీసీహెచ్ఎస్ లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సెకండరీ హెల్త్‌కేర్ భవనాలు వేగంగా పూర్తి చేయాలి

సెకండరీ హెల్త్‌కేర్ డైరెక్టరేట్ (తెలంగాణ వైద్య విధాన పరిషత్) పరిధిలోని కమ్యునిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రుల భవన నిర్మాణ పనులపై మంత్రి మొదట సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా పలు ఆసుపత్రులు, మెడికల్, నర్సింగ్ కాలేజీల భవన నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని టీజీఎంఎస్ఐడీసీ ఎండీ గౌరవ్ ఉప్పల్ వివరించారు. ఇప్పటివరకు 9 ఆసుపత్రి భవనాల నిర్మాణం పూర్తయిందని, డిసెంబర్ నాటికి మరో 14 భవనాలు, 2027 మార్చి నాటికి మరో 11 భవనాలు పూర్తవుతాయని, మరో 45 భవనాలు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు.

పూర్తయిన 9 భవనాల్లో వెంటనే ఎక్విప్‌మెంట్, ఫర్నీచర్ ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, డిసెంబర్, మార్చిలో పూర్తయ్యే భవనాలకు కొనుగోలు ప్రక్రియను ఇప్పుడే ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. డీఎస్‌హెచ్ పరిధిలోని అన్ని భవనాలను వచ్చే ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రులు, సీహెచ్‌సీల పనితీరుపై ఆరా తీసిన మంత్రి, కనీసం 90 శాతం మంది పేషెంట్లకు జిల్లాల్లోనే వైద్య సేవలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో ఏరియా ఆసుపత్రులు, సీహెచ్‌సీల పాత్ర కీలకమని అన్నారు. గత మూడేళ్లలో ఆరోగ్యశాఖలో 15 వేల ఉద్యోగాలు, డీఎస్‌హెచ్ పరిధిలోనే 1616 మంది స్పెషలిస్ట్ డాక్టర్లను నియమించామని గుర్తు చేశారు. ఎల్‌నినో నేపథ్యంలో ఆసుపత్రుల్లో నీరు, విద్యుత్ సమస్యలు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని డీసీహెచ్ఎస్ లకు సూచించారు.

క్యాన్సర్ వైద్య సేవలపై ప్రత్యేక సమీక్ష

అదే రోజు ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్యాన్సర్ పేషెంట్లకు అందుతున్న సేవలపై కూడా మంత్రి సమీక్ష నిర్వహించారు. ఎంఎన్‌జే, నిమ్స్ ఆసుపత్రుల్లో అందిస్తున్న క్యాన్సర్ చికిత్స, జిల్లాల్లో ఏర్పాటు చేసిన కీమోథెరపీ సెంటర్ల పనితీరును అధికారులు వివరించారు. ఇటీవలే క్యాన్సర్‌ను నోటిఫయబుల్ డిసీజ్‌గా ప్రకటించి, క్యాన్సర్ రిజిస్ట్రీ, పోర్టల్‌ను ప్రారంభించిన నేపథ్యంలో క్యాన్సర్ నివారణ, ముందస్తు స్క్రీనింగ్, పేషెంట్లకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.

పోలీసుల వైఫల్యంపై సర్వత్రా విమర్శలు

డీజీపీ ప్రత్యేక దృష్టితోనైనా శాంతిభద్రతలు నెలకొంటాయా?



మంచిర్యాల (ప్రతినిధి) నవంబర్ 3 (విజన్ ఆంధ్ర) రాష్ట్రంలో అధికారం మారిన తర్వాత మంచిర్యాల నియోజకవర్గంలో చోటుచేసుకున్న రాజకీయ, సామాజిక పరిణామాలు ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ఒకప్పుడు ప్రశాంత వాతావరణానికి మారుపేరుగా నిలిచిన మంచిర్యాల, గత రెండు మూడేళ్లుగా రౌడీయిజానికి, గ్యాంగ్ వార్లకు అడ్డాగా మారి అశాంతికి నిలయమైంది. స్థానిక వర్గ పోరు, అధికార అండదండలతో రౌడీ మూకలు యథేచ్ఛగా చెలరేగిపోతుండడంతో సామాన్య ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు.

రాజకీయ పార్టీలు, వయసులతో సంబంధం లేకుండా జులుం

గతంలో అధికార పార్టీ నాయకుడికి అనుబంధంగా ఏర్పడిన వర్గం మంచిర్యాలలో సాగించిన దౌర్జన్యాలు అంతా ఇంతా కాదు. టీఆర్ఎస్ (బీఆర్ఎస్), బీజేపీ, కాంగ్రెస్ అనే రాజకీయ విభేదాలు లేకుండా, తమకు అడ్డొచ్చిన ప్రతి ఒక్కరిపై రౌడీలు దాడులకు తెగబడ్డారు. 16 ఏళ్ల మైనర్ల నుంచి 50 ఏళ్లు పైబడిన పెద్దల వరకు ఎవరినీ లెక్కచేయకుండా జులుం ప్రదర్శించారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా నిత్యం 24 గంటలూ సాగే వీధిపోరాటాలు, గ్యాంగ్ వార్లకు మంచిర్యాల వేదికైంది. ఒకప్పుడు పక్కనే ఉన్న గోదావరిఖని అంటేనే ప్రజలు గొడవలకు జంకేవారు, కానీ నేడు మంచిర్యాల అంతకంటే ప్రమాదకరంగా మారిపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుటుంబంతో బయటకు రావాలంటేనే వణుకు

పట్టణంలో శాంతిభద్రతలు ఎంతలా దిగజారాయంటే, మహిళలు, పిల్లలతో కలిసి సామాన్యులు రోడ్డుపైకి రావాలంటేనే భయపడే పరిస్థితులు దాపురించాయి. ఈ అరాచకాలపై ఖాకీలు చూసీచూడనట్లు వ్యవహరించారా? లేక అధికార పక్షపు ఒత్తిళ్లకు తలొగ్గారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రౌడీయిజాన్ని కూకటివేళ్లతో పెకిలిస్తామని అధికారులు చెప్పినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆ దిశగా కఠిన చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించలేదు. గతంలో ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిన పోలీస్ అధికారి నుంచి ప్రస్తుత అధికారి వరకు ఆయా అధికారుల సహాయంతో రౌడీలపై ఎలాంటి చర్యలు జరిగాయో ప్రజలు ప్రత్యక్షంగా చూశారు.

డీజీపీ దృష్టితోనైనా మార్పు వస్తుందా?

ఈ పరిణామాల నేపథ్యంలో రాష్ట్ర డీజీపీ ప్రత్యేకంగా మంచిర్యాలపై దృష్టి సారించడం స్థానికంగా ఆసక్తి రేకెత్తిస్తోంది. శాంతిభద్రతలను గాడిన పెడతామని అధికారులు చెబుతున్న మాటలు క్షేత్రస్థాయిలో ఏ మేరకు అమలవుతాయో వేచి చూడాల్సి ఉంది. రాబోయే రోజుల్లో మంచిర్యాలలో శాంతిభద్రతలు మెరుగవుతాయా? లేక రౌడీ రాజ్యం కొత్త రూపం దాల్చి మళ్లీ విజృంభిస్తుందా? అన్నది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

డీజీపీ ప్రత్యేక చొరవతో రంగంలోకి దిగిన ఖాకీలు

మంచిర్యాలలో పోలీసుల దూకుడు

కేఫ్‌లపై ఆకస్మిక దాడులు.. బైక్ రైడర్ల ఆటకట్టు అర్ధరాత్రి ఆకతాయిలకు లాఠీ దెబ్బలు.. బెల్ట్ షాపులపై ఉక్కుపాదం! మరోవైపు 'యంగ్ ఐపీఎస్'ను కేటాయించాలని మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు వినతి తెలంగాణ డీజీపీ ప్రత్యేక చొరవతో మంచిర్యాల జిల్లాలో పోలీస్ యంత్రాంగం ఒక్కసారిగా దూకుడు పెంచింది. శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా రాత్రి వేళల్లో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆకతాయిల ఆటకట్టు.. లాఠీలతో సమాధానం

అర్ధరాత్రి కాగానే ఖాళీ రోడ్లపై బైకులతో వికృత చేష్టలు, రేసింగ్‌లకు పాల్పడుతూ ప్రజల ప్రశాంతతకు భంగం కలిగిస్తున్న జులాయిలపై పోలీసులు నిఘా పెంచారు. ఆర్టీసీ బస్ స్టాండ్, ఏసీసీ ఏరియా, ఐబీ చౌరస్తా వంటి కీలక కూడళ్లలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి గస్తీ ముమ్మరం చేశారు. రాత్రి పూట అనవసరంగా బైక్‌లపై తిరుగుతూ హల్‌చల్ చేసే ఆకతాయిలకు తమదైన శైలిలో లాఠీలతో సమాధానమిస్తూ, వారిని క్రమశిక్షణకు తెచ్చే చర్యలు చేపట్టారు.



నిఘాను ముమ్మరం చేస్తూ అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతోంది. ఇందులో భాగంగా రాళ్ళపేటలోని తెలంగాణ తల్లి విగ్రహం సమీపంలో ఉన్న ఓ కేఫ్‌పై ఏసీపీ ప్రకాష్ ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అర్ధరాత్రి వేళల్లో కారణం లేకుండా కేఫ్‌ల వద్ద గుమిగూడుతున్న యువకులను అదుపులోకి తీసుకుని, సమయం దాటిన తర్వాత రోడ్లపై తిరగడం వల్ల కలిగే అనర్థాలపై వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

బెల్ట్ షాపులపై పోలీసుల కొరడా

మంచిర్యాల పట్టణంలో 24 గంటలూ మద్యం దొరుకుతుందన్న అపవాదును తుడిచిపెట్టేందుకు పోలీసులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. హైటెక్ సిటీ కాలనీ కమాన్ ఎదురుగా రాత్రింబవళ్లు తేడా లేకుండా సాగుతున్న అక్రమ మద్యం విక్రయాలపై సీఐ ప్రమోద్ నేతృత్వంలో దాడులు నిర్వహించి కట్టడి చేశారు. నిబంధనలు అతిక్రమించి మద్యం విక్రయిస్తే

విజన్ ఆంధ్ర న్యూస్ ఎఫెక్ట్..!

మూతపడిన అక్రమ వెంచర్!

- అక్టోబర్ 26న ప్రచురించిన కథనంతో కదలిక
- మన్నర్రిలో అనుమతులు లేని వెంచర్‌కు తాత్కాలికంగా తెర


విజన్ ఆంధ్ర
మన్నర్రిలో వెలిసిన అక్రమ వెంచర్!
- గ్రామ పంచాయతీ నోటీసులకు బేఖాతరు..అనుమతులు లేకుండానే ప్లాట్ల విక్రయాలు?
- సర్వే నంబర్ 412లో సుమారు 10 ఎకరాల భూమిలో వెంచర్ ఏర్పాటు
- మూడు నోటీసులు జారీ చేసినా స్పందించని యాజమాన్యం
- అక్టోబర్ 8న చివరి నోటీసు జారీ


VISION ANDHRA
EFFECT
VISION ANDHRA

షాబాద్, నవంబర్ 3 (విజన్ ఆంధ్ర): విజన్ ఆంధ్ర పత్రికలో ప్రచురితమైన వార్తా కథనానికి స్పందన లభించింది. షాబాద్ మండలం మన్నర్రి గ్రామంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న హిందూస్తాన్ వెంచర్‌ను నిర్వాహకులు మంగళవారం మూసివేశారు. గత నెల అక్టోబర్ 26న మన్నర్రి గ్రామంలో అనుమతులు లేని వెంచర్ కార్యకలాపాలపై విజన్ ఆంధ్ర పత్రికలో ప్రత్యేక కథనం ప్రచురితమైంది.

ఈ కథనం వెలువడిన అనంతరం సంబంధిత వర్గాల్లో కదలిక మొదలైంది. తాజాగా హిందూస్తాన్ వెంచర్ నిర్వాహకులు వెంచర్‌ను మూసివేయడంతో వార్తా కథనంపై స్పందన కనిపించింది. ప్రజా సమస్యలు, అక్రమ నిర్మాణాలు, అనుమతుల్లేని వెంచర్లపై నిరంతరం కథనాలు ప్రచురిస్తూ ప్రజల పక్షాన నిలుస్తున్న విజన్ ఆంధ్ర న్యూస్‌కు ఈ పరిణామం మరో స్పందనగా నిలిచింది. అయితే వెంచర్‌కు సంబంధించిన అనుమతుల స్థితిపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
30 Oct 2026 - Page 9
epaper.visionandhra.in
విజన్ ఆంధ్ర ఎఫెక్ట్..
అక్రమ వెంచర్‌పై అధికారుల స్పందన!
- మన్నర్రి గ్రామంలో వెంచర్ పరిశీలన..
- నోటీసులు జారీ చేయాలని ఆదేశాలు
విజన్ ఆంధ్ర
మన్నర్రిలో వెలిసిన అక్రమ వెంచర్!

షాబాద్, అక్టోబర్ 29 (విజన్ ఆంధ్ర): షాబాద్ మండల పరిధిలోని మన్నర్రి గ్రామంలో నిర్మిస్తున్న అక్రమ వెంచర్‌పై విజన్ ఆంధ్రలో అక్టోబర్ 26న ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. వెంచర్ వ్యవహారంపై స్పందించిన డీఎల్‌పీఓ, ఎంపీఓలు గురువారం వెంచర్‌ను పరిశీలించి, నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు వెంచర్‌ను పరిశీలించిన అధికారులు, సంబంధిత వివరాలను పరిశీలించి నోటీసులు జారీ చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. దీంతో అక్రమ వెంచర్ వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది.విజన్ ఆంధ్రలో వార్త ప్రచురితం కావడంతో అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టడం స్థానికంగా ప్రాధాన్యత సంతరించుకుంది. వెంచర్‌పై తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.